తెలుగు సాహిత్య

వ్యాస విజయం

(వ్యాస సంపుటి)

డా. డి. విజయకుమారి
కేంద్రీయ విశ్వవిద్యాలయం,
హైదరాబాద్.

2024

తెలుగు సాహిత్య వ్యాస విజయం

ISBN No. 978-93-5526-281-3

తెలుగు సాహిత్య

వ్యాస విజయం

(వ్యాస సంపుటి)

డా. డి. విజయకుమారి

తెలుగు శాఖ

హైదరాబాదు

2024

తెలుగు సాహిత్య వ్యాస విజయం
(వ్యాస సంపుటి)

రచయిత :
డా. దాసర విజయకుమారి
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ,
హైదరాబాదు విశ్వవిద్యాలయం.

ముద్రణ : జూన్, 2024
ప్రతులు : 500
వెల : **100/-**

ప్రచురణ :
సూర్య పబ్లికేషన్స్
శ్రీనిలయం, ఫ్లాట్ నెం. 302
C-13/A హుడా కాంప్లెక్స్,
సరూర్‌నగర్,
హైదరాబాదు-500 035

ముద్రణ
ఓం సాయి గ్రాఫిక్స్
3-4-709, నారాయణగూడ,
హైదరాబాదు.

TELUGU SAHITYA VYSYA VIJAYAM
(Vyasa Samputi)

Author :
Dr. D. Vijaya Kumari
Asst. Prof. Telugu Department
University of Hyderabad.

Print : June, 2024
Copies : 500
Price : **100/-**

Publication :
SURYA PUBLICATIONS
Srinilayam, Flat No.302
C-13/A Huda Complex,
Saroornagar,
Hyderabad-500 035

Printing
Om Sai Graphics,
3-4-709, Narayanaguda,
Hyderabad.

ISBN No. 978-93-5526-281-3

నడుపల్లి శ్రీరామరాజు
విశ్రాంత తెలుగు ఆచార్యులు
హైదరాబాదు విశ్వవిద్యాలయం

ఇంటినెం. 297, డోయెన్స్ టౌన్‌షిప్
శేరిలింగంపల్లి, హైదరాబాదు-19

ఆశీస్సులు

చిరంజీవి శ్రీమతి డాక్టర్ విజయకుమారి తను రచించిన వ్యాసాలను ఒక సంకలనంగా ప్రకటిస్తున్నాని చెప్పి నా ఆశీస్సు కోరారు. ఆమె హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయంలో 2004లో జానపద సాహిత్యం అభిమాన విషయంగా డాక్టరేట్ డిగ్రీ పొందారు. అదే విశ్వవిద్యాలయంలో గత పదమూడు సంవత్సరాలుగా అధ్యాపనం చేస్తున్నారు. పరిశోధక విద్యార్థులకు మార్గదర్శనం చేస్తున్నారు. తరచుగా విద్వద్గోష్ఠులలో పాల్గొంటారు. పరిశోధన పత్రాలు సమర్పిస్తారు. ఇలా ఎప్పుడూ సాహిత్య వ్యాసంగంతో తలమున్కలై ఉంటారు. ఇంతటి అనుభవము ప్రతిభా ఉన్న డాక్టర్ విజయకుమారి పన్నెండు సంవత్సరాలక్రితం ఉద్యోగ విరమణ చేసిన నన్ను ఆశీస్సులు కోరడం నాకు ఆశ్చర్యం కలిగించింది. వెంటనే ఆమెలో మూర్తీభవించిన సంస్కారలక్ష్మి కనిపించింది. చిన్నయసూరి చెప్పిన "విద్య యొసగును వినయంబు, వినయము ననుబడయు బాత్రత, పాత్రత వలన ధనము, ధనము వలనను ధర్మంబు...." అనే లక్షణానికి లక్ష్యం ఇది కదా! అనిపించింది. ఇక్కడ ధర్మం అంటే విహిత కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నిర్వహించడం. ఇది ఈమె పట్ల అన్వయించినట్లు ఏ కొద్దిమందిలోనో చూస్తాము.

కొందరు అధ్యాపకులుగానే ఉంటారు. మరికొందరు అధ్యాపకులుగా ఉంటూ చదువును విస్తృతపరచుకుంటారు. పరిశోధన వ్యాసరచనను కొనసాగిస్తారు. ఆ మరికొందరిలో డాక్టర్ విజయకుమారి ముందు వరుసలో ఉంటారు. ఇది ఆనందించదగిన విషయం కదా! ఆమెలోని ఇటువంటి సుగుణాలే నాచేత ఆశీస్సులు పలకిస్తున్నాయి.

శతమానం భవతి శతాయుఃపురుషః
శతేంద్రియ ఆయుష్యేవేంద్రియే ప్రతి తిష్ఠతి

హైదరాబాద్
1-6-2024

నడుపల్లి శ్రీరామరాజు
విశ్రాంత తెలుగు ఆచార్యులు
హైదరాబాదు విశ్వవిద్యాలయం

విజయ'దశ' కుసుమాలు

తెలుగుశాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో జానపద సాహిత్యం మీద ఎం.ఫిల్., పిహెచ్.డి., పి.డి.ఎఫ్. పరిశోధక విద్యార్థిగాను, 2010 నుంచి సహాధ్యాపకురాలుగా డా॥ దాసర విజయకుమారి గారు నాకు సుపరిచితులు. నిరంతర శ్రమ జీవి సహనశీలి, మృదుస్వభావి. అన్యాయాన్ని ఎదుర్కొనే ధీ(బుద్ధి)శాలి. ఏ బోధనాంశాన్నైనా బోధించడానికి సుముఖంగా ఉంటారు. కరోనా కాలాన్ని వృధా చెయ్యకుండా అనేక అంతర్జాల సదస్సుల్లో పాల్గొని సమర్పించిన పరిశోధనాత్మక వ్యాసాలను, అనేక సంచికల్లో ముద్రణ పొందిన వ్యాసాలను 'వ్యాస విజయం' పేరుతో ఒక గ్రంథాన్ని మన ముందుకు తీసుకు వచ్చినందుకు శుభాభినందనలు.

'వ్యాస విజయం' వివిధాంశాలతో కూడుకున్న పది వ్యాసాల సమాహారం. 'మల్లంపల్లి సోమశేఖరశర్మ వ్యాసాలు – బౌద్ధమతం'లో ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం గ్రంథ నిర్మాణంలో ఒకరైన మల్లంపల్లి వారు వివిధ పత్రికల్లో రాసిన వ్యాసాల ఆధారంగాను, బౌద్ధ చిత్రాలలోని కథలను, కళలను, అనేక అంశాలను వివరించే ప్రయత్నం చేశారు. ఈ వ్యాసంలో బౌద్ధ మతంలోని శాఖలను, చీనా, హిందూ దేశాలలోని బౌద్ధ మత వ్యాప్తిని, మత గ్రంథాలను, బౌద్ధ చిత్రాలను గురించి వివరించారు. ఆంధ్రుల వేషధారణ రాజవంశాలకు సంబంధించిన వివరాలను కూడా ప్రస్తావించారు. గోలి స్తూపంలోని శిలాఫలకాలపై బుద్ధని కథలు, బుద్ధుని జీవితంతో గల సంబంధాలను వివరించే కథలున్నాయి. ఏనుగు, నాగరాజు వంటి చిత్రాలు బుద్ధుని జీవితంలో అవి నిర్వహించిన పాత్రలను స్ఫురణకు తెస్తాయి. వెస్సంతరునిగా బుద్ధుని జననం, బుద్ధుని అనేక అవతారాలను తెలియజేసే జాతక కథలను అనేక స్థూపాలలోని చిత్రాల మూలంగా వివరించారు. బౌద్ధ మతంలో శిక్షలు, ప్రాయశ్చిత్తాలు ఉంటాయనే వివరాలను, ధర్మావలంబనం, ఆత్మావలోకం, ఆత్మపరీక్ష వంటి ఆచారాలను, న్యాయ నిర్ణేతలు ఉండేవారన్న వివరాలను ఈ కథల మూలంగా గ్రహించవచ్చు.

ఆధునిక కాలంలో ఏర్పడిన నవల, కథానిక, ఏకాంకిక వంటి సాహిత్య ప్రక్రియల నుండి వృద్ధి పొందిన అంటు మొక్క నాటిక. 'కురంగ గౌరీశంకర నాటిక – విశ్లేషణాత్మక పరిశీలన'లో అనేక ప్రక్రియల్లో రచనలు కొనసాగించిన అభినవ బాసుడుగా పేరు పొందిన దాసు శ్రీరాములు రచించిన కురంగ గౌరీశంకర నాటికలోని అంశాలను, సన్నివేశ కల్పన, పాత్రపోషణ, రస పోషణ, ఉపదేశం వంటి అనేక అంశాలతో పాటు నాటిక నిర్మాణాన్ని గురించి సంస్కృత, ఆధునిక నాటక లక్షణాలతో పోల్చి నాటిక రచయిత చేసిన సృజనాత్మక సమ్మేళనాన్ని గురించి విశ్లేషించారు. ప్రధాన కథకు రచయిత చేసిన మార్పులను సూక్ష్మంగా వివరించారు. డా॥ విజయకుమారిగారు తనకు కలిగిన అభిప్రాయాలను నిక్కచ్చిగా చెప్పడంలో ఏ మాత్రం సందేహించరు.

'గురజాడ ముత్యాలసరాలు – ఛందోవైశిష్ట్యం' వ్యాసంలో పార్శీ గజల్, రచ్చ, రేకులు, కళిక, ఉత్కళిక, రగడ భేదాలు, బతుకమ్మ పాటలు, గురజాడ నీలగిరి పాటలలోని ముత్యాలసరాలు ఛందస్సులోని భేదాలను గుర్తించి తులనాత్మకంగా అధ్యయనం చేశారు. 'పెన్నేటి పాట – సమకాలీన సామాజిక దృక్కోణం' రాయలసీమ కన్నీటి గాథగా గుర్తింపు పొందిన పెన్నేటి పాట విద్వాన్ విశ్వం రచించిన కావ్యం. ఈ కావ్యంలో రాయలసీమ రైతు జీవనం, సమకాలీన సామాజిక స్థితిగతులు, ప్రతిబింబితమైన పరిస్థితులు సీమవాసుల గుండె చప్పుళ్ళకు ప్రతీక. పెన్నేటి పాటలో కవి వర్ణించిన ప్రకృతి వర్ణన ప్రాచీన కావ్యాలలోని ప్రకృతి వర్ణనలను అతీతంగా రాయలసీమ ప్రకృతిని సహజంగా వర్ణించిన తీరు అధిక్షేపాత్మకంగా కనిపించినా అది సహజసిద్ధమైన వర్ణనగా పాఠకుల మనస్సును హత్తుకుంటుంది. నాగుపాములు, బొంత గద్దలు, తిప్ప తీగలు, రేగు కంపలు, పొదరిళ్ల గురించి వ్యంగ్యంగా కొనసాగిన పెన్నేటి పాట పూర్వ కవులకు చురక. రంగన్న వెట్టి చాకిరీ, సీమ ఆహారం, దాంపత్యం, జీవితం కొనసాగిన తీరు, స్త్రీ శ్రమ జీవనం మొదలైన అంశాలతో పాటు భాషాంశాలను కూడా రచయిత్రి వివరించారు.

'సినారె గజళ్ళు – వస్తు వైవిధ్యం' వ్యాసంలో గజళ్ళ స్వరూపాన్ని గజల్‌లోని మానవీయ, తాత్త్విక దృక్పథాలను వివరించారు. సంఘర్షణలోనే శక్తి, అన్వేషణలోనే సత్యం, ఆందోళనలోనే ఆర్తి వెలికివచ్చినట్లైతే సమాజం ముందడుగు వేస్తుందనే మానవీయ కోణాన్ని సినారె అభివ్యక్తం చేశారు. విత్తనం చిన్నదే కానీ మట్టిని చేరి మహావృక్షం అవుతుంది. ఇందులోనే మానవ జీవితం అంతరార్థం దాగి ఉందనే సత్యాన్ని అందజేశారు. స్నేహం, అసూయ, దళిత దృక్పథం, పిరికితనం, మత సామరస్యం వంటి అంశాలను ఈ వ్యాసంలో పరిశీలించారు.

'తెలంగాణ కథలు – దళిత స్త్రీ జీవన చిత్రణ' వ్యాసంలో దళితుల హక్కులను అక్రమంగా చేజిక్కించుకున్న ధనవంతులు తీరును 'మా వూరు ముచ్చట్లు'లో చూడవచ్చు.

భిక్షాటకులను కూడా బతకనివ్వని సమాజాన్ని 'లచ్చి' కథలో గమనించవచ్చు. అప్పులవాళ్ళ వలన, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల వల్ల నష్టపోయిన స్వయం ఉపాధితో జీవనం కొనసాగించాలనుకొనేవారి జీవన పోరాటాన్ని 'గిర్నిబాయి' కథలో పరిశీలించవచ్చు. కల్లు అమ్ముకుంటూ జీవనం సాగించే స్త్రీ వృధా జీవిత గాథను 'ఊరుమ్మడి బతుకు' కథలో చూడవచ్చు.

'తెలంగాణ కథలు – సామాజిక జీవన చిత్రణ' వ్యాసంలో గాయపడిన జంతువుల పట్ల భూతదయ కలిగి ఉండాలని చెప్పే సామాజిక వ్యవస్థ మాంసాహార భక్షకుల పట్ల వివక్ష ఎందుకు చూపుతుందని రచయిత కాళోజి నారాయణరావు 'మనమే నయం' అన్న కథలో ప్రశ్నించారు. పేదల జీవితాల కన్నా జంతువుల జీవనమే మేలని చూపించే ప్రయత్నం ఈ కథలో చేశారు. గోండుల కుటుంబ ఆచార వ్యవహారాలను తెలియజేసే క్రమంలో వారి విశ్వాసాలను చూపించే కథ 'జంగుబాయి'. ఈ కథలో స్త్రీల సమస్యలను రచయిత్రి వివరంగా చర్చించారు.

కూలి గింజల మీద ఆధారపడి బతికే రైతు కుటుంబానికి చెందిన సాంబయ్య యూనివర్సిటీలో ఉద్యోగం ఇప్పిస్తానని ప్రకాశరావు తన ఇంట్లో చాకిరీ చేయించుకొని చివరికి మొండిచేయి చూపించిన తీరు 'చెర' కథలో నవీన్ తెలియజేశారు. కొడుకును విదేశాలకు పంపించాలన్న దృష్టితో గీత కార్మికుడు తాటిచెట్టు పైనుండి కింద పడితే ప్రభుత్వం వారు ఎక్స్ గ్రేషియా ఇస్తుందన్న ఆలోచనతో తన ప్రాణాలను త్యాగం చేసిన సన్నివేశం 'అంతర్ముఖం' కథలో చూడవచ్చు. దళిత జీవనంలోని భిన్న కోణాలను ఈ రెండు వ్యాసాలలో విశ్లేషించారు.

'విముక్త కథలు – సమకాలీన దృక్కోణం' వ్యాసంలో రామాయణంలోని స్త్రీ పాత్రలు తమలో తాము సంఘర్షిస్తూ స్త్రీ సమస్యలకు పరిష్కారం చూపిస్తూ కొనసాగిన రచనా విధానాన్ని ఓల్గా 'విముక్త' కథల్లో చూడవచ్చు. చలాచలనాలకు, సౌందర్యా సౌందర్యాలకు అభేదాన్ని దర్శించగలిగిన స్థాయికి ఎదిగిన శూర్పణక పాత్రను, సమాజంలోని వ్యక్తుల మనస్తత్వాలను సీతా అహల్యల సంభాషణ మూలంగా గ్రహించవచ్చు. ప్రపంచంలో ఒక భాగంగా స్త్రీ ఎదగాలని రచయిత్రి సూచించారు. స్త్రీల ప్రాతివ్రత్యం సైకత కుంభం వంటిదని రేణుక పాత్ర ద్వారా వివరించారు. మానసిక సంఘర్షణల ద్వారా ఆవేదనల నుండి విముక్తమైన రామాయణంలోని స్త్రీ పాత్రలను గురించి వివరిస్తూ జీవితాలను ఏ విధంగా సార్థకం చేసుకోవాలో రచయిత్రి ఈనాటి సమాజానికి విముక్త కథల ద్వారా కొత్తకోణాలను ఆవిష్కరించారు.

'మాతృభాషా మాధ్యమం – సాంకేతిక పదాలు' వ్యాసంలో విజ్ఞాన శాస్త్రాన్ని బోధించేటప్పుడు ఆంగ్లంలో ఉన్న సాంకేతిక పదాలను అనువాదం చెయ్యకుండా యథాతథంగా బోధించడం వల్ల విద్యార్థికి అవగాహనా పరిధి పెరుగుతుందనే అభిప్రాయాన్ని రచయిత్రి ఉదాహరణ పూర్వకంగా తెలియజేశారు. వివిధ శాస్త్రాలలో కొన్ని సాంకేతిక పదాలకు తెలుగు అనువాద పదాలను అందించే క్రమంలో సరైన అర్థాన్ని స్ఫురింపజేసే పదాన్ని అందించలేకపోవడం పలు సందర్భాలలో ఎదురయ్యే అనువాద సమస్య. అటువంటి సందర్భాలలో ఆంగ్ల సాంకేతిక పదాలనే ప్రయోగించడం వలన అవగాహన సౌలభ్యం ఏర్పడుతుంది.

విజయ'దశ' కుసుమాలు డా॥ విజయకుమారి గారికి మరిన్ని విజయాలు చేకూర్చాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ... వారిని అభినందిస్తున్నాను.

హైదరాబాద్
1-6-2024

ఆచార్య జి. అరుణకుమారి
విశ్రాంతాచార్యులు,
హైదరాబాదు విశ్వవిద్యాలయం

కృతజ్ఞతలు

"మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ" అన్న వాక్యాలు నాకు నిత్య స్మరణాయిాలు... నన్ను ఈ స్థాయిలో నిలబెట్టిన తల్లిదండ్రుల ఋణం తీర్చుకోవడం అసాధ్యం. వారికి కృతజ్ఞతలు ఏమని చెప్పగలను. నా అభివృద్ధిని ఆకాంక్షించే మా గురువుగారు ఆచార్య నడుపల్లి శ్రీరామరాజుగారు, నేను అడిగిన వెంటనే వారి "ఆశీస్సు" అందించారు. ఆయన సతీమణిగారు కూడా నన్ను వారి పెద్దకూతురుగా ఆదరించి అభిమానిస్తారు. వారిరువురికి నా కృతజ్ఞతాభివందనాలు.

నాకు సహాయ సహాకారాలు అందించి, నా అభివృద్ధిని ఆకాంక్షించే మరొక గురువు ఆచార్య జి. అరుణకుమారి గారు. నాకు ఒడిదుడుకులు ఎదురైనప్పుడు ధైర్యం చెప్పి, ప్రోత్సహించినవారు. సహ ఉద్యోగులుగా 12 సంవత్సరాలు ఎటువంటి అరమరికలు లేకుండా కలసి ఉన్న ఆత్మీయ కుటుంబ అనుబంధం మాది. నేను అడిగిన వెంటనే నా ఈ చిన్న ప్రయత్నానికి వారి అభినందన కుసుమాలను అందజేశారు. ఆచార్య జి. అరుణకుమారి మేడమ్ గారి గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. ఆమెకు నా కృతజ్ఞతాంజులులు. ప్రతి గురువు శిష్యులను తమ సంతానంగా భావించాలి. ఆ విధంగా చేస్తే అది కుటుంబ ఆత్మీయ బంధంగా మారుతుంది. అలా చూసినవారు ఆచార్య నడుపల్లి శ్రీరామరాజుగారు, ఆచార్య జి. అరుణకుమారిగారు.

నా కష్టసుఖాలలో కొండంత అండగా ఉండే అన్నదమ్ములకు అక్కచెల్లెళ్ళకు నా కృతజ్ఞతలు.

పై విషయాలన్నీ ఒక ఎత్తైతే నా భర్త నాకు ఇచ్చే ధైర్యం మరో ఎత్తు. నీకు నేనున్నాను అని నాకు వెన్నుదన్నుగా నిలిచి, కష్టం నా దరిదాపులకి రాకుండా నిరంతరం నన్ను ప్రోత్సహించే మహోన్నత వ్యక్తి. ఆయనే నా ధైర్యం, నా విశ్వాసం. ఆయన నా పట్ల చూపే శ్రద్ధ, ఇచ్చే ప్రోత్సాహం మాటలలో చెప్పనలవి కానిది. నా ప్రతి విజయం వెనుక ఆయన ఉంటారు. ఆయనకు మనఃపూర్వక కృతజ్ఞతలు. మా అబ్బాయి వల్ల కలిగే ఆనందం అవధులు లేనిది. స్వర్గస్తులైన అత్తగారి మామగారి ఆశీస్సులు ఎల్లప్పుడూ నాతోనే ఉంటాయి.

విషయసూచిక

□ □ □

ప్రస్తావన

'తెలుగు సాహిత్య వ్యాస విజయం' అనే గ్రంథంలో పది వ్యాసాలున్నాయి. మొదటి వ్యాసం బౌద్ధమతానికి సంబంధించినది. రెండవది నాటికకు సంబంధించినది. 3వ, 4వ, 5వ వ్యాసాలు సాహిత్యానికి చెందినవి. 6వ, 7వ 8వ వ్యాసాలు కథలకు చెందిన అంశాలను తెలియజేప్పేవి. 9వ, 10వ వ్యాసాలు భాషకు చెందినవి. మొదటి వ్యాసమైన 'మల్లంపల్లి సోమశేఖరశర్మ వ్యాసాలు – బౌద్ధమతం' అనే దానిలో ఆ మత వ్యాప్తి, మత గ్రంథాలు, చిత్రాలు, గోలీస్తూపం, భర్హుత్ స్తూపం, నాగార్జునకొండ మొదలైన వాటిపై గల కథలు, బౌద్ధమతంపై హిందూమత ప్రభావం ఏ విధంగా ఉంది చర్చించాను. రెండవది 'కురంగ గౌరీశంకర నాటిక– విశ్లేషణాత్మక పరిశీలన' ఈ వ్యాసంలో దాసు శ్రీరాములుగారు రాసిన కురంగ గౌరీశంకర నాటిక గురించి విశ్లేషించాను. మూడవ వ్యాసం 'గురజాడ ముత్యాలసరాలు – ఛందోవైశిష్ట్యం. దీనిలో గురజాడ రాసిన కాసులు, పూర్ణమ్మ మొదలైన వాటిలో గల గతులు, జానపదగేయాలలో గల ముత్యాల సరాలు ఛందస్సు, రగడ భేదాలు మొదలైన వాటి గురించి అధ్యయనం చేశాను. నాలుగవ వ్యాసం పెన్నేటి పాట – సమకాలీన, సామాజిక దృక్కోణం, విద్వాన్ విశ్వంగారు రచించిన 'పెన్నేటిపాట' అనే కావ్యంలో రాయలసీమ స్థితిగతులు, రైతు జీవనం, ప్రకృతి వర్ణన, సీమ వెట్టి చాకిరీ స్త్రీ శ్రమజీవనం మొదలైన అంశాలను వివరించాను. అయిదవది 'సినారె గజళ్ళు – వస్తు వైవిధ్యం' ఈ వ్యాసంలో తాత్విక, దళిత దృక్పథాలతో బాటు, స్నేహం, అసూయ, పిరికితనం, మత సామరస్యం వంటి అంశాలను చర్చించాను.

ఆరు, ఏడు వ్యాసాలలో తెలంగాణ కథలలోని దళిత, సామాజిక జీవన చిత్రణను పరిశీలించాను. ఎనిమిదవ వ్యాసం 'విముక్త కథలు – సమకాలీన దృక్కోణం'. దీనిలో రచయిత్రి ఓల్గా రామాయణంలోని స్త్రీ పాత్రలను, నేటి సమాజంలోని స్త్రీ జీవితానికి ఏ విధంగా అన్యాయం చేశారో వివరించాను. తొమ్మిదవ వ్యాసం 'తెలుగు వ్యావహారిక భాషోద్యమం' గిడుగు రామమూర్తి పంతులుగారి వ్యవహారిక భాషోద్యమం గురించి చర్చించాను. పదవ వ్యాసం 'మాతృభాషా మాధ్యమం–సాంకేతిక పదాలు'. ఇందులో విజ్ఞాన శాస్త్రాలను బోధించేటప్పుడు సాంకేతిక పదాలను ఆంగ్లంలోనే బోధించడం వల్ల విద్యార్థులకు అవగాహన పెరుగుతుందనే విషయాన్ని విశదీకరించాను.

ఈ విధంగా వివిధ అంశాలు గల పది వ్యాసాలను ఈ గ్రంథంలో పొందుపరిచాను.

మల్లంపల్లి సోమశేఖర శర్మ వ్యాసాలు - బౌద్ధమతం

మల్లంపల్లి సోమశేఖరశర్మగారు పశ్చిమ గోదావరి జిల్లా పోడూరు మండలం లోని మినిమించిలిపాడులో 1891 డిశంబరు 9వ తేదీన జన్మించారు. ఈయనవి అనేక కథలు, నాటకాలు, నవలలు, పద్యాలు వివిధ పత్రికలలో ప్రచురితమయ్యాయి. శర్మగారు డిగ్రీలు లేని పండితులై సుప్రసిద్ధ పరిశోధకులుగా ప్రఖ్యాతిగాంచారు. తొలుత ఆయన చిలుకూరు వీరభద్రరావుగారికి సహాయంగా ఉండి ప్రాచీన కావ్యాలకు, శాసనాలకు ప్రతులు రాశారు. ఆ తరువాత కొమర్రాజు లక్ష్మణరావు, గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, ఆచంట లక్ష్మీపతి, రాయప్రోలు సుబ్బారావు మొదలైన వారితో కలసి ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం నిర్మాతలలో ఒకరైనారు. ఆయన శాసనాలను సేకరించి విశ్లేషించి, ఎపిగ్రాఫియా ఇండియా, భారతి, శారద ఆంధ్రపత్రిక వంటి పత్రికలలో వ్యాసాలు రాశారు. నేలటూరు వెంకటరమణయ్యతో కలసి, ఆచార్య యజ్దానీ సంపాదకత్వంలో వెలువడిన 'Early History of Deccan' లో సమగ్రమైన కాకతీయుల చరిత్రను రాశారు. శర్మగారు జానపద సాహిత్యాన్ని 'అనాదృత వాఙ్మయమని' నిర్వచించారు. వారు అనేక జానపద అంశాలను వ్యాసాలలో పేర్కొన్నారు.

అశోక చక్రవర్తి బౌద్ధమత ప్రచారం గురించి, అమరావతి స్థూపం, నాగార్జునకొండలోని చిత్రాల గురించి, గోలీ స్థూపం, బౌద్ధ శిలాచిత్రాలు, భర్హుత్ స్థూపం, తథాగతుని దంతధాతు చరిత్ర, బౌద్ధ సంస్కృతి మొదలైన అంశాల గురించి వ్యాసాలు రాశారు. ఈ వ్యాసాలను మోదుగుల రవికృష్ణ సంపాదకత్వంలో పుస్తకరూపంలోకి తెచ్చారు. పై అంశాలను ఈ వ్యాసంలో చర్చించడం జరిగింది.

బౌద్ధవాఙ్మయం పరిశోధన

క్రీ॥శ॥ 19వ శతాబ్దంలో ప్రాచ్య విజ్ఞాన పరిశోధన ప్రారంభమైంది. ఆ సందర్భంలో పాశ్చాత్య విద్వాంసుడైన బ్రియన్ హౌటన్ హాడ్గ్సన్ బౌద్ధమత

గ్రంథాలను పాళీ భాషలోనే గాక సంస్కృత భాషలో కూడ ఉన్నాయని క్రీ॥శ॥ 1821 మధ్య కాలంలో వెల్లడించారు. ఆయన 1821లో నేపాళ దేశంలో బ్రిటీష్ రెసిడెంట్‌గా నియమింపబడ్డాడు. ఆనాటి నుండి దేశ ప్రజల మత, వాఙ్మయాలను తెలుసుకునే ప్రయత్నం చేశాడు. బౌద్ధ మతాచార్యుల విహారాలకు, మఠాలకు వెళ్ళి, 60 బౌద్ధమత గ్రంథాలను సంపాదించి వాటిని బెంగాలు ఏసియాటిక్ సొసయిటీకి పంపాడు. కాని అక్కడ ఎవరు ఆ గ్రంథాలపై ఆసక్తి చూపకపోవడం వల్ల, ఇంకా రెండు జతల గ్రంథాలను సంపాదించి, ఒక జత "లండన్ సొసైటీ"కి మరొక జత "పారిస్ సొసైటీ"కి పంపించాడు. హాడ్గసన్ పరిశోధనల వల్ల బౌద్ధమత వాఙ్మయం నేపాల్ దేశంలో క్రీ॥శ॥ రెండువందల సంవత్సరాల నుండి ఉందని వెల్లడి అయ్యింది. క్రీ॥శ॥ 7, 8 శతాబ్ధాలలో ఈ వాఙ్మయమంతా టిబెట్ భాషలోకి అనువదించబడింది. చైనా నుండి ముద్రణాయంత్రం టిబెట్‌కి వచ్చిన తరువాత ఈ గ్రంథాలన్ని ముద్రించ బడ్డాయని శర్మగారు తెలియజేశారు.

అదే సమయంలో హంగరీ (ఆస్ట్రియా) నుండి అలెగ్జాండర్ –సోమ–డి–కొరోసీ అనే పరిశోధకుడు కాలినడకన మధ్య ఆసియాకు వచ్చి, అక్కడ ఆదివాసీ స్థలాలలో భాష నేర్చుకుని బౌద్ధమత గ్రంథ భండాగారాలున్నట్లు కనుగొన్నాడు. వీటిని 'కంజూర్, తండూర్' అని పిలుస్తారు. కంజూర్ గ్రంథ భండాగారంలో నూఱు, నూట ఎనిమిది సంపుటాలు, ఒక్కొక్క గ్రంథానికి పాఠ భేదాలు గల వేరు వేరు ప్రతులు, అసలు గ్రంథాలు నూట ఎనిమిది ఉన్నాయి. తంజూర్ గ్రంథ బండారంలో 225 సంపుటా లున్నాయని అతడు పత్రికలలో ప్రకటించాడు. అదే సమయంలో మంగోలియాలోని బౌద్ధ వాఙ్మయాన్ని, ష్మిట్ (Schmidt) సింహళము నందలి బౌద్ధ వాఙ్మయాన్ని జార్జి టర్నర్ పరిశోధించి లోకానికి పరిచయం చేశారు. హాడ్గ సన్ పారిస్ పంపిన బౌద్ధమత గ్రంథాలను యూజీన్ బర్నాఫ్ పరిశోధించి ఇంచు మించు అదే కాలంలో ప్రకటించాడు. ఈ పరిశోధనల వల్ల బౌద్ధమత గ్రంథాలు సంస్కృతంలో ఒక్క నేపాల్‌లోనే గాక చైనా, జపాన్, టిబెట్ దేశాలలో కూడా ఉన్నాయని వెల్లడి అయినది. సింహళ దేశంలో గల బౌద్ధమత గ్రంథాలు పాళీ భాషలో ఉన్నట్లే, బర్మా, సయామ్, ఆనామ్ మొదలైన ఆసియా ఖండ, దక్షిణ దేశాలలోని బౌద్ధమత గ్రంథాలు పాళీ భాషలోనే గలవు. పాళీ భాషలో గల బౌద్ధమతానికి, సంస్కృతంలో గల బౌద్ధమతానికి చాలా వ్యత్యాసముందని వీరు తెలియజేశారు. ఈ పాశ్చాత్యులు నేపాల్, టిబెట్, చీనా, జపానులలో వ్యాపించిన బౌద్ధమతానికి ఉత్తర బౌద్ధమని, సింహళము, సయామ్, బర్మా, ఆనామ్ దేశాలలోని

బౌద్ధమతానికి దక్షిణ బౌద్ధమని పేరు పెట్టారు. కాని ఈ విభజన సరైనది కాదని, దీనివల్ల దక్షిణ బౌద్ధమే అసలయిన బౌద్ధమని వెల్లడి అయ్యిందని శర్మగారు అభిప్రాయపడ్డారు.

అశోకుని కాలంలో బౌద్ధమత బోధకులు సింహళ దేశానికి వెళ్ళారని, వారిలో అశోకుని కుమారుడయిన మహిందుడున్నాడని, శర్మగారు తెలిపారు. మహిందుడు త్రిపిటకములను (బౌద్ధమత వేదాలు) వినయ పీటకము, సుత్త పిటకము, అభిదమ్మ పిటకము వాటి భాష్యములైన 'అటకథ'లను సింహళ దేశానికి తీసికెళ్ళి, వాటిని సింహళ భాషలోనికి అనువదించినట్లు చెబుతారు. మహిందుని సోదరి అయిన సంఘమిత్తయే సింహళంలో మొట్టమొదట బౌద్ధ మతాన్ని స్వీకరించింది. మహిందునితో పాటు ఇత్థియ, ఉత్తెయ, ఛద్దసాల, సుమనులు కూడ బౌద్ధమతాన్ని వ్యాపింపజేయడానికి సింహళానికి వెళ్ళారు.

అశోకుడు అనేక అభిప్రాయ భేదాలు గల బౌద్ధులందరిని ఏకం చేయడానికి ప్రయత్నించాడు. ఇతని కాలంలో స్థవిర, మహాసాంఘిక అని రెండు కక్షలున్నాయి. మహా సాంఘికులలో సరిపడని స్థవిరులు మగధను విడిచిపెట్టారు. వీరిలో వినయ భాణకములు (వినయ ప్రాధాన్యం గల మతము) సింహళానికి వెళ్ళి స్థిరపడ్డారు. సూత్ర భాణకములు (ధర్మ ప్రాధాన్యం గల మతము) నవలంభించిన వారు కాశ్మీర, గాంధార దేశాలకు వెళ్ళి స్థిరపడ్డారు. తత్త్వబోధకు ప్రాధాన్యమిచ్చిన ఈ తెగవారికి సర్వాప్తి వాదులని పేరు. వీరు చైనా, టిబెట్ దేశాలకు వెళ్ళి, బౌద్ధమతాన్ని వ్యాపింపజేశారు. ఉత్తర బౌద్ధులకు మత గ్రంథాలు కొన్ని గ్రాంధికభాష (సంస్కృతం) లోను, కొన్ని ప్రాకృతంలోను, పాళీ భాషలోను ఉన్నాయి. క్రీ॥శ॥ 8వ శతాబ్దంలో 'వినీత దేవుడు' అనే విద్వాంసుడు సర్వాస్థివాదులు సంస్కృతాన్ని, అపభ్రంశమును, స్థవిరవాదులు పైశాచిని వాడినట్లు తెలిపారు. క్రీ॥శ॥ 19వ శతాబ్ది ప్రథమ భాగంలో ప్రాచ్య, పాశ్చాత్యులు చేసిన పరిశోధనల వల్ల బౌద్ధమతానికి ఈ విషయాలు వెల్లడి అయినట్లు మల్లంపల్లి సోమశేఖర శర్మ తెలియజేశారు.

చీనా, హిందూ దేశములు – వాని ప్రాచీన అనుబంధం

చీనా, హిందూ దేశానికి ఉన్న అనుబంధం అతి పురాతనమైనది. అశోకుడు బుద్ధుడి సందేశాన్ని, వివిధ దేశాలకు సందేశహరులను పంపి వ్యాపింపజేశాడు. పడమట సిరియాదేశం వరకు, దక్షిణాన లంకవరకు, తూర్పున యవద్వీపముల వరకు, ఉత్తరాన హిమాలయాలకు బుద్ధ భగవానుని సందేశాలను వ్యాపింపజేశాడు.

కుషాణ వంశస్థులు హిందూదేశ వాయువ్య ప్రదేశాన్ని వశపరచుకొని రాజ్యాన్ని పరిపాలించారు. వారిలో కనిష్క భూపతి విఖ్యాతుడు. ఇతని రాజధాని పురుషపురము. ఇతడు యార్కండ్ ఖోటాన్, క్యాష్గర్ దేశాలను జయించాడు. ఆ సామ్రాజ్యానికి చీనా రాజ్యం పొలిమేర అయ్యింది. ఈ విధంగా చీనా దేశానికి, భారతదేశానికి అనుబంధం ఏర్పడింది. కనిష్కుడు ఇచ్చిన ప్రోత్సాహం వల్ల బౌద్ధ భిక్షువులు తమ మతాన్ని మధ్య ఆసియాలోను వ్యాపింపజేశారు. క్రీ॥శ॥ 1వ శతాబ్దం నాటి బౌద్ధమత గ్రంథాలు బూర్జపత్రాల మీద హిందూదేశ లిపులలో ఉన్నవి లభించాయి.

చీనాలో భారతీయ బౌద్ధ భిక్షువులు

చీనా దేశంలో హాన్ చక్రవర్తి మింగ్‌టి కాలంలో క్రీ॥శ॥ 67 ప్రాంతంలో కాశ్యప మాతంగుడు, ధర్మరత్నుడు బౌద్ధ గ్రంథాలను, బుద్ధుని విగ్రహాలను గుఱ్ఱాలపై వేసుకుని చైనాకి చేరారు. ఆ చక్రవర్తి వారికి స్వాగతం పలికాడు. అతడు మత గ్రంథాలను, విగ్రహాలను మోసుకొచ్చిన గుఱ్ఱాల జ్ఞాపకార్థం ఒక విగ్రహాన్ని కట్టించి, దానికి శ్వేతాశ్వమని పేరు పెట్టాడు. వారు బౌద్ధ గ్రంథాలను చీనా భాషలోకి అనువదించారు. కాశ్యప మాతంగుడు రచించిన “బుద్ధుని నలుబది రెండు సూత్రములు” అను గ్రంథమే చీనా దేశీయుల బౌద్ధ విజ్ఞానానికి ఉపయోగపడింది. హాన్ వంశస్తుల కాలంలో 350కి పైగా బౌద్ధ గ్రంథాలు చీనా భాషలోకి అనువదింపబడ్డాయి.

ఈ కాలానికి చీనా దేశంలో ‘కన్ ఫ్యూషియాన్’ అనునతడు ‘కాన్ ఫ్యూషియా నిజమ్’ ‘లోసీ’ అనునతడు ‘టోయిజమ్’ అనే రెండు మతాలను ప్రవేశపెట్టారు. ఈ మతాలు చీనలో పుట్టినవి. బౌద్ధమతం మూడవ మతంగా అక్కడ ప్రవేశించింది. క్రీ॥శ॥ 265 – 589 మధ్య కాలంలో బౌద్ధం చీనాలో బాగా బలపడింది. క్రీ॥శ॥ 50కి పూర్వమే బౌద్ధమతం చీనా దేశీయుల ప్రధాన మతమయ్యింది. ఉత్తర చీనా మాండలికులలో ఒకడయిన ‘షీచీలుంగ్’ అనునతడు బౌద్ధులకు ఆశ్రయమిచ్చాడు. ఇతని కాలంలో చీనా దేశీయులు కూడా బౌద్ధమతాన్ని అవలంబించారు. అప్పటి నుండి బౌద్ధమతాన్ని ప్రచారం చేసినవారు, బౌద్ధసంఘాన్ని పరిపాలించినవారు చీనా దేశస్థులే.

ధ్యాన సంప్రదాయము

ధ్యాన సంప్రదాయాన్ని చాన్ సంప్రదాయం అంటారు. క్రీ॥శ॥ 520లో బోధి ధర్మాచార్యుడు చీనాలోని కాన్‌టన్ పట్టణానికి వెళతారు. ఆ సమయానికి

బౌద్ధం బాగా వ్యాపించింది. క్రీ॥శ॥ 530 నాటికి ఒక్క ఉత్తర చీనా దేశంలోనే 13,000 బౌద్ధ ఆలయాలు ఉన్నాయట. టాంగ్ వంశము (క్రీ॥శ॥ 618 – 907) పరిపాలనా కాలంలోను వారి అనంతరం రెండు శతాబ్దుల కాలంలో బౌద్ధం ఉచ్ఛదశకు చేరుకుంది. యువాన్ చాంగ్, ఇట్సింగ్ మొదలైనవారు ఈ కాలం వారే.

బౌద్ధ గ్రంథ ముద్రణ

చీనా దేశీయులు 'దిమ్మల అచ్చుపని' కనిపెట్టారు. మొదట వీరు రక్షరేకులను, తాయెతులను ముద్రించారు. సంగ్ వంశంవారి పాలనలో 962 ప్రాంతంలో బౌద్ధమత వేద గ్రంథాలయిన 'పిటకములు' చీనాలో అచ్చు వేయబడ్డాయి. బౌద్ధ పిటక వాఙ్మయంలో 1521 విడి గ్రంథాలున్నాయి. వీటిని 1,30,000 పుటలు గల సంపుటాలలో అచ్చు వేశారు. ఈ దేశంలోనే మొట్టమొదట కాగితాన్ని కనిపెట్టారు. ఈ విధంగా ఇక్కడ గ్రంథముద్రణ ప్రారంభమైంది.

బౌద్ధం క్షీణదశ

సంగ్ వంశానంతర కాలంలో బౌద్ధం క్షీణించడం మొదలుపెట్టింది. వీరి తరువాత మంగోలు చక్రవర్తుల (క్రీ॥శ॥ 1289–1368) లో చాలామంది బౌద్ధాన్ని అభిమానించారు. ఆ తరువాత మింగ్ (క్రీ॥శ॥ 1368–1644), మంచూ (క్రీ॥శ॥ 1644–1922) వంశాలవారి పరిపాలనా కాలంలో బౌద్ధం క్షీణదశకు చేరుకుంది. చీనా హిందూ దేశాల మధ్య బౌద్ధమతం అనుబంధాన్ని పెంచింది. బౌద్ధం క్షీణదశలో ఈ ఉభయ దేశాలకు ఎడబాటు ఏర్పడింది.

గోలీస్తూప బౌద్ధ చిత్రాలు

స్యూయెల్ దొర చెన్నై రాజధానిలోని ప్రాచీన వస్తు శిథిలావశేషాలను పరిశీలించడానికి పర్యటిస్తుంటాడు. ఆయన గుంటూరు జిల్లా పల్నాడు తాలుకాలోని మల్లవరం అనే గ్రామం దగ్గర ఒక దిబ్బను చూశాడు. అక్కడ అతనికి అమరావతి స్థూపం వంటి రెండు శిలా ఫలకాలు కనబడతాయి. అందులో ఒకదాని మీద ఏడు తలల నాగము చిత్రించబడింది. మఱొకటి చాలా పొడవైన శిలా చిత్రఫలకము. ఇది ఏడు అరలుగా విభాగింపబడింది. ఒక్కొక్క అరలో బౌద్ధమతానికి చెందిన గాథలు చిత్రాలు ఉన్నాయి. గ్రామస్తులు నాగశిలను తెచ్చి, దానికొక గది కట్టి నాగుమయ్య అనే పేరుతో పూజిస్తుంటారు. బుద్ధపాదాలు గల శిలా ఫలకాన్ని ద్వారం కుడి పక్కన స్థూపాకృతి గల శిలాఫలకాన్ని ఎడమ పక్కన స్థాపితం చేశారు.

దీర్ఘ శిలాఫలకాన్ని గోడలో పెట్టి కట్టారు. అక్కడ ప్రజలు బుద్ధ పాదాలను అమ్మవారి పాదాలు అంటారు.

1926లో గవర్నమెంటు ఆ దిబ్బను తవ్వించి ఆ శిలాఫలకాలను బయటకు తీసి, మద్రాసు వస్తు ప్రదర్శనశాలలో ఉంచింది. ఆ శిలాఫలకం దొరికిన స్థలానికి మల్లవరం మూడు మైళ్ళ దూరంలోను, గోలీ గ్రామాలకి అర మైలు దూరంలోను ఉంది. అందువల్ల వీటిని గోలీస్తూప బౌద్ధ శిలాచిత్రములని పేర్కొన్నారు. ఈ శిలాఫలకాల మీద బుద్ధుని జీవిత గాథలు చిత్రించబడ్డాయి. గోలీస్తూప గ్రంథకర్త అయిన టి. యస్. రామచంద్రగారు ఆ కథలను గుర్తించినట్లు శర్మగారు తెలియజేశారు.

ఈ జాతక కథలలో ఛద్దంత, వెస్సంతర జాతకాలు శ్రేష్టమైనవిగా బౌద్ధులు చెబుతారు. ఇక్కడ ఉన్న స్త్రీ, పురుష చిత్రాలు, దుస్తులు, ఆభరణాలు మొదలైనవి పరిశీలించిన టి.యస్. రామచంద్రన్‌గారు అవి 3వ శతాబ్ధం నాటివని తెలియ జేశారు. బౌద్ధాంధ్రుల శిల్పకళను చాటే అమరావతి తార్కాణంగా ఉంచేది. కాని అమరావతి స్తూప చిత్రాలలో ఉత్తమమైనవి ఖండాంతరాలకు చేరాయి. కొన్ని కలకత్తా చేర్చబడ్డాయి. ఈ అమూల్యమైన గోలీచిత్రాలను వెలువరించిన డుబ్రెయిల్, రామచంద్రన్ గార్లకు ఆంధ్రులు ఋణపడి ఉన్నారని శర్మగారు అభిప్రాయపడ్డారు.

నాగార్జునకొండ శిల్పాలు మన భారతీయ చిత్రకథకు తలమానికం వంటిది. ఆనాటి రాజులు వాడిన ఆసనాలు, శయ్యలు, కోట ప్రాకారాలు, కోట ద్వారాలు, రాచలోగిళ్ళ నమూనాలు, బౌద్ధుల ప్రార్థనాలయాలు, ఆనాటి ఆంధ్రులు, స్త్రీ పురుషులు ధరించిన ఆభరణాలు, కేశాలంకరణ, దుస్తులు మొదలైనవి ఈ చిత్రాలలో చూడవచ్చు. ఇక్కడ తొమ్మిది స్తూపాలు, 30, 40 శాసనాలు, ఎన్నో విహారాలు బయటపడ్డాయి. ఇక్కడ శాసనాలు ప్రాకృత భాషలో ఉన్నాయి. భాష ప్రాకృత మయినా, 1600 సంవత్సరాల కాలంలో వాడుకలోఉన్న తెలుగులిపిలో ఉన్నాయి. ఇక్ష్వాకుల వివరాలు ఇక్కడ శాసనాల వల్ల తెలుస్తున్నాయి. చాంతమూల రాజు సోదరి అయిన చాంతసిరి బుద్ధ భగవానుని ధాతువు ప్రతిష్టించి, దానిపై ఒక మహాస్థూపాన్ని నిర్మించింది. దీనికి మహాచైత్యమని పేరు. ఈ రాజు సోదరీమణులు, పత్నులు అనేక నిర్మాణాలు చేపట్టి, బౌద్ధమత ఉద్దరణకు పాటుబడ్డారు. కాశ్మీర, గాంధార, చీనాచిలాత, అవంతి, అపరాంత దేశాల నుంచి, సింహళమొదలైన ద్వీపాల నుంచి బౌద్ధులు నాగార్జునకొండకు వచ్చేవారు. బౌద్ధంలో వచ్చిన మహాయాన

విప్లవానికి ఆచార్య నాగార్జునుడు నాంది పలికారు. నాగార్జునకొండ శిల్పాలు ప్రాచీనాంధ్రుల సంస్కృతి, సభ్యతలకు దర్పణాలు, ప్రాచీన కాలంలో ఆంధ్రులు విజయవంతంగా సాగించిన మత విప్లవానికి సంకేతాలు, విప్లవ ఫలంగా వికసించిన నూతన మతం, సామాన్య జనంలో మంతేరోత్సాహ శక్తుల మూర్తులు, ప్రాచీన మహిళా లోకం భక్తుత్సాహాలతో చేసిన మత విషయక కృషికి చిహ్నాలు. కాబట్టి ఈ శిల్పకళను కాపాడుకోవలసిన బాధ్యత ఆంధ్రులపై ఉందని శర్మగారు తెలియజేశారు.

నాగార్జునకొండ చిత్రాల వివరణ

ఒకటవ చిత్రంలో శుద్ధోధనుడి రాజ్యపాలన, మాయాదేవి కలకన్న అంశాలు చిత్రించబడ్డాయి. రెండవ చిత్రంలో బుద్ధుని జననం చిత్రించబడింది. మాయాదేవి పుట్టింటికి బయలుదేరడం, లుంబినీ వనంలో సేదదీరడం, ఆ తర్వాత మగబిడ్డకు జన్మనివ్వడం మొదలైన అంశాలు చిత్రించబడ్డాయి. మూడవ చిత్రంలో బద్ధుడు జన్మించి నపుడు అనేక వింతలు పొడసూపుతాయి. వాటిని హిమవత్పర్వతాలలో తపమాచరిస్తున్న అసితుడనే ముని కనుగొని కపిలవస్తు నగరానికి వచ్చి, బుద్ధునికి ప్రణమిల్లి దుఃఖిస్తాడు. అతడు అప్పటికే కడు వృద్ధుడు కావడం వల్ల, బుద్ధుని లోకోత్తర ధర్మబోధ వినలేక పోతానని విచారిస్తున్నానని చెబుతాడు. ఈ విషయాలన్ని దీనిలో చిత్రించబడ్డాయి. నాలుగవ చిత్రంలో బుద్ధుని మహా నిష్క్రమణ చిత్రించబడింది. అయిదవ, ఆరవ చిత్రాలలో మారుడు బౌద్ధులకు శని వంటివాడు. బుద్ధుడు బోధి వృక్షం కింద కూర్చుని తపస్సు చేసుకుంటున్నపుడు, మారుడు తన కుమార్తెలను పంపి, అతని తపస్సును భగ్నం చేయడానికి ప్రయత్నించి విఫల మవుతాడు. ఈ కథ 5, 6 చిత్రాలలో చిత్రించబడింది. ఏడవ చిత్రం సర్వార్థ సిద్ధుడు బుద్ధుడయిన తరువాత తన ధర్మాన్ని మొదటి వారణాసి పక్కన గంగా తీరాన ఉన్న మృగదానమునకు వెళ్ళి బోధిస్తాడు. ఈ బోధకు 'ధర్మచక్రమని' పేరు. ఈ విషయం ఇక్కడ చిత్రించబడింది. ఎనిమిదవ చిత్రంలో బుద్ధుని నిర్వాణం చిత్రించబడింది. బుద్ధుని ధాతువులు ఆ స్తూపంలోపల నిక్షిప్తమై ఉన్న విషయం, ఉపాసకులు ఆ స్తూపాన్ని ఆరాధించడం మొదలైనవి చిత్రితమయ్యాయి.

గోలీస్తూపము

ఈ శిలాఫలకాల మీద బుద్ధుని కథలు చెక్కబడ్డాయి. ఒక్కొక్క ఫలకాన్ని అనేక విభాగాలుగా విభజించి ఒక్కొక్క దానిపై ఒక్కొక్క కథకు సంబంధించిన చిత్రాలను చెక్కారు.

ఒకటవ చిత్రము

దీనిలో మూడు గదులున్నాయని, మొదటి గదిలో ఏనుగు మొదలైన జంతువులు, రెండవ గదిలో స్త్రీ పురుష ప్రతిమలు, మూడవ గదిలో నాగరాజు చిత్రము ఉన్నాయని ఈ చిత్రాలను చూసిన వారి మనస్సు రంజింప జేయడానికి ఇటువంటి చిత్రాలను చెక్కారని శర్మగారు తెలియజేశారు. ఏనుగు, నాగరాజు, బుద్ధుని జీవిత చరిత్రలో ప్రధాన పాత్ర వహించాయనే విషయాన్ని అందిస్తుంది.

రెండవ చిత్రం

బుద్ధుడు తన మతాన్ని బోధించడానికి తన శిష్యులతో కలసి, మగధలోని రాజగృహానికి వస్తాడు. అక్కడ ఒక సంపన్నుడు బుద్ధుని విందుకి ఆహ్వానిస్తాడు. అది తెలిసిన దేవదత్తుడు, బుద్ధుడు వెళ్ళే మార్గంలో 'నలగిరి' అనే భయంకరమైన ఏనుగును వదులుతాడు. అపుడా ఏనుగు భయంకరంగా ఘీంకరిస్తూ అనేకమందిపై దాడి చేస్తుంది. చివరకు బుద్ధుని వద్దకు వచ్చి, మోకరించి అతని పాద పద్మాలకు నమస్కరిస్తుంది. ఈ కథ రెండవ చిత్రంలో చిత్రించబడింది.

మూడవ చిత్రం

వెస్సంతర జాతకం ఈ చిత్రంలో ఉంది. పూర్వజన్మలలో ఒక జన్మలో బుద్ధుడు వెస్సంతరుడుగా జన్మిస్తాడు. పాళీభాషలో ఈ కథ ఉంది. అది ఈ చిత్రంలో చిత్రించబడింది. వెస్సంతరుడు కళింగరాజైన సంజయునికి కుమారుడు.

నాలుగవ చిత్రం

కళింగదేశంలో క్షామం ఏర్పడడం వల్ల, ఆ క్షామాన్ని తొలగించడానికి బ్రాహ్మణులు వెస్సంతరుని వద్ద ఉన్న శ్వేతాశ్వాన్ని అడగడానికి వస్తారు. అతడు ఆ అశ్వాన్ని వారికి దానం చేస్తాడు. ఈ కథ నాలుగవ చిత్రంలో చిత్రించబడింది.

అయిదవ చిత్రం

వెస్సంతరుని దానాలకు ఆగ్రహించి, అతని తండ్రి అయిన సంజయరాజు వెస్సంతరుని రాజ్యం నుండి బహిష్కరిస్తాడు. ఆ కథ అయిదవ చిత్రంలో చిత్రించ బడింది.

ఆరవ చిత్రం

వెస్సంతరుడు అరణ్యానికి వెళ్ళి, కుటీరంలో జీవిస్తుంటాడు. అక్కడకు ఒక బ్రాహ్మణుడు వచ్చి, అతని సంతానాన్ని దానమిమ్మని అడుగుతాడు. వెస్సంతరుడు

తన సంతానాన్ని అతనికి దానమిస్తాడు. అపుడు ఆ బ్రాహ్మణుడు వారిని కర్రతో కొడుతూ తీసికెళతాడు. ఈ కథంతా ఆరవ చిత్రంలో చిత్రించబడింది.

ఏడవ చిత్రం

వెస్సంతరుని భార్య పండ్లు తీసుకురావడానికి అరణ్యానికి వెళుతుంది. ఆ సమయంలో వెస్సంతరుడు వారి సంతానాన్ని ఒక బ్రాహ్మణునికి దానం చేస్తాడు. ఆమె కుటీరానికి వచ్చి, సంతానం గురించి అడుగుతుందేమో అని, అతడు ధ్యానంలో నిమగ్నుడవుతాడు. ఆ బ్రాహ్మణుడు ఆ పిల్లలను రాజ ప్రసాదానికి తీసికెళతాడు. అపుడు రాజు తన మనమలను గుర్తించి, అతనికి తగిన మూల్యం చెల్లించి, తన మనవలను ఆ బ్రాహ్మణుని వద్ద నుండి తిరిగి స్వీకరిస్తాడు. ఈ కథ ఏడవ చిత్రంలో చిత్రించబడింది.

ఎనిమిదవ చిత్రం

ఒక జన్మలో బుద్ధుడు ఛద్దంతుడి (షడ్దంతుడు)గా జన్మిస్తాడు. అతనికి ఇద్దరు భార్యలు. అతడు చిన్న భార్యను ఎక్కువగా ప్రేమిస్తాడు. పెద్ద భార్య అతనిపై కక్ష గడుతుంది. ఆమె చనిపోయి స్త్రీగా జన్మించి, కాశీరాజుని వివాహమాడుతుంది. ఆ తర్వాత ఆమెకొక వింత వ్యాధి వచ్చినట్టు నాటకమాడుతుంది. తనకు కలలో ఆరు దంతాలు గల ఏనుగు కలలోకి వచ్చిందని, ఆ దంతాలను తెచ్చి యిచ్చినచో, ఆ వ్యాధి నయమవుతుందని భర్తతో చెబుతుంది. అపుడు కాశీరాజు శోణుత్తరుడు వేటగాడిని ఆ పనికి నియమిస్తాడు. ఆ వేటగాడు ఆ ఏనుగు దంతాలను ఖండించిన తరువాత అది మరణిస్తుంది. ఆ రాణి తాను చేసిన పనికి దుఃఖించి, ఆమె కూడ మరణిస్తుంది. ఈ కథ ఎనిదవ చిత్రంలో చిత్రించబడింది.

బౌద్ధసంఘం

శాక్యవంశంలో జన్మించి ఎన్ని సంవత్సరాలయిన బుద్ధుడు చిరస్మరణీయుడు. గాంధీ మహాత్ముడి ఉపదేశాలతో భారతదేశంలో బుద్ధుని ప్రవచనాలకు అంకురాలేర్పడ్డాయి. బుద్ధుని సందేశం ఇప్పటికి నవ్యమై, భవ్యమై లోకానికి నవ చైతన్యాన్ని ప్రసాదించింది. బుద్ధ చరితం యుగ యుగాల వారికి దివ్యపథాన్ని చూపే విద్యుద్దీపం. బౌద్ధం సమాజంలో ఉన్న అసమానతలను తొలగించిన సంస్కా రోద్యమంగా ఖ్యాతిగాంచింది.

బౌద్ధ ధర్మాన్ని అవలంభించిన స్త్రీలను 'బిఖ్ఖులు' అని పిలుస్తారు. గృహస్త్రీ

శ్రమంలో ఉండి బుద్ధుని ధర్మోపదేశాన్ని అనుసరించి జీవించే పురుషులను 'ఉపాసకులు' అని, స్త్రీలను 'ఉపాసికలు' అని అంటారు. బౌద్ధ బిఖ్ఖు సంఘము ఒక 'జీవత్ సంస్థ'. బౌద్ధులు జీవితంలో పాటించాల్సిన నీతి నియమావళిని, ఆచార నిబంధనావళిని 'వినయము' అంటారు. బౌద్ధుల ఆచారాలను తెలియజేసే వినయ గ్రంథంలో గల శిక్షాసంహితకు 'పాతిమొఖ్ఖమని' పేరు. బౌద్ధులు వ్యభిచారము, దొంగతనము, జీవహింస, అలౌకిక మహత్తులు కలవనిగాని, అర్హతుడనని గాని చెప్పరాదు. (ధర్మావలంబకులలో పరిపూర్ణత చెందిన బిఖ్ఖుని అర్హతుడు అందురు.) బౌద్ధుల దృష్టిలో ఇవి మహా పాపాలు.

బౌద్ధులు ఉపోసథనాడు (ఉపవాస దినము) పాతిమొఖ్ఖమును పఠిస్తారు. ఈ ఉపోసథ నెలకు రెండు సార్లు వస్తుంది. ఈ రెండు రోజులు ఆత్మావలోకనం, ఆత్మ పరీక్షా దినములు. ఏ ప్రాంతంలో ఉన్న బౌద్ధులు ఆ ప్రాంతంలో సమావేశ మవుతారు. బౌద్ధ బిక్కులలో పెద్దలు, ఆచార్యులు నలుగురు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారు. అపుడు ఒక బిఖ్ఖువు పాతి మొఖ్ఖములోని ఒక్కొక్క శిక్షాపధాన్ని భిక్షువు చదువుతాడు. ఆ తరువాత ఆ శిక్షాపదంలో గలవారు ఎవరు చేయలేదుగదా అని మూడుసార్లు ప్రశ్నిస్తాడు. అక్కడ సమావేశమైన వారిలో ఆ పాపాలు చేస్తే బహిరంగంగా అంగీకరించి, ప్రాయశ్చిత్తం చేసుకుంటారు. ఇవి కాలక్రమేణ ఏర్పడ్డాయి. వినయము, సుత్తము అభిదమ్మము బౌద్ధ వేదాలు మూడు రకాలు. బౌద్ధుల ఆచార కాండ వినయము, సుత్త పీటకములో బౌద్ధ ధర్మం చెప్పబడ్డాయి. అభిదమ్మము బౌద్ధ వేదాంతము. అభిదమ్మము ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

బుద్ధుడు ఒక మతాన్ని స్థాపించాలని అనుకోలేదు. బౌద్ధ ధర్మాన్ని అవలంభించిన వారిని ఒక సంఘంగా ఏర్పరిచి దానికి అధిపతిని నియమించాలని అనుకోలేదు. బుద్ధుని నిర్వాణ అనంతరం అతని శిష్యులే చక్కబెట్టారు. ఆచార వ్యవహారాలను, బుద్ధ ప్రోక్తమయిన ధర్మాన్ని క్రోడీకరించి గ్రంథస్థం చేయడానికి బౌద్ధులు పూనుకున్నారు. బౌద్ధ ఆచార, ధర్మ నిర్ణయానికి బౌద్ధులు మూడు సమావేశాలను జరిపారు. ఈ సమావేశాలకు బౌద్ధ సంగీతులు అనిపేరు. మొదటి సంగీతికి వినయ సంగీతి అనిపేరు.

బౌద్ధకళారంభములు – భర్హుత్ స్తూపము

బుద్ధుడు మరణించిన తరువాత అతని అస్థికల కోసం వేర్వేరు రాజ్యాల వారు యుద్ధాలు చేస్తారు. అపుడు ద్రోణుడు అనే బ్రాహ్మణుడు వచ్చి, ఆ అస్థికలను

ఎనిమిది భాగాలుగా చేసి, ఎనిమిది మంది రాజులకు ఇస్తాడు. వారు రాజగృహము, వైశాలీ, కపిలవస్తు, అల్లకప్ప, వేష్ణ ద్వీపము, రామ గ్రామము, పావా, కుశ నగరములలో ఎనిమిది స్తూపాలను ఏర్పాటు చేశారు. ఆ తరువాత మౌర్యవంశ రాజైన అశోక చక్రవర్తి వాటిని తెరిపించి, వాటిలో అస్థికలను తీసి 84,000 శకలాలను చేయించి వాటిని దేశమంతా పంచి పెట్టి, స్తూపాలను కట్టించాడు. వాటిలో భర్హూత్ అనేది మధ్యహిందూ దేశంలోని బాఘేల్ ఖండ్ జిల్లాలో నగోడ్ సంస్థానంలోని ఒక గ్రామం. ఇక్కడ స్తూపాన్ని ఇటుకలతో నిర్మించారు. ఈ స్తూప శిల్పంలో రెండు దేవతా విగ్రహాలున్నాయి. అనాథ పిండికుని జేత వనదానము మిగజాతకమ్, చదంతియ జాతకమ్, జబూ నదదోపవతే, వదుకో కథాదోహతి నదదో పవతే, ముగపకయ జాతకమ్, తికోటి కోచకమో, భిసమారనియ జాతకమ్ అనే కథలు చెక్కబడ్డాయి.

అనాథ పిండకుని జేత వనదానము

భాగ్యవంతుడైన ఒక వ్యాపారి బుద్ధునికి ఒక వనాన్ని నిర్మించి ఇస్తాడు. దానిపేరు జేతవనం. ఈ కథ బార్హూత్ స్తూపంపై చెక్కబడింది.

మిగజాతకమ్

బుద్ధుడు తన పూర్వజన్మలో ఒకసారి రురుజాతి మృగంగా పుట్టాడట. ఆ జంతువు ఒక నది దగ్గర మామిడి వనంలో ఒంటరిగా నివసిస్తూ ఉంటుంది. ఒకరోజు ఒక వైశ్య కుమారుడు ఆత్మహత్య చేసుకోడానికి వచ్చి నదిలో దూకుతాడు. అపుడా జంతువు అతనిని రక్షించి, కొంతకాలం అక్కడే ఉంచి పోషిస్తుంది. ఆ తరువాత అతడు తిరిగి తన నివాసానికి వెళుతున్నపుడు, తాను అక్కడ ఉన్నట్టు చెప్పవద్దని ఆ జంతువు అతనితో చెబుతుంది. కాని అతడు కాశీరాజుకు ఆ జంతువు గురించి చెబుతాడు. ఆ రాజు దానిని వేటాడడానికి వస్తాడు. అపుడా జంతువు "రాజా బాణము విడువకము, నన్ను కొట్టకుముండుమని" మధురమైన కంఠంతో పలుకుతుంది. ఆ కంఠం విని రాజు బాణం నేలపై వదులుతాడు. అపుడా మృగం రాజా నేనున్న స్థలాన్ని నీకు ఎవరు చెప్పారు అని ఆ రాజుని అడుగుతుంది. ఈ కథ ఇక్కడ చెక్కబడింది. ఆ రాజు వైశ్య కుమారుని చూపిస్తాడు. "మనుష్యులు కృతఘ్నులు వారి నోటితో చెప్పున దొకటి చేయున దొకటి" అంటుంది. అపుడు రాజు నేను అలాంటి వాడిని కాను నన్ను వారితో జమ కట్టవద్దు అంటాడు. రాజు ఏదైనా వరం కోరుకోమని అంటాడు. అపుడా జంతువు "అట్లయిన నేనును

నాతో పాటు ఇతర జంతువులు సురక్షితముగా నుండు"నట్లు అడుగుతుంది. అదే విధంగా ఒక చిత్రంలో ఛదంతియ జాతకమ్ చెక్కబడింది. అదే విధంగా ముగ పకయ జాతకమ్ దీనిలో బుద్ధుడు కాశీరాజు కుమారుడుగా జన్మించిన ఉదంతం ఒక చిత్రంలో చిత్రించబడింది. ఇంకా అనేక కథలు భర్హుత్ స్తూప శిలలపై చెక్కబడ్డాయి.

అదే విధంగా 'తథాగతుని దంత ధాతు చరిత్ర' అదే వ్యాసంలో బుద్ధుని ధాతు చరిత్ర చెప్పబడింది. దంతపురం ఎక్కడ ఉందన్న విషయంలో పరశోధకులలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కొంత మంది గంజాం జిల్లాలోని కళింగ పట్టణమని, మరి కొంత మంది పూరీ జగన్నాథమే దంతపురమని, ఇంకొంత మంది గంజాం జిల్లాలోని శ్రీకాకుళం రైల్వేస్టేషన్‌కి పదిమైళ్ళ దూరంలో దంతవరపుకోట అనే పాడుబడిన స్థలమే దంతపురమై ఉంటుందని నేటి చరిత్ర పరిశోధకులు చెబుతున్నారు. ఇపుడది ఒక పెద్ద దిబ్బలాగ ఉంటుంది. దీనిని దంత వక్త్రునికోట అని వ్యవహరిస్తున్నారు. ప్రాచీన కళింగ గాంగ శాసనాలలో పూర్వగాంగ వంశస్తులు దంతపురాన్ని రాజధానిగా చేసుకుని పరిపాలించారు. బౌద్ధగాథలలో దంతపుర ప్రస్థావన కనిపిస్తుంది. ఈ రెండు దంతపురాలు ఒకటో కాదో అనే సందేహాన్ని శర్మగారు వెలిబుచ్చారు.

'దలదావంస' 'దాట్ధాధాతు వంసము' బుద్ధుని దంతగాధను తెలిపే ప్రధాన గ్రంథాలు. ఇవి పాళీ భాషలోకి అనువదించబడ్డాయి. కాని కర్త ఎవరో తెలియదు. క్రీ॥శ॥ 310 కాలంలో రచింపబడిందని, ప్రాచ్య పరిశోధకులు నిర్ణయించారు. 'ధమ్మకిత్తిథేరుడు' అనే బౌద్ధాచార్యుడు క్రీ॥శ॥ 13వ శతాబ్ధంలో పాళీ భాషలోకి దట్ధాధాతువంస (దంష్ట్రా ధాతువంశ) మనే పేరుతో అనువదించాడు. బుద్ధుని నిర్వాణ అనంతరం పెద్ద వర్షం కురవగా బూడిద కొట్టుకుని పోతుందట. అపుడు కపాలము, అక్షక ధాతువులు రెండు, దంత ధాతువులు నాలుగు, మొత్తము బుద్ధ ధాతువులు ఏడు మిగిలాయట. కళింగ నగర రాజధాని అయిన దంతపురాన్ని పాలించే బ్రహ్మదత్తుడు బుద్ధుని ఎడమ కోరపంటిని (వామదంష్ట్రా ధాతువు) మణిమయ ఖచితమైన ఒక ధాతు పీఠాన్ని చేయించి, అందులో ఆ ధాతువుని ఉంచి పూజించేవాడు. ఇతని తరువాత గుహసీవుడు రాజ్యాన్ని పరిపాలిస్తాడు. అతడు మొదట జైన మతాన్ని అవలంభించి, తరువాత దంతధాతు మహిమను తెలుసుకుని, బౌద్ధమతాన్ని స్వీకరిస్తాడు. బౌద్ధేతరులను తన రాజ్యం నుండి వెళ్ళగొడతాడు. వారు జంబూ ద్వీపాధిపతి వద్దకు వెళ్ళి, అతని నిందలుమోపి

అతనిపై దండెత్తేలా చేస్తారు. అపుడా రాజు గుహసీవుని, దంత ధాతువుతో సహా తీసుకుని రమ్మని చిత్తయానుడనే సామంతరాజుని పంపుతాడు. గుహసీవుడు పాటలీపుత్రంలో కొంత కాలముండి తిరిగి కళింగకు వెళతాడు. ఈ దంత ధాతువుని ఆరాధించడానికి ఉజ్జయిని రాజకుమారుడయిన దంత కుమారుడు కళింగ దేశానికి వస్తాడు. అతనికి తన కుమార్తె హేమమాల నిచ్చి వివాహం చేస్తాడు. ఖేరధారరాజు దంత ధాతువు కోసం గుహసీవునిపై యుద్ధం ప్రకటించడం, అతనికి ఆ దంత ధాతువు దక్కకుండా దంత కుమారుడు, హేమమాల కాపాడడం మొదలైన అన్ని విషయాలు తథాగతుని దంత ధాతు చరిత్రలో చెప్పబడింది.

ఈ వ్యాసాలలో బుద్ధుడు అనేక జన్మలెత్తినట్టు చర్చించబడింది. హిందూమత పురాణాలలో, దేవతలు అనేక అవతారాలెత్తిన విషయం అందరికీ విదితమే. వీరు కూడా హిందూ పురాణాలను అనుకరించారా! అన్న సందేహం కలుగుతుంది. ఎందుకంటే బుద్ధుడు ఒక మతాన్ని స్థాపించాలని గాని, ఈ మతాన్ని అవలంభించిన వారిని, ఒక సంఘంగా నియమించాలని గాని అనుకోలేదు. బుద్ధుని నిర్వాణ అనంతరం, అతని శిష్యులు, బౌద్ధమత భిక్షువులు ఈ మత గ్రంథాలను రాసే క్రమంలో అనేక మార్పులు చేసి ఉండవచ్చు. కాబట్టి కొన్ని కథలు కల్పించబడ్డాయేమో అనే భావన కలుగుతుంది. హిందూమత ఛాయలు బౌద్ధమతంలో వ్యాపించాయా! అనిపిస్తుంది.

ఈ విధంగా మల్లంపల్లి సోమశేఖరశర్మగారు బౌద్ధమతానికి సంబంధించిన అనేక వ్యాసాలను రాశారు. శర్మగారు రాసిన కొన్ని వ్యాసాలలోని బౌద్ధమత అంశాలను తీసుకుని, ఈ వ్యాసంలో పొందు పరచడం జరిగింది. ఈ వ్యాసాలలో బౌద్ధమతం గురించే గాక చారిత్రక అంశాలను కూడా చర్చించారు. ఆయన రాసిన వ్యాసాలలో పరిశీలించవలసిన అనేక అంశాలున్నాయి.

ఉపయుక్త గ్రంథాలు

1. ప్రతాపరెడ్డి, సురవరం. 2007. ఆంధ్రుల సాంఘిక చరిత్ర. చరిత్ర ఇంప్రెషన్, హైదరాబాదు.
2. రవికృష్ణ, మోదుగుల. 2011. చారిత్రక వ్యాసమంజరి. (మల్లంపల్లి సోమశేఖర శర్మ) మిత్రమండలి ప్రచురణలు, గుంటూరు.

3. రవికృష్ణ, మోదుగుల. 2011. బౌద్ధయుగము (మల్లంపల్లి సోమశేఖర శర్మ) మిత్రమండలి ప్రచురణలు, గుంటూరు.

4. శాస్త్రి, బి.యన్. 1975. ఆంధ్రుల సాంఘిక చరిత్ర. సరస్వతీ నిలయం, నారాయణగూడ, హైదరాబాదు.

(మద్రాసు క్రిష్టియన్ కాలేజి చెన్నై తెలుగుశాఖ, అంతర్జాతీయ సదస్సు సెప్టెంబర్ 20, 21, 2021) (భావవీణ మాసపత్రిక U.G.C. Care Journal December, 2021)

కురంగ గౌరీశంకర నాటిక - విశ్లేషణాత్మక పరిశీలన

దాసు శ్రీరాములు ప్రసిద్ధ కవి. ఆయన కృష్ణా జిల్లా కూరాడ గ్రామంలో ఏప్రిల్ 8, 1846వ సంవత్సరంలో కన్నయ్య, కామమ్మ అనే దంపతులకు జన్మించారు. మే 16, 1908 న పరమ పదించారు. వీరు అనేక కావ్యాలు, పద్యరచనలు, శతకాలు, నాటకాలు రచించారు. అచ్చ తెనుగు అభిజ్ఞాన శాకుంతలము, అచ్చతెలుగు నీతిమాలిక, అభినవగద్య ప్రబంధాలు, ఆంధ్రవీధి, ఆంధ్ర వీధి దర్పణము, అభినవ దర్పణము, ఉత్తరరామ చరితము, కురంగ గౌరీశంకర నాటిక, కృష్ణార్జున సమరము, జానకి పరిణయం మొదలైన రచనలు చేశారు.

కురంగ గౌరీ శంకర నాటికలో గౌరీ శంకరుల వివాహాన్ని ఇందులో వస్తువుగా స్వీకరించారు. ఈ నాటికలో దాసు శ్రీరాములు చేసిన కల్పనలు వారి ప్రతిభకు తార్కాణాలు.

ఇతివృత్తం

ఈశ్వరుడు దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేసిన తరువాత మందరగిరి శిఖరం మీద ఒక వటవృక్షం కింద యోగసమాధిలో ఉంటాడు. సతీదేవి హిమవంతుని కూతురుగా జన్మిస్తుంది. పార్వతి నారదుని ప్రబోధం వలన శివునియందు అనురక్తి కలిగి ఉంటుంది. అతణ్ణి భర్తగా పొందడానికి ఆమె తల్లిదండ్రుల అనుమతిని తీసుకొని హిమవత్పర్వతాన్ని విడిచి బదరికాశ్రమం చేరి అందులో పర్ణశాలను నిర్మించుకొని శివుని ధ్యానిస్తూ ఉంటుంది. ఆమెకు పరిచర్యలు చేయడానికి బాలా సుందరులనే చెలికత్తెలు వస్తారు. ఒకరోజు పార్వతీదేవి, శివుని ధ్యానంలో నిమగ్నమై ఉండగా ఆ సమయంలో దూర్వాస మహర్షి పర్ణశాలకు వస్తాడు. పార్వతి ధ్యాన సమాధిలో ఉండడం చేత ఆ మహర్షికి అతిథి సత్కారాలు జరగలేదు. ఆ సమయంలో చెలికత్తెలు పూజకు పూవులు తీసుకురావడానికి వనానికి వెళతారు. దూర్వాస మహర్షి పార్వతీదేవి తనకు మర్యాదలు చేయలేదని కోపించి ఆమె ఎవరికొరకై

ధ్యానిస్తుందో ఆస్థానం ఆమెకు పొడగట్టకుండుగాక అని శపిస్తాడు. అంతలో చెలికత్తె లక్కడకు వచ్చి జరిగింది తెలిసికొని అపరాధాన్ని మన్నించమని కోరుతారు. దూర్వాసుడు వారి ప్రార్థన మన్నించి, పార్వతీదేవి పెంచిన ఒక లేడిపిల్ల శివుని సమీపంలో చేరితే ఆ చోటు గౌరికి తెలుస్తుందని శాపవిమోచనాన్ని సూచిస్తాడు. చెలికత్తెలు శాప విషయాన్ని గౌరికి చెప్పకుండ దాచి శాప విమోచన సమయం కోసం వేచి చూస్తారు.

ప్రథమాంకంలో కథ

పార్వతీదేవి ఆనాటి నుండి శివుడు ఉన్నచోటు స్ఫురించక వేదనతో అన్న పానాదులు మాని కఠోరమైన తపస్సు చేస్తుంది. ఇది నాటికలోని కథకు పూర్వభాగం.

ఒకసారి పార్వతీదేవి కల్యాణ లక్ష్మీవ్రతాన్ని చేయడానికి పూనుకుంటుంది. ఆ వ్రతం వల్ల తనకు పరమేశ్వరునితో వివాహం జరుగుతుందని పార్వతి భావిస్తుంది. ఆ సమయంలో ఆశ్రమం సమీపంలో ఒక లేడిపిల్ల ప్రాణభయంతో వస్తుంది. పార్వతీదేవి ఆలేడిపిల్లకు ఆశ్రమంలో రక్షణ కల్పించమని చెలికత్తెలను ఆజ్ఞాపిస్తుంది. వారు ఆ లేడిని పట్టుకోడానికి వెళతారు. ఒక బోయవాడు ఆ లేడిని పట్టుకోవాలని తలచి బాణం వేయబోతాడు. బాల సుందరులు ఆ లేడిని పట్టుకొని జీవహింస తగదని బోధించి దయాగుణ ప్రాశస్త్యాన్ని గురించి చెబుతారు. అయినప్పటికి బోయవాడు బాణము వేయబోతాడు. చెలికెత్తెలు తిరస్కరిణి మంత్ర ప్రభావం చేత లేడిపిల్లను రక్షిస్తారు. బోయవాడు నిరాశతో తిరిగి వెళ్ళిపోతాడు.

ద్వితీయాంకం – మొదటి రంగం

తారకాసురుడను రాక్షసుడు సప్తదిక్పాలకులను ఓడించి తనకు దాసులుగా చేసికొని, ఇంద్రునిపై దాడి చేసి స్వర్గాన్ని ఆక్రమించాలని సన్నాహాలు చేస్తుంటాడు. దిక్పాలకులందరు తారకాసురుని దుశ్చర్యలను గురించి దేవేంద్రుడికి చెబుతారు. దేవేంద్రుడు దేవగురువైన బృహస్పతిని ఏవిధంగా తారకాసురుని వధించాలని అడుగుతాడు. శివపార్వతులకు పుట్టే కుమారస్వామి తారకాసురుని సంహరిస్తాడని, పార్వతీపరమేశ్వరుల వివాహం జరిగే విధంగా చూడడమే తక్షణ కర్తవ్యమని బృహస్పతి సూచిస్తాడు. ఇంద్రుడు మన్మథుని స్మరించి అతణ్ణి ప్రసన్నుని చేసుకుంటాడు. పరమేశ్వరుని తపస్సు భంగం చేసి పార్వతి శివుడు వివాహం చేసుకునేట్టు చేయమని మన్మథుణ్ణి నియోగిస్తాడు. వసంతుడి సహాయంతో మన్మథుడు ఆకార్యం చేయడానికి పూనుకుంటాడు.

ద్వితీయాంకం – రెండవ రంగం

వసంతుడు, మన్మథుడు మందరనగరానికి చేరి యోగ సమాధిలో ఉన్న పరమేశ్వరుని దర్శిస్తారు. పరమేశ్వరుని తపస్సును భంగం చేయడం అసాధ్యమని మన్మథుడు భావించి లోలోపల భయపడతాడు. వసంతుడు నారదుని వలన గౌరికి దుర్వాస మహర్షి ఇచ్చిన శాపం గురించి తెలుసుకుంటాడు. వసంతుడు ఆ కథ అంతా మన్మథునికి చెబుతాడు. నారాయణడు లేడిపిల్లగాను, బ్రహ్మదేవుడు కిరాతునిగాను వేషం వేసుకొని ఆ లేడిపిల్లను పార్వతివద్దకు చేర్చాదని, తారకాసురుని వధించడం కోసం వారు ఆవిధంగా చేశారని చెబుతాడు. ఈ రహస్యం ఇంద్రునికి తెలియదని చెబుతాడు. పార్వతి పరమేశ్వరుని సమీపానికి చేరాలంటే ఆలేడి పిల్లను మాయోపాయంతో గ్రహించి దానిని మహాదేవుని వద్ద ఉంచాలి. ఉపాయంతో గౌరీదేవిని అక్కడకు రప్పించాలని వసంతుడు చెబుతాడు. మన్మథుడు అందుకు అంగీకరిస్తాడు.

ద్వితీయాంకం–మూడవ రంగం

మన్మథుడు ఒక కుంటి బ్రహ్మచారి రూపాన్ని ధరించి పార్వతీదేవి ఆశ్రమంలో చేరి, ఆమె ఇచ్చిన అతిథి సత్కారాలను స్వీకరిస్తాడు. వసంతుడు ఆశ్రమాన్ని వనాన్ని, శోభాయమానంగా తీర్చిదిద్దుతాడు. పార్వతి ఋతుకాల ప్రభావంచేత మదన బాధకు గురి అవుతుంది. ఆమెకు చెలికత్తెలు శైత్యోపచారాలు చేస్తారు. లేడిని రక్షించే బాధ్యత బ్రహ్మచారికి ఒప్పగిస్తారు. పార్వతికి మదన తాపం ఎక్కువవవడం చేత మైమరచి మైకంలో ఉంటుంది. ఆమెకు ఆ సమయంలో ఒక కల వస్తుంది. లేడిపిల్ల పారిపోయి శివుని వెనుక నిలబడినట్లు ఆ సమయంలో పార్వతి చెలికత్తెలు శివుని వద్దకు వెళ్ళి అతనిని పూజించినట్లు మదనుడా సమయంలో శివుని మీద పుష్పబాణాలు విసిరినట్లు అపుడు హరుడు కోపించి మూడవకన్ను తెరిచి మదనుని దగ్ధం చేసినట్టు, పశ్చాత్తాపంతో పార్వతిని వివాహం చేసుకోడానికి అంగీకరించినట్లు ఆ తరువాత పార్వతి తండ్రి వివాహం చేసినట్లు కలగంటుంది. చెలికత్తెలు ఆ స్వప్నం మంగళసూచకమని పార్వతికి చెబుతారు. అంతలో మన్మథుడు ఆ లేడిని శివుని వెనుక ఉంచినట్లు ఆకాశవాణి పలుకుతుంది. ఆ వార్త వినగానే పార్వతికి దివ్య జ్ఞానం కలుగుతుంది. శివుని ఉనికి ఆమెకు తెలుస్తుంది. అప్పుడు చెలికత్తెలు పార్వతికి దుర్వాస మహర్షి శాప వృత్తాంతం చెబుతారు. శాప విమోచనమై ఆమెకు శుభాలు చేకూరుతాయని సూచిస్తారు. గౌరి సంతసిస్తుంది.

తృతీయాంకం

పార్వతి పరమేశ్వరుని సన్నిధానం చేరి పూలదండలతో అతనిని పూజిస్తుంది. లేడిపిల్ల దేవదేవుని వెనుకనే ఉంటుంది. పార్వతి పూజచేసిన మల్లెపూలదండ ఒకటి శివుని జడలలో చిక్కుకుంటుంది. గండుతుమ్మెద ఒకటి దానిపై తిరుగుతూ ఉంటుంది. అప్పుడు పార్వతి శివునికి ఆ తుమ్మెద వలన బాధ కలుగుతుందేమోనని అతని వెనుకకు వెళ్లి ఆ తుమ్మెదను అదిలిస్తూ అతని జడను తాకుతుంది. అంతలో మదనుడు మహేశ్వరునిపై పూలబాణాన్ని సంధిస్తాడు. అపుడు మహాదేవుని మూడవకంటి నుండి వెలువడిన క్రోధాగ్నికి మదనుడు బూడిదవుతాడు. రతీదేవి ఆకాశం నుండి దిగివచ్చి పతికోసం విలపించి సహగమనం చేయడం కోసం చితిని పేర్చుకొని, పరమేశ్వరుని ప్రార్థిస్తుంది. పరమేశ్వరుడు ఆమె యందు దయామయుడై ఆమె కామె పతిని ప్రసాదిస్తాడు. శివుడిచ్చిన వరంచేత రతీదేవికి మన్మథుడు కనిపిస్తాడు. కాని లోకానికి మాత్రం అతడు అనంగుడు. రతీమన్మథులు శివునికి ప్రణామం చేసి నిష్క్రమిస్తారు.

పరమేశ్వరుడు పార్వతిని చూచి ఆమె అందానికి ముగ్ధుడై ప్రేమతో మాట్లాడి ఆమెతో సరసాలాడుతాడు. ఆమె లోలోన సంతసిస్తూ ముగ్ధభావం చేత అతని కౌగిలిని వారించి లేడిపిల్ల నిమ్మని కోరుకుంటుంది. అంతలో ఆ లేడిపిల్ల నారాయణుడుగా మారి త్వరలో వారికి వివాహం జరుగుతుందని సూచిస్తాడు. ఇది తృతీయాంకంలోని కథ.

చతుర్థాంకం–మొదటిరంగం

హిమవంతునికి ఈ సంగతి తెలిసి పార్వతిని తన యింటికి తీసుకొని వచ్చి వివాహ ప్రయత్నాలు చేస్తాడు. కొడుకులయిన మైనాక కోలాహలులను పెండ్లి పిలుపులకి పంపిస్తాడు. హిమవంతుని కోడలు శుక్తిమతికి గిరిక అనే కుమార్తె జన్మిస్తుంది. మైనావతి వారిని పుట్టింటి నుండి గౌరి వివాహానికి తీసుకురమ్మని బాలాసుందరులను పంపిస్తుంది. హిమవంతుడు, మైనావతి తమ ఆరాధ్యదైవమైన నారాయణుని పూజిస్తారు. ఇది మొదటి రంగంలోని కథ.

చతుర్థాంకం–రెండవ రంగం

కైలాసంలో పరమేశ్వరుడు భృంగి మొదలైన వారికి తనకు పార్వతికి పరిణయ సన్నాహాలొనర్చమని చెప్తాడు. సప్త ఋషులు లగ్న పత్రికను తెచ్చి పరమేశ్వరునికి సమర్పిస్తారు. వివాహయాత్రకు శివుడంగీకరిస్తాడు.

చతుర్థాంకం-మూడవ రంగం

గౌరిదేవి పెండ్లి ముహూర్తం కోసం వేగిరపడుతూ శివలింగ ప్రతిష్ట చేసి పూజిస్తుంటుంది. చెలికత్తెలయిన మాలతో వకుళమాలికలు, శివపూజా ద్రవ్యాలు సమకూరుస్తారు. శిలను శివునిగా భావించి పార్వతి ధ్యానిస్తుంది. ఆనాటి రాత్రికే శివపార్వతుల వివాహమని నారాయణుడు ఆ కార్యాన్ని నిర్వహిస్తున్నాడని ప్రకటిస్తాను. పార్వతిని పెళ్ళికూతురుని చేయడానికి ఆమెను అంతఃపురానికి తీసుకొస్తారు.

చతుర్థాంకం-నాలుగవ రంగం

గౌరీశంకరుల కల్యాణం జగన్మోహనంగా జరుగుతుంది. బ్రహ్మవిష్ణువుల, ఋషులు, ఋషిపత్నులు, దేవగణములు మొ॥గు వారందరు కల్యాణోత్సవము తిలకించి ఆనందిస్తారు. ఋషిపత్నులు హారతులిచ్చి మంగళగీతాలు పాడుతారు. బ్రహ్మదేవుడు భరతవాక్యము పలుకుతాడు. కథ సుఖాంతమవుతుంది.

నాటికలో కల్పనలు: 1. కురంగ వృత్తాంతము 2. దుర్వాసుని శాపవృత్తాంతం.

1. కురంగ వృత్తాంతం : శివపార్వతుల వివాహం జరపడానికి బ్రహ్మ, విష్ణువు కంకణము కట్టుకొన్నారు. ఇక్కడ బ్రహ్మదేవుడు ప్రేరకుడు. విష్ణువు సూత్రధారుడు. బ్రహ్మ కిరాతుడుగా వ్యవహరించి కురంగ రూపుడయిన విష్ణువును పార్వతి వద్దకు చేర్చాడు. ఇక్కడ మన్మథుడిని ఇంద్రుడు నియోగిస్తాడు. ఈ నాటికలో పార్వతి దివ్యజ్ఞానము గల వధువు. ఆమెకు దుర్వాసుని శాపం వల్ల దివ్య దృష్టి లోపిస్తుంది. ఈవిధంగా కథాగతికి ఫలసిద్ధికి కురంగము కారణమవుతుంది. కురంగ కల్పనము ప్రధానమయినది. ఈ నాటికలో చేసిన కల్పనలకు సమగ్ర సార్థక్యాన్ని కలిగించిన కవి ప్రతిభ ప్రశంసనీయమైనది. దాసు శ్రీరాములు చేసిన పై రెండు కల్పనలకు కాళిదాసుని అభిజ్ఞాన శాకుంతల నాటకం ఆధారం అని తెలుస్తుంది. లేడిని వెంటాడుతూ కణ్వాశ్రమ ప్రాంతానికి వచ్చిన దుష్యంతుని ఆశ్రమవాసులు వారించి హింసను మాన్పించిన సన్నివేశం. లేడిపిల్లను వెంటాడుతూ వచ్చిన బోయవానిని వారించి బాలాసుందరులు ఆ మృగాన్ని రక్షించిన సన్నివేశం ప్రేరణనిచ్చి ఉంటుంది.

కాళిదాసు శాకుంతలంలో దుర్వాసుని శాపం ఏవిధమైన ప్రయోజనాన్ని సాధించిందో ఈ నాటికలోను అటువంటి ప్రయోజనాన్ని సాధించింది. ఈ

రెండింటిలోను గల భేదమేమంటే శాకుంతలంలో దుష్యంతుడు శాకుంతలతో వివాహమయిన విషయాన్ని మరచిపోతాడు.

ఈ నాటికలో కవి మరికొన్ని మార్పులను కూడ చేశాడు. ప్రసిద్ధి చెందిన ఏ కథలో మదనుడు విరిబాణము వేసిన తరువాత పార్వతి తపస్సు చేస్తుంది. ఈనాటికలో మొదటే పార్వతి తపస్సును ప్రారంభించినట్లు కల్పించబడింది.

బదరికాశ్రమంలో పార్వతి తపస్సు చేస్తుంది. అది నారాయణుని పుణ్యక్షేత్రం. హిమవంతుడు హరిభక్తుడు. అందుచేత పార్వతి ఆ ఆశ్రమాన్ని తపస్సు చేయడానికి అనుకూల క్షేత్రంగా భావిస్తుంది. అంతేగాక శివపార్వతుల వివాహానికి నారాయణుడినే ప్రయోక్తగా ఈనాటికలో కవి చిత్రించదలచి రచయిత ఈ విధమైన కల్పన చేశాడు.

ఈ నాటికలో శివునిపాత్ర ప్రసిద్ధి చెందిన కథలో ఉన్నంత ఉదాత్తంగా పోషింపబడలేదు. శివుడు శృంగార నాయకుడిగా చిత్రింపబడ్డాడు. ప్రసిద్ధ కథలో కపట బ్రహ్మచారి వేషంలో శివుడు పార్వతి యొక్క భక్తిని పరీక్షించిన ఘట్టం ఈ నాటికలో లేదు. శివుడు స్వయంగా తన అష్టైశ్వర్యమహిమను భృంగితో చెప్పుకుంటాడు. ఈనాటికలో భృంగి విదూషకపాత్ర పోషించాడు. భృంగి గణాలలో ప్రముఖుడయినప్పటికి పరమేశ్వరుని గుణగణాలు తెలియని మందమతిగా చిత్రింపబడ్డాడు. భృంగి వివాహం కోసం పరితపించే విటశేఖరునిగా చిత్రింప బడడం నాటికలో హాస్య పోషణకు మాత్రం తోడ్పడిందని చెప్పవచ్చు.

కురంగ గౌరీశంకర నాటికలో పాత్రలు

సూత్రధారుడు, నటుడు, నటి, గౌరి, బాల, సుందరి (పార్వతీదేవి చెలికత్తెలు) కిరాతుడు, ఇంద్రుడు, బృహస్పతి, అగ్ని, యమ, నిరృతి, వరుణుడు, వాయువు, కుబేరుడు, ఈశానుడు, కాముడు (మన్మథుడు) హిమవంతుడు, మైనావతి, వీరి కుమారులు మైనాక కోలాహలులు-భృంగి, గౌరి చెలికత్తెలు వకుళ, మాలతి.

నారాయణుడు, బ్రహ్మ, ఋషిపత్నులు

నాటక లక్షణాలు : నాంది, ప్రస్తావన, అంక విభజన, భరతవాక్యం మొదలైన సంప్రదాయ నాటక లక్షణాలన్నీ కురంగ గౌరీ శంకరలో కనబడుతున్నాయి.

నాంది : నాందిలో ఉండే ఇష్టదేవతాస్తుతి ఉంది. సూత్రధారుడు ప్రవేశించి ఈ క్రింది విధంగా ఈశ్వరుణ్ణి ప్రార్థిస్తాడు.

చ ॥ సగము శరీరమిచ్చి యొక చానను శ్యామల పెద్ద పెళ్ళమున్
దగనలరించి యింక నొకదానిని గంగను చిన్న పెళ్ళమున్
సిగపయినుంచి సంతసిలజేసి సుఖించెడి రాజశేఖరుం
డగు ప్రమధాదినాధుడు సమస్త శుభంబుల మీకునిచ్చుతన్.

(కురంగగౌరీ శంకర నాటిక : 1)

ప్రస్థావన : సూత్రధారుడు, నటుడు ఈ నాటికను రచించిన దాసు శ్రీరాములు గురించి మాట్లాడుకొంటారు.

అంకవిభజన : నాటకంలో ఐదు అంకాలుంటాయి. ఇందులో నాలుగు అంకాలున్నాయి కాబట్టి ఇది నాటిక.

పతాకస్థాయి : ఈ నాటికలో గౌరీశంకరుల వివాహం జరుగుతుంది.

భరతవాక్యం : గౌరీశంకరుల వివాహం జరగాలని కోరుకున్న జనులందరికి శుభం కలగాలని బ్రహ్మదేవుడు భరతవాక్యం పలుకుతాడు.

గీ ॥ ధ్యానయోగ సమాధుల దైవవిధుల
సకల మాతాళిమేలును సరవిగోరు
నాత్మ హృద్ధ్యాన తేజులు నమరియుండ
బాడిపంటలు పృధివిని బండుగాక
భూతపంచక జాలంబు పొదలుగాక !

(కురంగ గౌరీ శంకర నాటిక : 64)

అని బ్రహ్మదేవుడు పలికిన భరత వాక్యంతో కథ సుఖాంతమవుతుంది.

దృశ్యకావ్యాలు, శ్రవ్య కావ్యాలు అని కావ్యాలు రెండు రకాలు. ప్రబంధాదులను శ్రవ్యకావ్యాలు గానూ రూపకాదులను దృశ్యకావ్యాలు గాను, నాటకం, ప్రకరణం, భాణం, వ్యాయోగం, సమవాకారం, ఓడిమము, ఈహామృగం, అంకం, వీధి, ప్రహసనం అనేవి దశవిధ రూపకాలు గానూ లాక్షణికులు పరిగణించారు. సంస్కృత లాక్షణికులు దశరూపకాలనే కాక ఉప రూపకాలను గూడ చెప్పారు. ఆ ఉపరూపకాలలోనిదే నాటిక.

1.కల్పిత ఇతివృత్తం 2. స్త్రీ బాహుళ్యం, 3. నాలుగంకాలు 4. ప్రఖ్యాత నాయకుడు, 5. నృత్త నృత్య ప్రాధాన్యం

సంస్కృత లాక్షిణుకులు పైన చెప్పిన నాటిక లక్షణాలు కురంగ గౌరీశంకర నాటికకు కూడా వర్తిస్తాయి.

1. **కల్పిత ఇతివృత్తం :** ఈ నాటికలో కురంగ వృత్తాంతం కల్పితం

2. **దుర్వాస శాపవృత్తాంతం :** ఈ రెండును ప్రసిద్ధిచెందిన శివపార్వతుల కథలో లేనివి. కవి కల్పించి రాసినవి.

3. **స్త్రీ బాహుళ్యము :** ఈ నాటికలోని స్త్రీ పాత్రలు గౌరి, బాల, సుందరి, మైనావతి, నటి, వకుళ, మాలతి.

4. **అంకాలు :** కురంగ గౌరిశంకర నాటికలో నాలుగు అంకాలున్నాయి.

5. **ప్రఖ్యాత నాయకుడు :** ఈనాటికలో మహాదేవుడే నాయకుడు.

6. **నృత్త-నృత్యాల ప్రాధాన్యం :** 7వ పుటలో వసంత రాగము-... తాళాలు

11వ పుటలో నాదనామక్రియ-ఆట-29పుటలో ముఖారి రాగం-చూపు ఆట.

37వ పుట యదుకుల కాంభోజిరాగం-ఆటతాళం-.... పుటలో శ్యామి-ఆట

66 లో పుటలో సురభి ఆట ఈవిధంగా నృత్త-నృత్య-ప్రాధాన్యత ఈ నాటికలో కనిపిస్తుంది.

ఆంధ్రనాటక కళాపరిషత్తు స్థాపించడం ద్వారా స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1946-47 సంవత్సరాల కాలం నుండి తెలుగు నాటికా సాహిత్యం కొత్తపుంతలు తొక్కిందని చెప్పవచ్చు. ఈ కాలంలో వచ్చిన నాటికల గురించి పి.ఎస్.ఆర్. అప్పారావుగారు కొన్ని లక్షణాలను చెప్పారు.

ఆధునిక నాటక లక్షణాలు

1. పరిస్థితుల్ని, సమస్యల్ని చిత్రీకరించి, సూచించి ప్రేక్షకుల ఊహకి వదిలి వేయడం, అంటే ఎటువంటి సందేశాన్ని నీతిని వాచ్యం చెయ్యకపోవడం, ప్రకటించకపోవడం ఒక లక్షణం.

2. సంభాషణలు నాటకీయంగా ఉండటం క్లైమాక్స్‌కి ప్రాధాన్యం.

3. వచనమే ఎక్కువ. నేపథ్యం గానం వంటి రెండు మూడు పాటలు కనబడతాయి.

4. స్త్రీ పాత్రలు లేకుండా రాయడం లేదా ఒకటో రెండో స్త్రీ పాత్రల్ని ప్రవేశ పెట్టడం, ఔత్సాహిక నాటక సమాజాల ప్రదర్శనలో సౌలభ్యం కోసం ఈవిధంగా రాసినట్లు కనిపిస్తుంది.

5. సమకాలీనమైన సమస్యలను వస్తువుగా తీసుకోడం.

6. అనాదిగా ఉన్న ఆచారాలపై నియమాలపై సంప్రదాయాలపై నిరసన, తిరుగుబాటు ప్రకటించడం.

పి.ఎస్.ఆర్. అప్పారావుగారు చెప్పిన కొన్ని ఆధునిక లక్షణాలు కూడా ఈనాటికలో ఉన్నాయి.

1. కురంగ గౌరీశంకర్ నాటికలో సంభాషణలు నాటకీయంగా ఉన్నాయి. క్లైమాక్స్‌కే ఎక్కువ ప్రాధాన్యత కనిపిస్తుంది.

2. ఈ నాటికలో వచనమే ఎక్కువగా ఉంది. నేపథ్య గానం వంటి పాటలు కూడా ఉన్నాయి.

7వ పుటలో వసంతరాగము–ఆటతాళములో ఒక పాట ఉంది.

ఎంతో హాయీా–యెంతోహాయీా...
వింతయౌన–సంతకాలం.. యెంతోహాయీా...
విరహబలం–మానవులం–హరణ మొనరించుమ....
కరణములూగలిగీయతాం–కావుదేవుండెదమెచ్చు ॥ఎంతో॥

11వ పుటలో నాద నామక్రియ ఆటలో ఒకపాట ఉంది.

వోలచ్చా వోలచ్చా యారెఇచట
గోలజేయగ వచ్చెనారె పోరే ॥వోలచ్చా॥
తాలేతాలే నాకుదరమాలు సెప్పేరు
మాలావు దొరసాన్లు పాలుబడ్డారు ॥వోలచ్చా॥

29 పుటలో ముఖారి రాగం–చాపుతాళంలో ఒకపాట ఉంది.

శివశివా! శివశివా! శివశివా! శివశివా।
యెవతయో యిదియని యెడబాసి యుంటివా ॥శివ॥
మరుడుదుస్తరుడు యేమనలేను శివశివా
పరులు నన్నెవరింక భరియింత్రు శివశివా! ॥శివ॥

31వ పుటలో యదుకులకాంభోడి-ఆటలో ఒకపాట ఉంది.

కలగంటి కలగంటి-కలలో మేలుగొంటికడను మేలుకొంటినె
విలసిల్లల మనలేడి పిల్లపాటిపోయి

వెలయుచు శివదేవు-వెనుక నిర్చిన యిట్లు ॥కల॥
లేడిపిల్ల చనినజాడనింగిన వినిలేచి మనమందఱము
కూడిపోయి శంకరుని దర్శనము జేసి
వేడుకతో వాని బూజించిన యట్లు ॥కలకంటి॥

55వ పుటలో శ్యామరాగము-ఆటతాళములో ఒక పాట ఉంది

ఇవిగో మల్లెలు యివిగో జాజులు
యెన్నో యచ్చట కలివే కలవే కలవే.. ॥ఇవిగో॥

63వ పుటలో సురచిరాగం-ఆటతాళంలో ఒక పాట ఉంది.

పరమేశ! హత మోహపాశ! ఈశ! శుభమంగళమే జయమంగళమ్
గిరిరాజాసుత సర్వగీర్వాణనుత జయమంగళమే నిత్యశుభమంగళమ్

మొ॥గు పాటలున్నాయి. ఈవిధంగా ఆధునిక నాటిక లక్షణాలు కూడ ఈ నాటికలో ఉన్నాయి.

40వ పుటలో సింహేంద్రిమధ్యమము-త్రిపుటలో ఒక పాట ఉంది.

ఈ వేళ నావిభుడేవి పాపము జేసి-ఎందుకం
మిడియించితీ-ఈశ్వరా! ఈశ్వరా!

41వ పుటలో హిందుస్తానీ-కాపీ-ఆట చాపులో ఒక పాట ఉంది.

ఎవ్వతెవే యువతీ-యెవ్వతేవే యువతీ
సతియెందుకిట సనుదెంచితివే నీవే ॥ఎవ్వ॥

ముగింపు

అభినవ భాసుడుగా ప్రసిద్ధి పొందిన దాసు శ్రీరాములు రచించిన కురంగ గౌరీశంకర నాటికలో నాలుగు అంకాలున్నాయి. ద్వితీయ అంకంలో మూడు ఘట్టాలున్నాయి. అందుచేత ఇతివృత్తం ప్రదర్శన యోగ్యమైనపుడు అంకాలను రంగాలుగా విభజిస్తారు. ఇక్కడ రచయిత ఇతివృత్తానికి, సన్నివేశానికి సరిపడ

అలంకరణ చేయడానికి రంగ విభజన చేశారు. చతుర్థాంకం కూడా రచయిత మూడు రంగాలుగా విభజించి రచించారు. దీని వల్ల నాటిక ప్రదర్శన యోగ్యమవుతుంది. ఈ నాటికలో రచయిత చంపకమాల ఉత్పలమాల, మత్తేభం, సీసము, తేటగీతి, ఆటవెలది పద్యాలు రచించారు. సంగీతపరమైన కాంభోజి, ముఖారి మొదలగు రాగాలలో పాటలు పాత్రోచితంగా ప్రయోగించారు. రచయిత ఈ నాటికను సరళమైన భాషలో మృదు మధురంగా రచించారు.

మహాకవి దాసు శ్రీరాములుగారు అనేక సామాజికాంశాలను కూడ ఈ నాటికలో ప్రస్తావించారు. వివాహం కోసం అధిక ధనాన్ని వెచ్చించలేనివారికి, ఓలి ఇవ్వలేనివారికి అక్షతావివాహం మేలైనదని భృంగిపాత్రద్వారా సూచించారు. స్త్రీలు బాల్యంలో చదువుకోవాలని, ఒకవేళ అలా చదువుకోకపోతే వివాహమైన తరువాత అయినా చదువుకోవచ్చని, గౌరిదేవి చెలికత్తెలయిన వకుళ, మాలతి, పాత్రలద్వారా ఈ వాక్యాలు పలికించారు. వివాహం విద్యకు అడ్డుకాదనే విషయాన్ని తెలియజేశారు.

ఈ నాటిక సంప్రదాయ నాటక, నాటిక లక్షణాలతో పాటు ఆధునిక నాటక లక్షణాలు కూడా ఉన్న పరిపూర్ణ నాటికగా చెప్పవచ్చు.

ఉపయుక్త గ్రంథాలు

1. శ్రీరాములు, దాసు. 1981. కురంగ గౌరీ శంకర నాటిక. మహాకవి దాసు శ్రీరాములు స్మారక సమితి బర్కత్‌పురా, హైదరాబాదు.
2. నాగయ్య, జి. 2009. తెలుగు సాహిత్య సమీక్ష. నవ్యపరిశోధక ప్రచురణలు, తిరుపతి
3. వైదేహి, వెలగపూడి. 1981. శ్రీ దాసు శ్రీరాములు గారి కృతులు ఒక సమీక్ష. శ్రీ దాసు శ్రీరాము స్మారక సమితి, విజయవాడ-2
4. ఎస్.ఎన్. మూర్తి. 2012. తెలుగు నాటక సాహిత్యం వివిధరీతులు - పరిణామాలు, సాహిత్య అకాడమి, న్యూఢిల్లీ.

హైదరాబాదు విశ్వవిద్యాలయం, తెలుగు విభాగం (జాతీయ సదస్సు) ఫిబ్రవరి 14, 2014)

□ □ □

గురజాడ ముత్యాల సరాలు-ఛందోవైశిష్ట్యం

మానవుని సామాజిక జీవన విధానంలో పాట ఒక భాగం. పనిచేసేటప్పుడు శ్రమను మరచిపోవడానికి ఉత్సాహంగా ఉండడానికి లయానుగుణమైన పాటలు పాడుతాడు. అక్షరజ్ఞానం లేకపోయినా రమ్యంగా పాట పాడతాడు. అటువంటి పాట సాహిత్యానికి పునాది వేస్తుంది. దానికి ఛందస్సు వల్ల స్థిరత్వం ఏర్పడుతుంది. ఎన్ని యుగాలు మారిన భాష మారిపోకుండ ఉండడానికి ఛందోబద్ధమైన రచన దోహదపడుతుంది. అటువంటి ఛందస్సులో మార్గ, దేశి అని రెండు భేదాలున్నాయి. దేశి రచనలలో మాత్రా ఛందస్సు ఉంటుంది. మాత్రా ఛందస్సు నుండి పుట్టిన జాతిపద్యాలుగల రచన దేశి సాహిత్యంగా పిలువబడుతుంది. ఈ దేశి సాహిత్యంలో గల ఛందస్సు దేశి ఛందస్సు. ద్విపద, త్రిపద, చౌపద, షట్పద, తరువోజ, సీసం, రగడలు, అక్కరలు, ఉత్సాహ పద్యాలు మొదలైనవి దేశి ఛందస్సు కిందికి వస్తాయి. ఈ కోవకు చెందినదే ముత్యాలసరం. 1910 జులై నెలలో తన 48వ ఏట గురజాడ అప్పారావుగారు ఈ ముత్యాలసరాలను రూపొందించి ప్రచురించారు. *(ఆరుద్ర 2007:82)*

ముత్యాల సరం నామౌచిత్యం

"ముత్యాలకోవ వలె ముద్దైన లిపి గల భాష తెలుగు భాష. తెలుగు పలుకులు ముత్యాల వంటివి. ముత్యం చిన్నది తేటదనము కలది. అలాగే చిన్న చిన్న తేట మాటల కూర్పుతో వ్రాస్తున్నాడు కనుక మిశ్రగతిలో నడిచే ఛందస్సుకు గురజాడ తన అభిరుచికి అనుగుణంగా ముత్యాలసరం అని పేరు పెట్టుకొని ఉంటాడు. ఇంతకు మించి ఈ నామౌచిత్యానికి మరే ఆధారము లేవు అని *నారాయణ రెడ్డి 212* పేర్కొన్నారు.

"ఒకానొక నూతన ఛందస్సు సృష్టించి దానికి ముత్యాలసరం అని పేరు పెట్టారు" అని ఆరుద్రగారన్నారు. *(ఆరుద్ర 2007:140)*

ముత్యాల సరం లక్షణం

"ముత్యాల సరాల లక్షణం: మొదటి మూడు చరణములలోను, సామాన్యముగా పధ్నాలుగేసి మాత్రలుండును. నాలుగో చరణమున యేడు మొదలు పధ్నాలుగా వరకూ ఉండును. విరామమును అర్థానుసారముగా చెవికింపగునట్లు మార్చ యత్నించితిని. ఎంతవరకు నాయుద్యమము కొనసాగెనో, మార్పులయెడ నీ సహనము లేని చదువరులు చెప్పవలె" అని స్వయంగా గురజాడే ముత్యాల సరానికి లక్షణాన్ని చెప్పారు. *(గురజాడ అప్పారావు 2012 - 472, 473)*

"ముత్యాల సరం ఛందస్సైన మూడు మాత్రలు, నాలుగు మాత్రలు త్రిపుట తాళంలో నడుస్తుంది. ఈ తాళం తప్పితే మాత్రం సంఖ్య సరిపోయినా పాదం నడవదు" *(శ్రీశ్రీ 1970:17)*

"ముత్యాల సరం ఛందస్సుకు నాలుగు పాదాలుంటాయి. మొదటి మూడు పాదాలు సమానమైనవి. చివరి పాదం హ్రస్వపాదం, సమపాదాలలో పాదానికి రెండు సప్తమాత్ర గణాలు (3+4) ధ (2=14) మాత్రలు ఉంటాయి. చివరి పాదం హ్రస్వపాదం సాధారణంగా 9 మాత్రలు ఉంటుంది".

(చెన్నకేశవరెడ్డి 1988:92)

నారాయణ రెడ్డి గురజాడ లక్షణాన్నే చెప్పి ఆయన స్వీకరించిన ముత్యాల సరానికి మూలమైన పార్శీగజల్‌ని ప్రస్తావించారు.

"వాఇజాకీc జల్వ బర్‌మహ్రా బోమెంబర్‌మీకునంద్
చూcబ ఖిల్వత్ మీరవంద్ ఆకారె దీగర్ మీకునంద్"

(నారాయణ రెడ్డి 2007, : 213)

ముత్యాసరం గల మొదటి గేయం

మేలుకొనుమీ భరతపుత్రుడ, మేలుకొనుమీ సుజనపుత్రుడ
మేలుకొనుమీ సచ్చరిత్రుడ, మేలుకొన తయ్యా! వత్సా మేలుకో

(శాక 1831 మాఘ సంచిక)

పై గేయంలో మొదటి పాదంలో 28 మాత్రలు, రెండవ పాదంలో 23 మాత్రలున్నాయి. దీనిని ముత్యాలసరంగా నాలుగు పాదాలుగా విభజిస్తే మొదటి మూడు పాదాల్లో 14 మాత్రలు, చివరి పాదంలో 9 మాత్రలు ఉన్నాయి. పాదపరంగా చూస్తే కొంతభేదం కనబడుతుంది.

ముత్యాలసరం వైశిష్ట్యం

ముత్యాలసరం ఛందోవైశిష్ట్యాన్ని కొంతమంది కవులు ఈ కింది విధంగా ప్రశంసించారు.

"గురజాడ ముత్యాలసరాన్ని చేపట్టినవారిలో రాయప్రోలు, అబ్బూరి, దువ్వూరి, కృష్ణశాస్త్రి, వేదుల, బసవరాజు, మల్లవరపు, శ్రీశ్రీ, పురిపండా మున్నగు ప్రసిద్ధ కవులున్నారనగా ఆ ఛందస్సుకు కలిగిన ప్రాచుర్యము వేరే చెప్పనక్కరలేదు.

(నారాయణ రెడ్డి. 2007:244)

"గురజాడ అప్పారావు అందించిన ముత్యాలసరాలను భావకవులందుకున్నారు. దాన్ని అందమైన గేయరూపంగా తీర్చిదిద్దారు. ఎవరో ఒక్కరిద్దరు తప్పిస్తే ముత్యాలసరం వాడని భావకవి లేడనవచ్చు. *(రామారావు. 1997:27)*

దేశి ఛందస్సులోని భామినీ షట్పద 14 మాత్రలుంటాయి. 3+4+3+4=14

గుమ్మడేడే గోపిదేవీ
గుమ్మడేడే కన్నతల్లీ
గుమ్మడిని పొడసూపగదవే
అమ్మ గోపెమ్మా

ఈ పై గేయంలో ముత్యాలసరం లక్షణం సరిపోయింది. చివరి పాదంలో 9 మాత్రలున్నాయి.

హరిణగతి రగడలో కూడ 7 మాత్రాగణాలు రెండు ఉంటాయి. దీనినే మంజుల గతిరగడ అని కూడా అంటారు.

కోవెల సంపత్కుమాచార్యగారు ముత్యాలసరం గురించి ఈ కింది విధంగా అన్నారు.

"ముత్యాలసరంలోని మొదటి మూడు పాదాల్లో పద్నాలుగేసి మాత్రలే ఉండి నాల్గవ పాదంలోనూ పద్నాలుగే ఉంటే అప్పుడది ముత్యాలసరం కానే కాకూడదు.

పూర్వ లాక్షణికులు చెప్పిన హరిణగతి రగడ అవుతుంది. శ్రీశ్రీ గాని గురజాడ వారి ముత్యాలసరాలకు పీఠిక రాసిన వాసిరెడ్డి భాస్కర రావుగారు గానీ, మరెవరైనా గానీ ముత్యాలసరం నడక పోలికల కోసం వృషభగతి రగడ దగ్గరికి కాక, హరిణగతి దగ్గరికి పోవాల్సి ఉంటుంది. ముత్యాలసరాన్ని హరిణగతిలో పోల్చి చూసుకోవాల్సి ఉంటుంది. కానీ వృషభగతితో కాదు". *(సంపత్కుమాచార్య కోవెల 1988:12)*

రచ్చరేకులు-ముత్యాలసరాలు

"రేకులనునవి గేయ ఫణితులుగా లాక్షణికులు పేర్కొన్నారు. ఇవి రగడ వికృతులు. రేకులనగా తాళబద్ధగేయ రచనలు" అని సంగనభట్ల నరసయ్య *(1988:126)* రాశారు.

ఈ రచ్చరేకులకి, ముత్యాల సరాలకి పోలికలున్నాయి. కంకంటి పాపరాజు విష్ణుమాయా విలాసం అనే యక్షగానంలో గల రచ్చరేకుల రచన హరిణగతి రగడ లాంటిది. అది మిశ్రగతిలో ఉంది.

మించుమోహము నించు మదిదము
కించు లేమిద లంచు నలుగుర
గాంచు తరిగా దంచు దమియర
వించు దలయిటు వంచు చున్"

పై పాదాలలో మొదటి మూడు పాదాల్లో 14 మాత్రలు, నాలుగవ పాదంలో 12 మాత్రలు ఉన్నాయి. ఇది మిశ్రగతిలోను, మాత్రల సంఖ్యలోనూ రచ్చరేకులు, ముత్యాల సరం ఛందస్సుకు సరిగ్గా సరిపోయింది.

కళిక ఉత్కళికలు : ఉదాహరణ కావ్యాల్లో కళిక-ఉత్కళికలు కనబడతాయి.

ఇవి రగడ భేదాలు : కళిక ఎన్ని పాదాలుంటే అందులోసగం ఉత్కళిక పాదం. వీటిలోని మిశ్రగతి రచన ముత్యాలసరాన్ని పోలి ఉంటుంది.

జానపద గేయం : ముత్యాలసరం ఛందస్సుగల జానపదగేయాలున్నాయి. స్త్రీలు పాడే బతుకమ్మ పాటలో మిశ్రగతి ఉంది.

మొలకకుచములు చూడు ఉయ్యాలో
పిలుచుచున్నవి నిన్ను ఉయ్యాలో
కలువరేకుల బోలు ఉయ్యాలో
కన్ను గవనూ చూడు ఉయ్యాలో *(రామరాజు.బి 1958:567)*

గురజాడ – ముత్యాలసరం – మిశ్రగతిలో గలవి.

మిశ్రగతి : 7 అక్షరాల కాలం విలువ గలవి – తకిటకిటతక – తకిటకిటతక లేదా కిటతకతకిట

గుత్తునా ముత్యాలసరములు
కూర్చుకొని తేటైన మాటల
కొత్తపాతలు మేలుకలయిక
క్రొమ్మెరంగులు జిమ్మగా *(గురజాడ సాహిత్య సర్వస్వం–331)*

అని గురజాడ ముత్యాలసరాల గురించి తెలియజేశారు.

గురజాడ రాసిన కాసులు

మనలకీ పోరాట మిప్పుడు
దేనిగూరిచి కలిగె చెపుమా
మరచితిని నవ్వేదవదేలను
యేమికారణమైన పోనీ? *గురజాడ సాహిత్య సర్వస్వం – 336*

నిండుకొలువున లవణుడనురా
జుండె జాలికుడొకడు దరిజని
దండినృప; వొకగుండుగారడి
కలదు కనుమనియెను *(గురజాడ సాహిత్య సర్వస్వం–339)*

తగటు బంగారు చీరకట్టి
కురుల పువ్వుల సరులు జుట్టి
నుదుట కుంకుమ బొట్టు పెట్టి
సొంపుపెంపారన్ *(గురజాడ సాహిత్య సర్వస్వం–352)*

వన్నెకెక్కిరి డమను పితియసు
లన్నీ యవనులు ముజ్జగంబుల
మున్ను వారల స్నేహ సంపద
నెన్నీ సంకృతం భౌ *(గురజాడ సాహిత్య సర్వస్వం–336–357)*

గురజాడ రాసిన పై ముత్యాలసరాలన్ని మొదటి మూడు పాదాలలో 14 మాత్రలు నాలుగవ పాదంలో 9 మాత్రలు గలవి. మిశ్రగతిలోఉన్నవి.

గురజాడ ముత్యాలసరాలు – గతి భేదాలు

గురజాడ రాసిన ముత్యాలసరాలలో చతురస్రగతిలో ఉన్నాయి.

చతురస్రగతి : నాలుగు మాత్రల కాల ప్రమాణం కలిగి ఉంటుంది. ఉదా: కిటతక! కిటతక! కిటతక! కిటతక

పూర్ణమ్మ :

మేలిమి బంగరు మెలక తల్లారా!
కలవలకన్నుల కన్నెల్లారా!
తల్లులుగన్నా పిల్లల్లారా
విన్నారమ్మా యీ కథను *(గురజాడ సాహిత్య సర్వస్వం : 365)*

గురజాడ రాసిన దేశభక్తి గేయం ముత్యాలసరాలలో ఖండగతి ఉంది.

ఖండగతి : ఐదు మాత్రల కాలప్రమాణం కలిగి ఉంటుంది.

ఉదా: కిటతకిట! కిటతకిట! కిటతకిట! కిటతకిట!

దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
వొట్టిమాటలు కట్టిపెట్టోయి
గట్టిమేల్ తలపెట్టవోయ్ *(గురజాడ సాహిత్య సర్వస్వం : 370)*

గురజాడ రాసిన "బొట్టు" గేయం ముత్యాలసరాలలో త్రిశ్రగతి ఉంది.

త్రిశ్రగతి : మూడు మాత్రల కాల ప్రమాణం కలది.

ఉదా: తకిట! తకిట! తకిట!

నూగు మీసపుకట్టు
కానరాని బొట్టు
నోటానసిగరెట్టు
కోటువింతకుట్టు
చేకట్టు జిలుగు వెండికట్టు
నీలగిరి కొలనుగట్టు

పై విహరించు వైష్ణవ బొట్టు *(గురజాడ సాహిత్య సర్వస్వం : 378)*

పైన చెప్పబడిన "బొట్టు" ముత్యాలసరాలు త్రిశ్రగతిలో ఉన్న కళిక పద్యంగా చెప్పవచ్చు.

నీలగిరి పాటలు : గురజాడ రాసిన "నీలగిరిపాటలు" ముత్యాలసరాలలో ఉంది. ఇది ఎనిమిదేసి మాత్రల కాల ప్రమాణం కలది

ఉదా: కిటతక కిటతక! కిటతక కిటతక

సుందర తరమీ నీలనగము దీని
యందవలు హృదయానందకరముదీని
చందము హృదయానందకరము *(గురజాడ సాహిత్య సర్వస్వం : 379)*

గురజాడ రాసిన "ఊటిచోద్యమిపుడు – నాటిమాట" ముత్యాలసరాలలో ఉంది. ఇది ఆరు మాత్రల కాల ప్రమాణం కలది

ఉదా: తకిట! తకిట! తకిట తకిట! తకిట తకిట

ఊటిచోద్యమేమి చెపుదు
వాటమైన తటములందు–దోటలెంతో సొంపుమీర
గూటములను సౌధరాజి – కుదిరిమెరయగ
నాటిమాట : నాటిమాట మరచుటయే
నాటికైన మఱవ వశమే

ఈ విధంగా గురజాడ రాసిన ముత్యాలసరాలలోని వివిధ గతులు మాత్రాగణాల ఛందస్సు వైశిష్ట్యం మనకు వ్యక్తమవుతుంది. ముత్యాల సరాల లక్షణం యక్షగానాలలోని రచ్చరేకులు, జానపదగేయాలలోని రగడ, హరిణగతి రగడ, వృషభగతిరగడ, త్రిపుటలు, షట్పదులు మొదలైన వాటిలో కనబడుతుంది.

ఈ ముత్యాలసరాల ఛందస్సుని ఉపయోగించి అనేకమంది భావకవులు, వచనకవులు – అభ్యుదయ కవులు ఎందరో కవితలు రాశారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి, అబ్బూరి రామకృష్ణారావు, నోరి నరసింహశాస్త్రి, బసవరాజు అప్పారావు, తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రి, చింతా దీక్షితులు, తల్లాప్రెగడ విశ్వసుందరమ్మ, నండూరి సుబ్బారావు, శ్రీశ్రీ మొదలైన కవులందరూ ముత్యాలసరాలను రాశారు. ఎన్ని యుగాలు మారినా గురజాడను, ఆయన సృష్టించిన ముత్యాలసరాలను ఎవరూ విస్మరించలేరు అని చెప్పడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

ఉపయుక్త గ్రంథాలు

1. ఆరుద్ర. 2007. సమగ్రాంధ్ర సాహిత్యం. తెలుగు అకాడమీ, హైదరాబాదు.
2. చెన్నకేశవరెడ్డి, జి. 1988. ఆధునికాంధ్ర గేయ కవిత్వం. జయమిత్ర పబ్లికేషన్స్, హైదరాబాద్.
3. నరసయ్య, సంగనభట్ల. 1977. తెలుగులో దేశిఛందస్సు ప్రారంభ వికాస దశలు, ఆనందవర్ధన ప్రచురణ. ధర్మపురి, కరీంనగర్ జిల్లా.
4. నారాయణరెడ్డి, సి. 2007. ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయము, ప్రయోగములు. విశాలాంధ్ర పబ్లికేషన్స్, హైదరాబాదు.
5. రమణమూర్తి, ఆర్.వి. 2012. గురజాడ సాహిత్య సర్వస్వము, తెలుగు అకాడమి, హైదరాబాద్.
6. రామరాజు, బిరుదరాజు. 1958. తెలుగు జానపద గేయ సాహిత్యము. ఆంధ్ర రచయితల సంఘం, హైదరాబాదు.
7. సంపత్కుమారాచార్య, కోవెల. 1999. తెలుగు ఛందస్సుపై కొన్ని వెలుగులు. అభినవ ప్రచురణలు, వరంగల్లు.
8. శ్రీశ్రీ. 1970. మన గురజాడ. నవోదయ పబ్లిషింగ్ హౌజ్, హైదరాబాదు.

(ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురం (జాతీయ సదస్సు అక్టోబర్ 04–2018). (భావవీణ మాసపత్రిక [illegible])

□ □ □

పెన్నేటి పాట - సమకాలీన సామాజిక దృక్కోణం

మీసరగండ విశ్వరూపాచారి (విద్వాన్ విశ్వం) అక్టోబర్ 21 1915లో అనంతపురం జిల్లా తరిమెల గ్రామంలో జన్మించారు. అక్టోబర్ 19 1987లో పరమపదించారు. ఆయన కర్నూలు, పొద్దుటూరులలోని కళాశాలలో సంస్కృత కావ్య నాటకాలంకారాలను, తర్కశాస్త్రాన్ని అభ్యసించారు. మద్రాస్ విశ్వవిద్యాలయం నుండి సంస్కృతంలోను, ఆంధ్రంలోను విద్వాన్ పట్టా తీసుకున్నారు. "నవ్య సాహిత్యమాల" అనే ప్రచురణ సంస్థను ఏర్పాటు చేసి, 'నవ్య సాహితి' అనే పత్రికకు సంపాదకత్వం వహించి ప్రజలను చైతన్య పరిచారు. ఫాసిజంపై పుస్తకాలను ప్రచురించినందుకు బ్రిటిష్ ప్రభుత్వం తరిమెల్ల నాగిరెడ్డితో పాటు విద్వాన్ విశ్వాన్ని కూడా అరెస్ట్ చేసి జైల్లో ఉంచింది. విశ్వం తిరుచిరాపల్లి జైల్లో బెజవాడ గోపాలరెడ్డి దగ్గర బెంగాలీ నేర్చుకున్నారు. అంతేగాక ఆయనకు ఆ జైలులో రాజాజీ, ప్రకాశం మొదలైన నాయకులతో పరిచయం ఏర్పడింది. ఆయన అనంతపురం జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయ కార్యదర్శిగాను, అనంతపురం జిల్లా జాతీయ సభకు, జిల్లా లోకజన సంఘానికి, మండల క్షామనివారణ సభకు, జిల్లా ఆంధ్ర మహాసభకు, ప్రధాన కార్యదర్శిగాను, జిల్లా రైతు మహాసభకు ఉపాధ్యక్షుడుగాను పనిచేశారు.

1945లో మీజాన్ పత్రికకు అసిస్టెంట్ ఎడిటర్‌గా పనిచేశారు. ఆ తరువాత 3 సంత్సరాలు విజయవాడలో ప్రజాశక్తి దినపత్రికకు అసిస్టెంట్ ఎడిటర్‌గాను, ఆ తరువాత మద్రాస్‌లో బాలభారత విద్యాలయంలో సంపాదకుడిగా పనిచేశారు. 1952 ఆగష్టు నుండి 1959 వరకు ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికకు ఎడిటర్‌గా పనిచేశారు. మరల 1963లో దినపత్రికకు అసోసేయేట్ ఎడిటర్‌గా పనిచేశారు. మళ్లీ 1967లో ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికకు సంపాదకత్వం వహించారు. 1981 నుండి తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణల విభాగానికి సంపాదకత్వం వహించారు. ఆ సమయంలోనే కథాసరిత్సాగరం 12 సంపుటాలను తెలుగులోనికి

అనువాదం చేశారు. చందమామలో పంచతంత్ర కథలను ద్విపద రూపంలో బాపు బొమ్మలతో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణగా ప్రచురించారు. బ్రహ్మసూత్రాలు, శంకర భాష్యం నాలుగు సంపుటాలను, అథర్వణ వేదాన్ని అనువాదం చేసి, ప్రచురించారు. ఇంకా అనేక నాటకాలు, కావ్యాలు రాశారు. ఆయన రాసిన కావ్యాలలో 'పెన్నేటిపాట' ఒకటి.

విద్వాన్ విశ్వం 'పెన్నేటిపాట' కావ్యానికి 'పాట' అని పేరు పెట్టడం వల్ల పాఠకుల మనస్సుకి హత్తుకోడమే గాక, వారి హృదయాలను రంజింపజేసింది. అందువల్లే ఎన్ని దశాబ్ధాలు గడిచినా ప్రచారంలో ఉంది. ఈ కావ్యం 1956 మొట్టమొదట ప్రచురింపబడింది. మరల 1974, 2001, 2009లో మలి ముద్రణ పొందంది. 'పెన్నేటిపాట' రాయలసీమ కన్నీటిగాథ. ఒక మోతుబరి రైతు కుమారుడు రంగడు. అతని తండ్రి నారపరెడ్డి నిరుపేదల పట్ల కామధేనువు వంటివాడు. రాయలసీమలో క్షామం ఏర్పడడం వల్ల, అతని ఆస్తి కర్పూరంలా కరిగిపోతుంది. రంగడి భార్య గంగమ్మ. వారిరువురు ఒకరికొకరు తప్ప ఎవరూ లేరు, ఆస్తులు లేవు. ఇరుగు పొరుగు వారి ఇళ్ళలో కొర్రలో, అటుకులో దంచి వారిచ్చే నూకలో, తవుడో తెచ్చుకుంటుంది గంగమ్మ. రంగడు బాల్యం నుండి వెట్టి చాకిరి చేస్తాడు. వీరి జీవన గమనం ఈ కావ్యంలో ఇమిడి ఉంది. ఈ కావ్యంలో ప్రస్ఫుటమయ్యే అనేక అంశాలలో సమకాలీన సామాజిక స్థితిగతులు ప్రతిబింబిస్తున్నాయి. ఆయా అంశాలు ఈ వ్యాసంలో చర్చించబడ్డాయి.

కాలం మారినా రాయలసీమ ప్రజల జీవితాలలో పెద్దమార్పు లేకపోవడం వల్ల ఈ నాటికి ఈ కావ్యం పాఠకుల చేత ఆదరింపబడుతుంది. దశాబ్దాలు గడిచినా 'పెన్నేటిపాట' లో సీమవాసుల గుండె చప్పుళ్ళు వినిపిస్తున్నాయి. ఈ కావ్యంలో సీమ వైశిష్ట్యం, నైసర్గిక స్వరూపం, దాతృత్వం, బాల శ్రామిక జీవనం, ఆహారం, భార్యాభర్తల అనురాగం, వెట్టిచాకిరి, స్త్రీ శ్రమజీవనం మొదలైన అంశాలు వ్యక్తమవుతున్నాయి.

రాయలసీమ వైశిష్ట్యం

"అచట నొకనాడు పండె
    ముత్యాల చాలు
అట నొకప్పుడు నిండె

కావ్యాల జాలు
అచ్చట నొకప్పుడు కురిసె
భాష్యాల జల్లు
విరిసె నటనాడు
వేయంచు విచ్చుకత్తి" (పెన్నేటి పాట. 2009 : 3)

పై వాక్యాలలో ఒకనాటి సీమ వైభవం వెల్లడి అవుతుంది. రాయలసీమ రత్నాలసీమ అన్నది లోకవ్యవహారం. ఒకప్పుడు అక్కడ మేలైన పంటలు పండేవని, గొప్ప గొప్ప కావ్యాలు వెలువడ్డాయని, భాష్యాలు రచింపబడ్డాయని యుద్ధాలు జరిగాయని తెలియజేశారు.

"కండలేక ఎండిపోయి
బెండు వారినా సరే!
తిండిలేక, తుండు లేక
పండ వారినా సరే!
నిండు మనసు, నిజాయితీ
పండు వయసు, పట్టుదలా
దండి చేయి, ధర్మ దీక్ష
పండించును గుండెలలో" (పెన్నేటి పాట. 2009 : 6)

కండలేక ఎండిపోయి వంగిపోయినా సరే, తినడానికి సరైన ఆహారం లేక, కట్టుకోడానికి బట్టలేక పండవారినా గాని, నిండు మనసు, నిజాయితీ, పట్టుదల, ధర్మదీక్ష, సీమప్రజల గుండెలలో దండిగా పండుతుందని కవి అభివర్ణించారు.

నైసర్గిక స్వరూపం

"నాగకన్యక లిచట
కనబడరు గాని
నాగు బాములు చక చక
సాగునిచట
....
....
ఏలాల తాజాల డోలిక లిట లేవు

తిప్ప తీగెల తలతిక్కె గాని
తరుణ ప్రవాళ లతా కుంజములు లేవు
రేణ గంపల పొదరిండ్లె గాని
....
....
నారికేళాది వనాంతర స్థలి లేదు
చిట్టీత డొంకల చేటెగాని" *(పెన్నేటిపాట. 2009 : 7)*

పై గేయంలో రాయలసీమలో ప్రకృతి, పరిసరాలు ఏ విధంగా ఉంటాయో కవి వర్ణించారు. అక్కడ నాగకన్యక లుండరు గాని, నాగుబాములు చకచక పాకుతుంటాయి. గంధర్వ కామిను లుండరు గాని, బొంత గద్దలు గుంపు గట్టి ఉంటాయి. ఏటి నుండి సహజసిద్దంగా వెలువడిన లతా ఊయలలు ఉండవు గాని, తిప్పతీగ లుంటాయి. ప్రకృతి సిద్ధమైన చిగుళ్ళతో కూడిన లతలు, పొదరిళ్ళు లేవు గాని, రేగుకంపల పొదరిళ్ళున్నాయి. ఇక్కడ లలితమైన లవంగ పొదరిల్లుగాని, అందమైన కొబ్బరి తోటలుగాని ఉండవు, చిట్టీతతో కూడిన డొంక లుంటాయి అని కవి తెలియజేశారు. ఈనాటికి రాయలసీమ భౌతిక స్వరూపం, అదే విధంగా ఉందని చెప్పవచ్చు. సీమ ప్రాంతంలోనే కాదు, వెనుకబడిన ఏ ప్రాంతంలోనైనా పరిసరాలు ఈ విధంగానే ఉంటాయి.

దాతృత్వం

"సై సై నారపరెడ్డి నీ
పేరే బంగారు కడ్డిరా
పారబోస్తివి ధాన్యమంతా
ఊరడిస్తివి పేదవోళ్ళను
....
....
పప్పూరూ అసీ వర్తం
పరషలో కోలన్న గాళ్ళు
పాడుతాంటే సంచి రూకలు
పారేస్తివి బట్టమీదా సై సై" *(పెన్నేటి పాట. 2009 : 13)*

పై వాక్యాలు నారపరెడ్డి దాతృత్వాన్ని తెలియజేస్తున్నాయి. సీమ ప్రాంతంలో పేదవారి కోసం అనేక దానధర్మాలు చేసిన నారపరెడ్డి దానగుణం వెల్లడి అవుతుంది. మరొక వాస్తవిక గాథ కూడా ప్రచారంలో ఉంది. బుడ్డా వెంగళరెడ్డి అనే వేరొక సీమవాసి కూడా ఈ ప్రాంతంలో క్షామం ఏర్పడినపుడు తన ఆస్తినంతా నిరుపేదల కోసం వినియోగిస్తాడు. చివరికి అతని భార్యల ఖరీదైన నగలు మరియు అతని సోదరి ఆభరణాలను కూడా పేదల ఆకలి తీర్చడానికి ఖర్చు చేస్తాడు. అంతేగాక నారపరెడ్డి చేతికి నరం లేకుండ దానం చేయడం వల్ల, అతని జీవన విధానం వల్ల, అతని కుమారుడైన రంగన్న చిన్నతనం నుండి వెట్టిచాకిరి చేసి బతకవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. సమకాలీన సమాజంలో ఆదర్శంగా నిలుస్తుందని చెప్పవచ్చు.

రంగన్నబాల్యం - వెట్టిచాకిరి

నారపరెడ్డి కుమారుడైన రంగన్నబాల్యం ఏ విధంగా గడిచిందో విద్వాన్ విశ్వం కళ్ళకు కట్టినట్టుగా వర్ణించారు.

"ఒకరింటి గాటిలో నూరిన గంజెల్ల
నెత్తిపోయుట కెంత యేడ్చినాడో!
ఒకరింటి దొడ్డిలో నుండిన కసవెల్ల
నూడ్చివేయుట కెంత ఉడికినాడో!
ఒకరింటి నట్టింటనున్న కొట్టలనెల్ల
దంచుట కెంత కంపించినాడొ!
ఒకరింట గంపలకున్న రాగులనెల్ల
విసురుట కెంతగా విసివినాడొ!
ఒకరి ఇంటిలో పిల్లలనూచుటకు
మరొక్కరింట పక్కలు వేయ
నొక్కరింట అరవ చాకిరీ
చేయుట కొఱకు
ఎంత దురపిల్లెనో
వాని యింత యెడద!" *(పెన్నేటిపాట. 2009 : 21)*

పై గేయంలో సీమ ప్రాంతంలో నిరుపేద చిన్నారుల జీవితాలు ఏ విధంగా ఛిద్రమైపోతున్నాయో వెల్లడి అవుతుంది. అతి చిన్న వయసులో ఉన్న రంగడు

ఒకరింటి గాటిలో ఊరిన గంజిని ఎత్తిపోయడానికి ఎంతగానో దుఃఖించాడు. వేరొకరింటిలో కసవుని ఊడ్చడానికి, ఒకరింటిలో కొర్రలను దంచడానికి, మరొకరింటిలో రాగులను విసరడానికి ఎంత కంపించిపోయాడో, ఎంత విసిగిపోయాడో అని కవి వాపోతున్నారు. అంతేగాక ఒకరింటిలో పిల్లలను ఊచడం, మరొక ఇంటిలో పక్కలువేయడం, వేరొకరింట అరవచాకిరీ చేయడానికి అతని హృదయం ఎంత వేదనకు గురైందో కదా అని కవి బాధపడ్డాడు. రంగడి శ్రమ వెనుక దాగి ఉన్న బాధను కవి పాఠకుల కళ్ళకు కట్టినట్టు వర్ణించారు. సమకాలీన సమాజంలో కూడ ఈ విధంగా వెట్టిచాకిరీ చేసే చిన్నారు లుంటున్నారు. వారి స్థితిగతులను సరిదిద్దవలసిన ఆవశ్యకత ఉంది. ఈ ఆవశ్యకతను పాఠకులకు గుర్తుచేస్తు, సమాజాన్ని చైతన్య పరిచే దిశగా కవి ఈ కావ్యాన్ని రచించారని చెప్పవచ్చు. కరోనా సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన బాలలు కూడ ఈ విధమైన వేదనకు గురి అవుతున్నారు.

సీమ ఆహారం

“కుండలోని సంగటి నంత గోకి తీసి
మూకటిని బెట్టి
మజ్జిగ మునుగ బోసి
పచ్చి మెరపకా యొక్కటి తెచ్చి యిచ్చె
ఉదయ భోజన మతని
కియ్యదియె సుమ్ము!” *(పెన్నేటి పాట. 2009 : 25)*

సీమ ప్రాంతంలో సంగటిని ఆహారంగా తీసుకోడం సర్వసాధారణం. ధనవంతులందరూ సన్న బియ్యంతో తయారుచేసిన ఆహారాన్ని తింటూ ఉన్నపుడు సంగటి శ్రామికుల ఆహారంగా గుర్తించబడింది. అదే సంగటి నేడు నాగరికుల ఆహారంగా మారి పోయింది. ముఖ్యంగా కరోనా కాలంలో ఇటువంటి ఆహారం రోగనిరోధక శక్తిని పెంచు తుందన్న ప్రచారం వెలుగులోకి వచ్చింది. నేడు ప్రతి ఒక్కరూ ఈ ఆహారాన్ని స్వీకరిస్తున్నారని చెప్పడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

అదే విధంగా సీమలో లభించే పళ్ళు గురించి కవి వర్ణించారు.

“కాసేపు రాల్చిన గంపల కొలదిగా
కమ్మని కలివి పండ్లమ్మవచ్చు
కొంత సేపు చాలు కొల్లలు కొల్లలు

బలస కాయలు గంప బట్టవచ్చు
ఇంత సేపే చాలు నెన్నైన రేణగా
యలు కోసుకొని అమ్మనైనవచ్చు
ఒక ఇంతసేపు నోపిక గోసుకొన్న చాల్
సీమచింతలు వడి జేర్చవచ్చు" *(పెన్నేటి పాట. 2009 : 31)*

రాయలసీమ ప్రాంతంలో సీమ వాక్కాయలు, బలుసు కాయలు, రేగికాయలు, సీమ చింత కాయలు మొదలైనవి లభిస్తాయి. వాటిని ఆహారంగా స్వీకరించడమే గాక, వాటిని అమ్ముకుని జీవనం సాగించే వ్యక్తులు ఉన్నారు. ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాలలో కొన్ని కుటుంబాలు ఈ పండ్లను విక్రయించి జీవిస్తుంటారు. ఈ కావ్యం ద్వారా నేటి సమాజంలోని నిరుపేదల జీవనం వెల్లడి అవుతుంది.

భార్యాభర్తల అనురాగం

పెన్నేటిపాట సీమ కన్నీటిపాట మాత్రమే కాదు. దానిలో కుటుంబ జీవనం సాఫీగా సాగడానికి అవసరమైన భార్యాభర్తల అనుబంధాన్ని తెలియజేసే అంశాలు కూడా ఉన్నాయి.

"పొంత నీళ్ళు దెచ్చి
రవంత వంగి నిలుచుకొన్న
రంగన్న పైనిమిరి నిమిరి
కడుగుచున్న
ఆ యిల్లాలి కరయుగమ్ము
వేయి సంజీవనుల
మేళవింపు సుమ్ము
ఆ నిర్మల ప్రేమ
హస్త సంస్పర్శతో
మానిపోయిన వేమొ
వాని గాయములు
లోని ఒక్కొక యెముక
హూనమై యున్న
వాని తీపులు కొంత
వదిలి నట్లయ్యె"

"ఇన్ని ఇడుములు
నీకోసమే భరించుచుంటినని
అతడనడు
నీ సుఖము కొఱకె
బ్రతుకుచుంటి నటంచు
ఆమె పలుకదెపుడు
మాట లేటికి
మనసులో మరులు పొరల" *(పెన్నేటి పాట. 2009 : 35)*

రంగన్న అతని భార్య గంగమ్మ మధ్య ఉన్న ఆప్యాయత అనురాగం ఇక్కడ వెల్లడవుతుంది. రంగన్న ఇంటికి రాగానే గంగమ్మ పొంతకుండలో ఉన్న నీటిని తెచ్చి వంగి ఉన్న అతని పై పోసి చేతితో శరీరాన్ని రుద్దగానే, ఆమె హస్త స్పర్శవల్ల, అతని శరీరంపై గల గాయాలన్ని మానిపోయాయట. అంతేగాక ఈ కష్టాలన్ని నీ కోసమే అని రంగన్న గంగమ్మతో చెప్పడు. నీ సుఖం కోసమే బతుకుతున్నానని ఆమె చెప్పదు. వారిద్దరి మధ్యగల ప్రేమానురాగాలే అందుకు కారణం.

"రంగడంటే ఒక్కగంగమ్మ మగడె
గంగన్న అననొక్క రంగన్న పడుచె
రంగన్న బ్రతుకెల్ల గంగమ్మ బ్రతుకె
గంగమ్మ మనసెల్ల రంగన్న మనసె
రంగని గంగన్నాయని,
గంగమ రంగమ్మయనుచు గ్రామప్రజలున్
భంగుల భంగుల పిలుచుట
కంగారునెకాదు, వారి కలయిక దెలుపున్.' *(పెన్నేటిపాట. 2009 : 29)*

రంగడంటే గంగమ్మేనేమో, గంగమ్మంటే రంగడేనేమో అని వారిరువురు వేరు కాదు అన్న విధంగా జీవిస్తూ ఉంటారని కవి వర్ణించాడు. ఆ గ్రామ ప్రజలు కూడా రంగన్నను గంగమ్మ అని, గంగమ్మను రంగన్న అని పిలుస్తుంటారు. గ్రామస్తులు వారిని ఈ విధంగా పిలవడం వల్ల రంగన్న, గంగమ్మ ఎంత అన్యోన్యంగా ఉంటున్నారో వ్యక్తమవుతుంది.

సమకాలీన సమాజంలో వైవాహిక జీవనాన్ని గడుపుతున్న భార్యాభర్తలు అనుసరించ దగిన అంశంగా పై విషయాన్ని చెప్పవచ్చు. నాగరిక జీవనాన్ని

గడిపే స్త్రీ పురుషులు కొందరు వివాహమైన మరుసటి రోజే విడిపోతున్నారు. అటువంటి వారికి రంగన్న, గంగమ్మల జీవితాన్ని, వారి అనుబంధాన్ని ఉదాహరణగా చూపి, సమాజాన్ని సంస్కరించవచ్చు. ఇటువంటి సాహిత్యం ద్వారా సమాజం సంస్కరింప బడుతుందని చెప్పడంలో ఏ మాత్రం సందేహం లేదు.

సీమ - వెట్టిచాకిరీ

ఈ కావ్యంలో రంగన్న చేసిన వెట్టి చాకిరీ కూడ వర్ణింపబడింది.

> "గబగబ బువ్వన్
> నాలుగు కబళమ్ములు మ్రింగి
> రెడ్డిగారింటికి రోజు బరాతము రాగా
> ....
> పోటు కడవ,
> గుండెపోటు వచ్చును
> నింపి యెత్తుకున్న మాత్ర
> ఇంక నేడు మట్ల లోతు నుంచి
> మెట్ల నెక్కుట యన్న,
> నెంత కండయున్న, నేమి చాలు
> ఎన్ని కడవలు పోసిన
> నెంత పెద్ద ఔతుకానాయె కాని
> పై కైన రావు
> అన్ని నీళ్ళేమి సేతురో ఉన్నవారు
> ....
> మాటయేగాని వీరిచ్చు మూటలేదు
> ఏటి పట్టెల పాలన్న దాటిపోయె,
> పూట కొక ముంత మజ్జిగ బోతు రంతె-
> పేదవాని కదే అమృతోదనంబు". *(పెన్నేటిపాట. 2009 : 36)*

రంగడు ఉదయాన్నే రెండు ముద్దలు బువ్వ తిని, తాను పనిచేసే రెడ్డి ఇంటికి వెళతాడు. ఆ తరువాత అతడు కడవ భుజాన వేసుకుని లోతైన బావిలోకి దిగి నీరు ముంచి మెట్లెక్కి ఆ కడవను మోసుకుని పైకి వచ్చేటప్పటికి గుండెపోటు వచ్చినంత పని అవుతుంది. ఎంత కండ ఉన్న వారికైనా ఈ పని కష్టమే అని కవి

సీమప్రాంతంలోని నీటి కొరతను ఈ కావ్యంలో తెలియజేశారు. అంతే గాక రంగడు పని చేస్తున్న ఇంటిలో స్నానాల గదిలో ఉన్న నీటి తొట్టిలో ఎన్ని కడవల నీరు పోసినప్పటికి, అది నిండదు. ఈ ధనవంతులు అన్ని నీళ్ళను ఏమిచేస్తారో! అని రంగడు మనస్సులో అనుకున్నట్లు, కవి తన మనోగతాన్ని వ్యక్తం పరిచారు. సమాజంలో నీటిని వృథా చేసేవారికి కవి ఒక సూచన చేశారని చెప్పవచ్చు. ఆయన భవిష్యత్ తరాలకు నీటి ప్రాధాన్యతను తెలియజేశారు. సమకాలీన సమాజానికి తమ బాధ్యతను గుర్తుచేయడమే గాక, చైతన్య పరిచే విధంగా కవి ఈ కావ్యాన్ని రచించారని చెప్పవచ్చు.

"మాటయేగాని వీరిచ్చు మూటలేదు
....
పూట కొక ముంత మజ్జిగ బోతు రంతె
పేదవాని కదే అమృతోదనంబు" *(పెన్నేటి పాట. 2009 : 36)*

సీమప్రాంతంలో శ్రమదోపిడీ జరుగుతుందన్న విషయాన్ని కూడా కవి ఈ కావ్యం ద్వారా పాఠకలోకానికి తెలియజేశారు. ఇంటి పని అంతా చేసే రంగడికి వారిచ్చేది ఒక ముంతడు మజ్జిగ మాత్రమే. ఆ మజ్జిగనే పేదవాడు అమృతంతో సమానంగా భావిస్తాడు. ఈ విధానం వల్ల సమాజంలో ధనవంతుడు, మరింత ధనవంతుడు అవుతున్నాడని, నిరుపేద కడు నిరుపేదగాను మిగిలి పోతున్నాడని చెప్పవచ్చు.

రంగడు నీరు మోయడం పూర్తి అయిన తరువాత, వడ్లు దంచడం, కొర్రలు విసరడం మొదలైన పనులు కూడ చేస్తాడు.

"లాందరాలు తుడిచి,
లాంపులు ముట్టించి
మిద్దెమీద వరుస మిగులకుండ
మంచములను వేసి,
మనిషెత్తు పరుపులు
దులిపి, పఱచి దోమ తెఱల గట్టె" *(పెన్నేటిపాట. 2009 : 37)*

రంగడు పై పనులన్ని పూర్తి అయిన తరువాత లాంతరు తుడిచి, వెలిగించడం, మంచాలు వేయడం, పరుపులు దులపడం, దోమతెరలు కట్టడం మొదలైన పనులు కూడా చేసేవాడు. సీమప్రాంతంలో పని వాళ్ళతో ఎంత వెట్టిచాకిరీ

చేయిస్తారో కవి తెలియజేశారు. రంగడు తన శక్తికి మించిన శ్రమచేసే వాడన్న విషయం తెలుస్తుంది. ఈ ప్రాంతంలో శ్రామికులు దోపిడీకి గురవుతున్నారన్న విషయం వ్యక్తమవుతుంది. ఈ నాటికి ఈ కావ్యం ఆదరింపబడడానికి గల కారణం, ఆధునికంగా ఎంతో అభివృద్ధిని సాధించామని చెప్పుకుంటున్న నేటి సమాజంలో కూడా ఇటువంటి పరిస్థితులు నెలకొని ఉండడమే.

మానవతా దృక్పథం

సీమ ప్రాంతంలో కొంత మందిలో లోపించిన మానవత్వాన్ని గుర్తు చేస్తూ కవి కింది వాక్యాలను రాశారని చెప్పవచ్చు.

"ఈ యింట నేమూలనైన
చేయి వెట్టినరాల్ వరాలు
ఈ యిల్లు దాటితేనేమొ
వేయంచులన్ దెగు నరాలు" *(పెన్నేటిపాట. 2009 : 38)*

"ఇచట త్రేన్పులెకాని విన్పింప వూర్పులు
ఇచట రూకల గల గల లెత్తిపోవు
ఇచట లక్ష్మీ సరస్వతులే వసింతురు
ఇచట లేనిది మానవ హృదయ మొకటె" *(పెన్నేటి పాట. 2009 : 39)*

ఎచట జూచిన చిత్రాలు
"నెన్నొ శిల్ప ఖండములు గనిపించు
నెక్కడను మలిన మన్నదేలేదు
కాని, సంపన్న గృహము
చొచ్చి చూచిన
నాత్మయే
శూన్య మిచట" *(పెన్నేటి పాట. 2009 : 39)*

ధనవంతుల ఇళ్ళలో కడుపు నిండినపుడు వచ్చే త్రేన్పులే వినబడతాయి గాని, నిరుపేదల నిట్టూర్పులు వినబడవు. అక్కడ రూపాయల గలగలలే వినబడతాయి. వారి ఇళ్ళలో లక్ష్మీ సరస్వతులు నివసిస్తారు. కాని ఇక్కడ లేనిది మానవ హృదయ మొక్కటే మరియు వారి ఇళ్ళలో రకరకాల చిత్రాలు, ఎన్నో శిల్పాలు, కళాఖండాలు అమర్చబడి ఉంటాయి. వాటి మీద ఎక్కడా మలిన మన్నదే

కనబడదు. కాని ధనవంతుల గృహాలలో ఎంత వెదికినా ఆత్మ అన్నదే కనబడదు, అని కవి తన అభిప్రాయాన్ని రంగన్న పాత్ర ద్వారా వ్యక్తీకరించారు.

సమాజంలో మానవత్వం లోపించిన వ్యక్తుల గురించి కవి ఈ కావ్యం ద్వారా ప్రపంచానికి తెలియజేశారు. విద్వాన్ విశ్వం ధనవంతులకి, నిరుపేదలకి సమాజంలో గల వ్యత్యాసాన్ని చాటి చెప్పే ప్రయత్నం చేశారు. తమ సుఖం కోసం రోజంతా వెట్టి చేసే సాటి మనిషికి కడుపు నిండా ఆహారం పెట్టకపోవడం, శ్రమకు తగిన వేతనాన్ని చెల్లించక పోవడం మనిషిగా స్పందించలేని, హృదయంలేని వ్యక్తులుగా కవి వారిని అభివర్ణించారు. వారి ఇంటిలో ఉన్న చిత్రాల మీద, కళాఖండాల మీద మలిన మన్నదే ఉండదు. ఎందుకంటే ఆ మలినమంతా వారి హృదయాల మీదే పేరుకుపోయింది. ఇటువంటి సమాజానికి కనువిప్పు కలిగించాలన్న ఆలోచనతోనే కవి ఈ కావ్యాన్ని రచించారని చెప్పవచ్చు. సమకాలీన సమాజంలో ఇటువంటి సాహిత్యం ఆదరింపబడు తుందంటే! ప్రజలు మార్పుని కోరుకుంటున్నారని భావించవచ్చు. ధనవంతులున్న సీమలో వేటాడి వెదకినా నేటి నిరుపేదల నిజరూపు కనబడదని కవి తెలియజేశారు. ఇక్కడ సీమ స్థితి గతులు వెల్లడి అవుతున్నాయి.

స్త్రీ – శ్రమజీవనం

"అటుకుల దంపకమ్మన
మహాశ్రమ దాయకము
అగ్గిరేగు గుప్పిట
ఉడికించి వడ్ల, నొక పెద్ద పెనమ్మున వేసి
రోటిలో పిటపిటలాడ దంచవలె
పీకల మీదుగనుండు
నల్గు రొక్కటి తరువాత నొక్కటి
చకాచక పోటులు వేయగావలెన్" *(పెన్నేటిపాట. 2009 : 50)*

స్త్రీలు అటుకులు దంపడానికి ఎంత శ్రమపడి దంచుతారో పై గేయంలో కవి తెలియజేశారు. అగ్గిమీద పెనంలో వేయించి, వేడివేడిగా ఉన్న వడ్లను వెంటనే రోటిలో వేసి నలుగురు స్త్రీలు రోకళ్ళతో వెంట వెంటనే పోటువేసి దంచుతారు. ఆ సమయంలో ఆ స్త్రీల పరిస్థితిని కవి ఈ కింది గేయంలో వర్ణించారు.

"చేతులు బొబ్బలెక్కె,
నలసెన్ బదముల్ దగవుట్టె
గుండెలున్ కూతలు వెట్టె

రక్తము రగుల్కొనె
ముక్కుల నూపిరాడుటే
మోతగనుండ
కన్ను లరమోడ్పులకుం దగవయ్యె,
ఱెప్పపాటే తడవైన
రోకలి పెఱిల్లను
రెక్క శఱించు ఠక్కునన్" *(పెన్నేటిపాట. 2009 : 50)*

అటుకులు దంపే స్త్రీల చేతులు బొబ్బలెక్కుతాయి. వారి గుండె నుండి ఉచ్ఛ్వాసనిశ్వాల శబ్దం వెలువడుతుంది. శరీరంలో రక్తం వేడెక్కుతుంది. వారికి ఊపిరాడడమే కష్టంగా ఉంటుంది. రెప్పపాటు కాలంలోనే స్త్రీలు రోకటిపోటు వేసి, తీస్తుండాలి. ఈ విధంగా స్త్రీలు ఒక్క క్షణం కూడా ఆగకుండ చేయి మార్చి మార్చి దంచుతుంటారు.

"నిప్పు చెఱగు నెండ! దుప్పటే పైకప్పు
మూడు ప్రొవ్వులందు ! మొద్దు మంట
వాయిమీద వాయి! వడి దంపక మ్మింక
చెప్పనేల వారి! తిప్పలంత!" *(పెన్నేటిపాట. 2009 : 51)*

దుప్పటి మాత్రమే పైకప్పు గాగల, నిప్పులు చెరిగే ఎట్టిటి ఎండలో మూడు పొయ్యిలలో గల మొద్దు మంటలో వేయించబడి వాయి మీద వాయిని వడివడిగా దంపే స్త్రీల తిప్పలు చెప్ప నలవికానివి. ఆ విధంగా దంపుతున్న స్త్రీలలో గంగమ్మ మాత్రమే చాలా చిన్నదట. ఆమె ఆ వేడిని తట్టుకోలేకపోతుంది అప్పుడు ఒక పెద్ద ముత్తైదువ గంగమ్మను కొంతసేపు సేద దీరమని చెబుతుంది.

రంగన్నకు అన్ని విధాల చేదోడు వాదోడుగా ఉండాలని గంగమ్మ భావిస్తుంది. అతని ఆదాయం అంతంత మాత్రమే. అందువల్లే గంగమ్మ కూడా శ్రమచేస్తుంది. ఒక రోజు గడవడానికి శ్రామిక జీవనం గడిపే స్త్రీలు ఎంత కష్టపడుతున్నారో తెలుస్తుంది.

భాషాంశాలు

పెన్నేటిపాటలో సీస పద్యాలున్నాయి. ముత్యాలసరాల ఛందస్సు ప్రయోగింపబడింది. కవి ఎక్కువగా వృత్త్యనుప్రాసాలంకారాన్ని ప్రయోగించారు. అనేక మాండలిక పదాలున్నాయి.

వృత్త్యనుప్రాసాలంకారం

ఒకే అక్షరం అనేక సార్లు ఆవృతమైతే వృత్త్యనుప్రాసాలంకారం.

ఉదా: "అంగముల నిగ నిగ సా
రంగముల లగువు బిగువు రంగుల సొగసున్"

(పెన్నేటిపాట. 2009 : 25)

పై పద్యంలో 'గ' అనే అక్షరం అనేక సార్లు ఆవృతమైంది.

మాండలిక పదాలు

ఔతుఖానా	–	స్నానాల గదిలో ఉంచే నీళ్ళతొట్టి
మహడీ	–	మేడ
దస్త్రము	–	ప్రామిసరీ నోట్ల కట్టలు
దూడ వయస్సు	–	పసితనం, లేతవయసు
కొట్టము	–	పాక
కణజం	–	ధాన్యం నిల్వ చేసేది
ఆయకము	–	తనఖా
మడక	–	నాగలి
నల్తూము	–	నాలుగు తూములు
పొంత	–	పొయ్యి పక్కన మంట తగిలేట్టుగ పెట్టిన కుండ
మిరప గింజలు	–	మిరియాలు
జీవాలు	–	గొఱ్ఱెలు, మేకలు
పాతర	–	ధాన్యం నిల్వచేసే నేల మాళిగలు
లోటా	–	పంచపాత్ర, గ్లాసు, టంబ్లరు
మాల పున్నమి	–	మహాలయ అమావాస్య
కనుమ	–	కొండ దాటడానికి గల ఇరుకు దారి

కలివి కాయలు - సీమ వాక్కాయలు
కసవు - చెత్త
రేణు కాయలు - రేగు పళ్ళు

ఈ విధంగా పెన్నేటిపాటలో అనేక సామాజికాంశాలతో బాటు, ఛందస్సు, అలంకారాలు, రసము, భాష మొదలైనవి పరిశీలించదగిన అంశాలున్నాయి. సమాజంలోని పరిస్థితులు వర్ణింపబడడం చేత ఈ కావ్యం వెలువడి దశాబ్దాలు గడిచినా, పాఠకుల చేత ఆదరింపబడుతుంది. ఆనాటి నుండి నేటి వరకు సీమలోని నిరుపేదల గుండె చప్పుళ్ళు వినిపిస్తూనే ఉన్నాయి. శ్రమదోపిడీ జరుగుతూనే ఉంది. విద్వాన్ విశ్వం సీమప్రాంతంలో అభివృద్ధిని ఆకాంక్షించి ఈ రచన చేశారు. అయినప్పటికీ ఈ కావ్యంలోని వివిధ అంశాలు వెనుకబడిన ప్రాంతాలన్నింటికి అన్వయించుకోదగినవి.

ఉపయుక్త గ్రంథాలు

1. కృష్ణకుమారి, నాయని. 2000. తెలుగు జానపద విజ్ఞానం సమాజం - సంస్కృతి - సాహిత్యం. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, హైదరాబాదు.
2. కృష్ణమూర్తి, భద్రిరాజు. భాష – సమాజం – సంస్కృతి. 2014. Neelkamal publication, Hyderabad.
3. విద్వాన్ విశ్వం. 2009. పెన్నేటి పాట. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
4. సుబ్బారావు, టి.వి. 2013. తెలుగు వీరగాథా కవిత్వం. శ్రీకృష్ణదేవరాయ రసజ్ఞ సమాఖ్య, బెంగుళూరు.

(శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తెలుగు అధ్యయన శాఖ, తిరుపతి – జాతీయ సదస్సు అక్టోబర్ 21, 2021) (భావవీణ మాసపత్రిక [illegible] [illegible], [illegible])

□ □ □

సినారె గజళ్ళు వస్తువైవిధ్యం

రచయిత పరిచయం:

సింగిరెడ్డి నారాయణరెడ్డి 1931 జులై 29వ తేదీన తెలంగాణ రాష్ట్రంలోని సిరిసిల్ల జిల్లా నందలి హనుమాజీ పేట గ్రామంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు బుచ్చమ్మ, మల్లారెడ్డి. నిజాం పాలనాకాలంలో తెలుగు అందుబాటులో లేకపోవడం వల్ల ఉర్దూ మీడియంలో విద్యనభ్యసించారు. శతావధాని శేషాద్రి రమణ కవుల వద్ద ప్రైవేట్‌గా తెలుగుని అభ్యసించారు. సినారె 1954లో మాస్టర్ డిగ్రీ పూర్తి చేశారు. 1962లో 'తెలుగు ఆధునిక సంప్రదాయాలు' అనే అంశంపై పిహెచ్.డి. పూర్తి చేశారు. 1976లో ఆచార్యులుగా జీవితాన్ని ప్రారంభించారు. ఆయన 85 పైగా రచనలు చేసి ప్రచురించారు. జలపథం, నవ్వనిపువ్వు, విశ్వగీతి, నారాయణరెడ్డి గేయాలు అజంతా సుందరి స్వప్న భంగం, కర్పూర వసంతరాయలు, మంటల మానవుడు, విశ్వంభర మొదలైన రచనలు చేశారు. సి. నారాయణరెడ్డి గారు 2017 జూన్ 12వ తేదిన పరమపదించారు. 1981 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులుగాను, 1985లో అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఉపకులపతిగాను, 1989లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉ పకులపతిగాను, 1992లో ఆంధ్ర ప్రషబుత్వ సాంస్కృతిక వ్యవహారాల సలహాదారుగా పనిచేశారు.

అవార్డులు :

సినారె గారికి 1973 సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. 1988లో విశ్వంభర అనే రచనకు జ్ఞానపీఠ్ అవార్డు వచ్చింది. 1978లో ఆంధ్ర విశ్వవిద్యాలయం గౌరవ ప్రపూర్ణతో సత్కరించింది. 1982లో సోవియట్ ల్యాండ్ నెహ్రూ అవార్డు, 1988లో పద్మశ్రీ, 1992లో పద్మభూషణ్ లభించాయి. ఉత్తమ

గేయ రచయితగా రెండుసార్లు నంది అవార్డులు గ్రహించారు. 2014 సాహిత్య అకాడమీ ఫెలోషిప్ కూడా లభించింది.

డా.సి. నారాయణరెడ్డి గజల్ గురించి ఈకింది విధంగా తెలియజేశారు. ఉర్దూభాషలో గజల్ ఒక కమనీయ కవితాలహరి.

ఒక గులాబీలగుచ్ఛం

చకమత్తకోకిల రసాత్తకూడితం

సరసభావన చమత్కార, ఖేలన ఇంపూ, కుదింపూ గజల్ జీవగుణాలు.

అది జోలపాడుతుంది. జ్వాల రేపుతుంది. గజల్‌లో ఒకే విషయాన్ని చెప్పాలన్న నిర్బంధం లేదు. భావం ఏ చరణానికి అచరణం విడిగా ఉండొచ్చు. గజల్ పల్లవిని "మత్లా" అంటారు. చివరి చరణాన్ని "మక్తా" అంటారు.

పల్లవి చివర ఉన్న పదం, ప్రతి చరణం చివర అంత్యప్రాసను రూపొందిస్తుంది. కొన్నిట్లో అంత్యప్రాసకు ముందు మరో ప్రాసపదం ఉంటుంది. వీటిని రదీప్ ఖాఫియా అంటారు. చివరి చరణంలో కవినామ ముద్ర ఉంటుంది. దీనిని తఖల్లుస్ అంటారు. నా తఖల్లుస్ 'సినారె' అని సి నారాయణరెడ్డి గారు తన గజళ్ళ గురించి తెలియజేశారు.

(సి.నారాయణరెడ్డి. సమగ్ర సాహిత్యం. 2000 : 39)

గజళ్ళలో అనేక అర్థాలున్నా శృంగారం, తాత్విక స్పర్శ ఉంటుందని కానీ సినారె తన గజళ్ళలో ప్రణయానికి బదులు మానవీయ దృక్పథాన్నీ ప్రగతి శీలాన్ని, మెత్తని అధిక్షేపాన్నీ ప్రవేశపెట్టినట్లు తెలిపారు.

సాధారణంగా మనిషి జీవితంలో అనేక ఆటుపోటులు ఎదుర్కొంటాడు. సుఖదుఃఖాలు, స్థానికత, జీవనసరళి, సమకాలీన పరిస్థితులు, వివిధ సిద్ధాంతాల ప్రభావం వ్యక్తి మీద ఉంటుంది. పై అంశాల ప్రభావం అతను సృష్టించిన సాహిత్యం మీద కూడా ఉంటుంది. కవి తన జీవితంలో పొందిన అనుభవాలను సాహిత్యంలో పొందుపరుస్తాడు. సి. నారాయణరెడ్డి గజళ్ళలో కూడ అవే మనకు గోచరిస్తాయి.

1. అమ్మ

అమ్మ ఒకవైపు దేవతలంతా ఒకవైపు
సరితూచమంటే నేను ఒరిగేను అమ్మవైపు

ఈ బండి చూడరానాన్నా ఈ గుర్రమింక నీదన్నా
తెగమంగుతో చిననాటు దిగలేదు అమ్మ మూపు
రొదలలో మౌన పాఠంలా వ్యధలలో జ్ఞానపీఠంలా
నా బాల్యమంతా తానే నడిపింది అమ్మ చూపు
చీకటికి చంద్రబింబంలా ఆకలికి పూర్ణకుంభంలా
నిలువెల్ల మమతల వెలుగై నిలిచింది అమ్మ రూపు
మెరిసే ప్రభాత కిరణంలా విరిసె వసంత కుసుమం
పెరిగే 'సినారె' బ్రతుకులో దొరికింది అమ్మ ప్రాపు

(సి.నా.రె.స.సా 6 సంపుటం. 2000 : 50)

అమ్మ గొప్ప దనం సినారె రాసిన పై గజళ్ళలో వ్యక్తమవుతుంది. దేవుడు లేడనే వ్యక్తులుంటారుగాని అమ్మ లేదనే వ్యక్తులుండరు. దేవతలంతా ఒకవైపు అమ్మ ఒకవైపు సరితూచమంటే అమ్మ వైపే ఒరగడం, అమ్మ చూపు కవి బాల్యంలో జ్ఞానపీఠంలా నడుపుతుంది. అమ్మ రూపం చీకటిలో చంద్రబింబంలా ఆకలితో ఉన్నప్పుడు పూర్ణకుంభంలా నిలువెల్ల మమతల వెలుగై నిలిచింది. మెరిసే ప్రభాత కిరణంలా విరిసే వసంతకుసుమంలా పెరిగే సినారెకి అమ్మ ప్రేమ దొరికినట్లుగా ఆయన తన జీవితంలో పొందిన, అమ్మ ప్రేమను అనురాగాన్ని పై గజళ్ళలో తెలియజేశారు.

2. గురుశిష్యుల సంబంధం

నేర్పిన చదువుకు కృతజ్ఞతలు అందించే రోజులు కావులే
శిష్యుడే గురువు పరువు వీధిలో చెరిగేస్తే ఏం చేయను

విశ్వాసంతోనే మనుషులు జీవిస్తారు ఆత్మ తృప్తితో.
కాపలా కుక్క తన యజమానిని కరిచేస్తే ఏం చేయను.

(సి.నారాయణరెడ్డి, సమగ్ర సాహిత్యం 6వ సంపుటి. 2000 : 95)

నేటి సమాజంలో గురుశిష్యుల సంబంధం ఏవిధంగా ఉందో సినారె పై గజళ్ళలో వ్యక్తపరచారు.

విద్య నేర్పిన గురువుపట్ల శిష్యుడు కృతజ్ఞతా భావం కలిగిఉండాలి. కాని ఆ శిష్యుడే గురువు పరువుని వీధిలో చెరిగితే ఏమి చేయలేని పరిస్థితి గురువుది.

3. స్నేహం

అచ్చమైన స్నేహానికి అద్దంలా నిలిచినా
దుమ్ములా తనంతతానె కమ్ముతుంది విరోధం

(సి.నారాయణరెడ్డి, సమగ్రసాహిత్యం 6వ సంపుటం, పుట 121, 2000)

స్వచ్ఛమైన అద్దానికి దుమ్ము ఎలా అలముకుంటుందో అదేవిధంగా మంచి స్నేహితుల మధ్య అపుడప్పుడు విరోధం ఏర్పడుతుంది.

4. అసూయ

ఎదుటివాని ఎదుగుదల రుచించదోయ్ అసూయకు
సూర్యోదయ మవుతుంటే చూడలేదు నిశీథం *(పుట–121)*

మానవునిలో నిక్షిప్తమై ఉన్న అసూయా ద్వేషాలకు ప్రతీకగా కవి రాసి గజల్‌ని తీసుకోవచ్చు. ఎదుటివ్యక్తి అభివృద్ధిని హర్షించలేని మానవ నైజాన్ని సినారె తెలియజేశారు. చీకటి సూర్యోదయాన్ని ఏవిధంగా చూడలేదో, ఎదుటివ్యక్తి ఎదుగుదలను అసూయా పరులైన వ్యక్తులు చూడలేరు.

5. దళిత దృక్పథం

పోటెత్తిన సాగరం ఒదిగి కూచుంటుందా
అలలెత్తిన ఆగ్రహం క్షణం పడుకుంటుందా
ఏ వత్తిని వెలిగిస్తామని ఊరించారో
ఆవత్తి విసిగిపోతే కత్తి కాకుంటుందా
ఆ పక్కా ఇళ్లకు పక్కన పూరిగుడిసెలా?
ఈ పచ్చి దగాలకు విముక్తి లేకుంటుందా
ఏ మూలుగు కొనవూపిరి పిసికేస్తున్నారో
ఆ మూలుగు ఎలుగెత్తి ఒరే అనకుంటుందా?
ఆసహనం అసమర్థత అని అణిచేస్తుంటే
అట్టడుగు మట్టి బిడ్డ తిరగబడకుంటుందా
ఏ వ్యవస్థ పీడితుల గొంతు నులిమేస్తుందో
ఆ వ్యవస్థపై చావుదెబ్బ పడకుంటుందా! *(పుట 131–132)*

సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా దోపిడీకి గురైన పీడిత వర్గాలను ప్రతీకగా తీసుకొని సి.నారాయణరెడ్డి ఈ గజళ్ళను రచించారు. సమాజం సాహిత్యం

రెండు బింబ, ప్రతిబింబాల వంటివి. సమాజంలో ప్రతి వ్యవస్థ సాహిత్యంలో ప్రతిబింబిస్తుంది. దోపిడీకి గురైన శ్రమ జీవులు సముద్రంలా పోటెత్తారని, అలలవలె వారి ఆగ్రహం ఎగసిపడుతుందని క్షణం కూడ ఆగదని కవి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పక్కా ఇళ్ల పక్కనే పూరి గుడిసెలు గల సామాజిక వ్యవస్థ గురించి కవి రాశారు. అసమర్థత పేరుతో దళితులను అణచివేస్తుంటే తిరుగుబాటు చేస్తాడని, ఏ వ్యవస్థ అయితే పీడిత ప్రజల గొంతు నులిమేస్తుందో ఆ వ్యవస్థపై చావు దెబ్బపడుతుందని, అది నశిస్తుందని కవి తన గజళ్ళ ద్వారా వ్యవస్థను హెచ్చరించారు.

6. పిరికితనం

చినుకు పడగనే ఉలిక్కిపడితే జీవితమెలా భరిస్తావు
నిత్యం బిగుసుకు చస్తూ వుంటే మృత్యువునెలా తరిస్తావు.
మరీ అంతనాజూకుగవుంటే మనుగడ సాధ్యం కాదు సుమా
ఆర్తికి గిలగిలలాడే వాడివి కీర్తిని ఎలా ధరిస్తావు.
చెరగని సంకల్పం కావాలోయ్ చెడును పెరికివేయాలంటే
చిత్తుగ తడిసిన అగ్గిపుల్లతో చీకటి నెలా దహిస్తావు

(6వ సంపుట, పుట-111)

మానవుడు నిత్యం భయపడుతూ ఉంటే ప్రగతిని సాధించలేడు. పిరికితనం ప్రగతికి అడ్డుగా నిలుస్తుంది. చినుకుపడగానే భయపడే వ్యక్తి జీవితంలో ఎదురయ్యే ఆటుపోటులను భరించలేడు. "అతిసుకుమారం కటిక దరిద్రం" అంటారు పెద్దలు. నాజూకుగా ఉండే వ్యక్తి మనుగడ సాధించలేడు. కష్టానికి భయపడేవాడు కీర్తినిగాంచలేడు. తడిచిన అగ్గిపుల్లతో చీకటిని ఎలా దహించలేమో, ధృడ సంకల్పం లేనిదే చెడును కూకటి వ్రేళ్ళతో పెరికి వేయలేము" అని సి.నారాయణరెడ్డి మనిషిలో ఉండే పిరికి తనాన్ని పారదోలి, ధైర్యాన్ని సంకల్ప బలాన్ని నింపారు.

7. సంఘర్షణ

శక్తికి పదునెక్కుతుంది సంఘర్షణలోనే
అసలు నిజం తేలుతుంది అన్వేషణలోనే
శాంతంగా పడివుంటే శవమనుకుంటారోయ్
ఆర్తిరెక్క విప్పుతుంది ఆందోళనలోనే

(సినారె.స.సా. 6వ సంపుటం పుట. 113)

మానవుడి మేధాశక్తి పెరగాలంటే సంఘర్షణ జరగాలి. అన్వేషణ చేసినప్పుడు వాస్తవం బయటపడుతుంది. శాంతంగా ఉంటే సాటి మనుష్యులందరు శవమనుకుంటారు. తిరుగుబాటు చేసినప్పుడు ఆర్తి రెక్క విప్పుతుంది అని కవి మనిషిలో ఉన్న నిస్పృహని తొలగించే ప్రయత్నం చేశారు.

8. చైతన్యం

చుట్టూ వంచన పెరుగుతువుంటే చూస్తూనే ఉన్నారా
తీరం మునుగుతువుంటే రాగం తీస్తూనే ఉన్నారా
ప్రతిభా చక్రం తుప్పు పడుతుంది పరివర్తన లేకుంటే
ఎప్పటి పాత్రలనే బతుకంత నటిస్తూనే ఉన్నారా
మట్టిలోన పిసరంత విత్తనం మహావృక్షమౌతుందే
ఎదగని బెత్తెడు తోకల్లా జీవిస్తూనే ఉన్నారా *(పుట 123)*

సమాజంలో జరిగే అక్రమాలను, వంచనను, అలజడులను చూసికూడ ఏమాత్రం చలించని వ్యక్తులను చైతన్యవంతులు కమ్మని సి.నారాయణరెడ్డి తన గజళ్ళ ద్వారా సమాజానికి పిలుపునిచ్చారు. మనిషిలో పరివర్తన లేకపోతే ప్రతిభా చక్రం తుప్పు పట్టిపోతుంది. ప్రగతిని సాధించలేడు. మట్టిలో నాటిన చిన్న విత్తనం మహావృక్షంగా ఎదుగుతుంది. మనిషి ఎదగని బెత్తెడుతోకవలె మిగిలిపోవద్దన్నాడు కవి.

9. మత సామరస్యం

ఆత్మలను పలికించేదే అసలైన భాష
ఆ విలువ కరువైపోతే అది కంఠశోష
వేదం ఖురాను బైబిల్ వీధిలోన పడతాయా
మతమేదైనా ఒకటేలే ప్రతీ మనిషి శ్వాస *(పుట 47)*

సమాజంలో జరిగే మతకల్లోలాలను దృష్టిలో పెట్టుకొని సినారె రాసిన గజళ్ళు. ఏ మతమైనా శ్వాస ఒకటేనని హితవు పలికారు కవి.

10. అవినీతి–రాజకీయం

అవినీతికి పట్టం కట్టే అభ్యుదయం పూడ్చిన జాతీ
ఇకనైనా కళ్ళు నులుముకో ఇది రక్త ఘోష
నానాటికి ఏమీ పతనం నాలో ఒక తీరని మధనం
ప్రభుత్వాలు ఏమైతేనేమి పైసాపై ధ్యాస *(పుట 47)*

నేటి రాజకీయ వ్యవస్థకు ప్రతీకగా కవి ఈ గజళ్ళను రాశారని చెప్పవచ్చు. అభ్యుదయాన్ని పూడ్చిపెట్టి అవినీతికి పట్టం కట్టిన జాతిని ఇకనైనా కళ్ళు తెరవ మంటున్నాడు. ఏ ప్రభుత్వం ఏదైనా పైసా మీదే వారికి ధ్యాస. నానాటికి పతనమైపోతున్న సామాజిక వ్యవస్థను చూసి స్పందించిన కవి హృదయం.

11. సామ్యవాదం

త్యాగధనుల రక్తంతో తడిసిన ఈ యెర్రనేల
షోకైన సుఖాల ఊబిలోకి జారిపోతున్నది
సర్వాంగంగా ఎదిగిన సామ్యవాద వృక్షానికి
యుగదోషం అంటించిన తెగులు మీరిపోతున్నది
వీధి మానిసికి పీఠం వేసే చరమాంకంలో
రాత్రికి రాత్రే రాక్షస పాత్ర దూరిపోతున్నది.

(సి.నారె. 6వ సంపుటము పుట 146)

సోవియట్ రష్యా మహావృక్షాన్ని సమూలంగా పెళ్ళగిస్తున్న మాస్కోలో ప్రత్యక్ష సాక్షిగా ఉన్న నాటి కవి ప్రతిస్పందన పై గజళ్ళు

12. విశ్వకవి సమ్మేళనం

ఎక్కడివారో ఎంతటివారో ఒక్క చోట ముడిపడ్డారు
కలిమికి లేమికి గడియలు వేసే కలంపూజలోపడ్డారు
తాము జనించిన దేశాలేమా తన్నుకు చస్తూనే వున్నా
గొంతుకలన్నీ ఒకవేదికగా సంతరించి నిలబడ్డారు.
జన్మ మూలాలు వేరైనా తమ చర్మ వర్ణాలు ఏవైనా
కవిత కంటిలో మెరిసే సూర్య ముఖం లాగా కనపడ్డారు

(సినారె స.సా. 6 సంపుట పుట 148)

స్త్రూగాయుగోస్లేవియాలో జరిగిన విశ్వకవి సమ్మేళనంలో భారతదేశ ప్రతినిధిగా కవి పాల్గొన్న సమయంలో రాసిన గజళ్ళు.

సి.నారాయణరెడ్డి తన గజళ్ళలో అమ్మ ప్రేమలోని మాధుర్యాన్ని, ఆధునిక కాలంలో కనుమరుగువుతున్న గురుశిష్య సంబంధాలను గుర్తు చేస్తూ రాసిన గజళ్ళు, అదే విధంగా స్వచ్ఛమైన స్నేహం, ఎదుటివ్యక్తి ఎదుగుదలను సహించలేని అసూయతనాన్ని, దళితదృక్పథాన్ని, పిరికివారైన వ్యక్తిత్వం గురించి, మానవుడి మేధాశక్తి పెరగాలంటే సంఘర్షణ అవసరమని గజళ్ళ రూపంలో తెలియజేశారు.

సమాజంలో అక్రమాలను, వంచనను ఎదిరించే చైతన్యం మనిషిలో రావాలని, మత సామరస్యం కలిగి ఉండాలని, అవినీతి రాజకీయం, సామ్యవాదం మొదలైన అనేక అంశాలపై గజళ్ళను రాసి సమాజాన్ని ప్రగతిపథం వైపు నడిపించే ప్రయత్నం చేశారు.

ఈవిధంగా సి.నారాయణరెడ్డి గారి గజళ్ళలో ఆయనకు సమాజానికి మధ్య ఉన్న సంబంధం వ్యక్తమవుతుంది. వాస్తవ సమాజానికి అంతస్సమాజానికి మధ్య తాను నిర్మించుకున్న భావనా సమాజం. దానికి ఆలంబనగా తన దృష్టిపథం, స్మృతి పథం రెండింటిని తీసుకుని, సామాజిక ఉద్దీపనే లక్ష్యం చేసుకుని రచయిత ఈ గజళ్ళను రచించారని వెల్లడి అవుతుంది.

సి.నారాయణరెడ్డిగారు రాసిన గజళ్లలో వస్తువైవిధ్యమే గాక శబ్దగాంభీర్యం, అర్థగాంభీర్యం, వీరం, హాస్యం, శృంగారం, వ్యంగ్యం, శబ్ద సౌందర్యం, అంత్యప్రాస మొదలైన అంశాలన్నీ ఉన్నాయి.

ఉపయుక్త గ్రంథాలు:

1. ఆరుద్ర. 2007. సమగ్రతాంధ్ర సాహిత్య చరిత్ర. తెలుగు అకాడమి, హైదరాబాద్.
2. వేంకటావధాని, దివాకర్ల. 2008. సాహిత్య సోపానము. ఆంధ్ర సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్, హైదరాబాద్.
3. నారాయణరెడ్డి, సి. 2000. సమగ్ర సాహిత్యం, విశ్వంభరా విజన్ పబ్లికేషన్స్, హైదరాబాద్.
4. నారాయణరెడ్డి, సి. 2007. ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయము ప్రయోగములు. విశాలాంధ్ర పబ్లికేషన్స్, హైదరాబాదు.
5. సంపత్కుమాచార్యా, కోవెల. 1999. తెలుగు ఛందస్సుపై కొన్ని వెలుగులు. అభినవ ప్రచురణలు, వరంగల్లు.

(ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం - తెలుగు & ప్రాచ్య భాషా విభాగం జాతీయ సదస్సు 26, 27 ఫిబ్రవరి 2018, అంశం జ్ఞానపీఠ అవార్డు గ్రహీత సినారె సాహిత్యం)

□ □ □

తెలంగాణ కథలు - దళిత స్త్రీ జీవన చిత్రణ

ఉపోద్ఘాతం

కాలువ మల్లయ్య, సదానంద్ శారద, చంద్ర సంపాదకత్వంలో 'తెలంగాణ కథలు' అనే సంకలనం 2005లో తొలి ముద్రణ, 2012లో మలి ముద్రణ వెలువడింది. ఈ గ్రంథంలో తెలంగాణ ప్రాంతపు తొమ్మిది దశాబ్దాల సాంస్కృతిక, సామాజిక, పోరాట రూపురేఖలు చిత్రీకరించబడినట్లు వ్యక్తమవుతుంది. దీనిలో అనేకమంది రచయితల రాసిన 90 కథలు ఉన్నాయి. మాడపాటి హనుమంతురావు, సురవరం ప్రతాపరెడ్డి, కాళోజీ నారాయణరావు, గూడూరు సీతారాం, ఇల్లిందల సరస్వతీ, నవీన్, జ్వాలాముఖి కాలువ మల్లయ్య, పెద్దింటి అశోక్‌కుమార్ మొదలైనవారు రాసిన కథలు ఈ గ్రంథంలో కలవు. ఈ వ్యాసంలో నల్లాల లక్ష్మీ రాజ్యం రాసిన 'మా వూరి ముచ్చట్లు' గూడూరి సీతారాం రాసిన "లచ్చి" పసుపులేటి మల్లిఖార్జునరావు రాసిన "గిర్నీబాయి" కాలువ మల్లయ్య రాసిన "ఊరుమ్మడి బతుకు" అనే కథలను విశ్లేషించడం జరిగింది. సమాజంలో పురుషాధిక్య భావజాలానికి గురైన దళిత స్త్రీల జీవనం ఈ వ్యాసంలో పరిశీలించబడింది.

దళిత స్త్రీల జీవితాలు మరింత విసిరివేయబడి, అటు ఇటు చిమ్మబడి, మరింత ఖండింపబడ్డాయి. దళితులు సమాజంలో వివక్షకి గురి అయితే, దళిత స్త్రీలు సమాజంలోను, కుటుంబంలోనూ కూడా వివక్షకు గురయ్యారు. ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో దళిత స్త్రీలు నిరక్షరాస్యతవల్ల, బీదరికలవల్ల ధనిక వర్గాల దోపిడీకి బలయ్యారు. కులపరంగా వివక్షకు గురయ్యారు. అటు సమాజంలో ఇటు కుటుంబంలోనూ పురుషాధిక్య భావజాలానికి బలై తమఉనికిని కోల్పోయారు. నివసించడానికి ఇల్లు లేక, కట్టుకోడానికి బట్టలు లేక, తినడానికి తిండిలేక కటిక దరిద్రాన్ని అనుభవించారని 'తెలంగాణ కథల' పరిశీలన వల్ల వ్యక్తమవుతుంది.

కాలువ మల్లయ్య, సదానంద్ శారద, చంద్ర సంపాదకత్వంలో వెలువడిన 'తెలంగాణ కథలు' అనే కథా సంకలనంలోని కొన్ని కథలను పరిశీలన చేస్తే ఈ కింది విషయాలు తెలుస్తున్నాయి.

మావూరి ముచ్చట్లు

ఈ కథను నల్లాల లక్ష్మీరాజం 2002లో రాశారు. ఈ కథలో శాంతమ్మ భర్త నర్సయ్య. శంకరి ఆమె కుమారుడు. నర్సయ్య ఇంట్లోలేనప్పుడు చుక్కారెడ్డి, శాంతమ్మ వద్దకు వస్తు పోతు ఉంటాడు. ఆమెతో అక్రమసంబంధం పెట్టుకుంటాడు. ఈ కారణంగా నర్సయ్య కుటుంబాన్ని ఆ ఊరివాళ్ళు వెలివేస్తారు. అప్పటి నుండి చుక్కారెడ్డి శాంతమ్మ దగ్గరకు యదేచ్ఛగా వస్తుంటాడు. ఆ ఊరికి దళిత స్త్రీని సర్పంచి ఎన్నుకోవలసి వస్తుంది. ఆ ఊరి మాలమాదిగల్లో లచ్చుమక్క అనే స్త్రీ కొంత అక్షరాస్యత కలిగినది. వారు లచ్చుమక్కను సర్పంచిగా నిలబెట్టా లనుకుంటారు. శాంతమ్మ అయితే తాను చెప్పినట్టు వింటుందని చుక్కారెడ్డి భావిస్తాడు. ఆమెను సర్పంచిని చేసి అధికారాన్ని తన చేతిలోకి తీసుకుంటాడు. చుక్కారెడ్డి కూతురు రజిత, శాంతమ్మ కొడుకు శంకరి ఇద్దరు ప్రేమించుకుంటారు. కొంతకాలం తరువాత వారు ఊరు విడిచి వెళ్ళిపోతారు. ఆ సంగతి తెలిసిన చుక్కారెడ్డి శాంతమ్మను శారీరకంగా హింసిస్తాడు. శంకరి, రజిత చట్టబద్దంగా వివాహం చేసుకుంటారు. *(తెలంగాణ కథలు పుట-707)*

ఈ కథలో చుక్కారెడ్డి తన కూతురు దళితుణ్ణి వివాహం చేసుకోడం వల్ల కులం పరువు పోయిందని బాధపడతాడు. వివాహిత అయిన శాంతమ్మతో అక్రమ సంబంధం పెట్టుకున్నప్పుడు అతనికి శాంతమ్మ కుటుంబ పరువు గుర్తుకు రాలేదు. ఎందుకంటే ఆమె దళిత స్త్రీ కావడం వల్ల దళితులకు పరువు, ప్రతిష్టలు ఉండవనే భావన చుక్కారెడ్డికి కలిగి ఉండవచ్చు. శంకరి, రజితలు చట్టబద్దంగా వివాహం చేసుకున్నప్పటికి చుక్కారెడ్డి కులం పురువు పోయినట్లుగా భావిస్తాడు. పై కథలో దళిత స్త్రీ శీలం కంటే తన కులమే గొప్పదని అగ్రవర్ణ పురుషుడు భావిస్తాడు. రజిత, శంకరిని వివాహం చేసుకున్నదని తెలిసి శాంతమ్మను హింసిస్తాడు. తెలంగాణ ప్రాంతంలో దళిత స్త్రీలు ధనవంతుల దౌష్ట్యానికి బలవుతున్నట్లు ఈ కథ ద్వారా వ్యక్తమవుతుంది. ఈ కథలో చుక్కారెడ్డి, శాంతమ్మ శీలాన్ని దోచుకొని ఆమె కుటుంబ పరువు ప్రతిష్టలను మంటగలుపుతాడు. ఆమెను సర్పంచిగా నియమించి, అధికారాన్ని తన చేతిలోకి తీసుకొని దళితస్త్రీ హక్కుని కాలరాస్తాడు. చివరకు

అతని కూతురుని, శాంతమ్మ కొడుకును వివాహం చేసుకొన్నప్పుడు ఆమెను శారీరకంగా హింసిస్తాడు. ఈ విధంగా సమాజంలో ధనికవర్గానికి చెందిన పురుషులు దళిత స్త్రీ మాన, ప్రాణాలను దోచుకుంటున్నారు. సమాజంలోని ధనిక పురుషాధిక్యానికి దళిత స్త్రీలు బలవుతున్నారు.

లచ్చి

లచ్చి కథ రచయిత గూడూరి సీతారం రచన 1957లో జరిగింది. ఈ కథలో భిక్షాటన చేస్తూ జీవించే స్త్రీ జీవితం ఏవిధంగా ఉంటుందో తెలుస్తుంది. రంగడు అనే వ్యక్తికి లచ్చి అనే స్త్రీతో వివాహమవుతుంది. పెద్దలు వారిరువురిని వేరు కాపురం పెట్టిస్తారు. ఆ రోజు నుండి వారు బిచ్చమెత్తుకుని జీవించాలి. లచ్చి, రంగడు ఎంతో అన్యోన్యంగా జీవిస్తుంటారు. అటువంటి సమయంలో పోలీసులు వచ్చి రంగణ్ణి అరెస్ట్ చేస్తారు. లచ్చి నిశ్చేష్టురాలై ఉండిపోతుంది. రాత్రింబవళ్ళు నిద్రాహారాలు మాని భర్త కోసం దుఃఖిస్తుంది. తల్లిదండ్రుల దగ్గరకు వెళదామన్నా వారు ఎక్కడ ఉన్నారో తెలియక ఒంటరిగానే నిస్సహాయ స్థితిలో ఉంటుంది. రంగడు నిరపరాధి అని తెలిసి పోలీసులు అతణ్ణి విడిచిపెడతారు. తిరిగి వచ్చిన భర్తను చూసి లచ్చి ఎంతో సంతోషిస్తుంది. వారిరువురు ఊరు వదిలి పట్టణానికి వెళతారు. వారిరువురు భిక్షాటన చేస్తూ హాయిగా జీవిస్తుంటారు. కొంతకాలానికి రంగడు రిక్షా కొంటాడు. అతని రిక్షాకి లైటు లేదని పోలీసులు అతని సంపాదనలో కొంత దోచుకుంటారు. నెమ్మదిగా రంగడు మద్యపానానికి బానిసవుతాడు. అప్పుల వాళ్ళు ఇంటికి వచ్చి లచ్చిని బెదిరిస్తుంటారు. ఒక రోజు ఒక వ్యక్తి అప్పు అడగడానికి వస్తాడు. అదే సమయానికి రంగడు ఇంటికి వస్తాడు. అప్పుడతడు తాగిఉంటాడు. భార్యను అనుమానించి, హింసించి రిక్షా తీసుకొని ఇంటి నుండి వెళ్ళిపోతాడు. అతని రిక్షాను ఒక కారు గుద్దుతుంది. రంగడు ఆస్పత్రిలో ఉంటాడు. ఆ విషయం తెలిసి లచ్చి ఆస్పత్రికి వస్తుంది. రంగడు తన తప్పు తెలుసుకుంటాడు. ఇలా కథ ముగుస్తుంది. *(తెలంగాణ కథలు పుట-117)*

పై కథలో స్త్రీ, పురుషాధిక్య భావజాలానికి గురైందని చెప్పవచ్చు. పోలీసులు సరైన అవగాహనలేక నిరపరాధి అయిన తన భర్తను అరెస్టు చేసినప్పుడు ఒంటరిగా దుఃఖిస్తుంది. ఆ ఊరు వదిలి పట్టణానికి వెళ్ళి కొత్త జీవితాన్ని ప్రారంభిస్తుంది. అక్కడ ఆమె భర్త మద్యపానానికి బానిసవుతాడు. ఆమె చేయని తప్పుకి నిందను కూడా భరిస్తుంది. భర్త తన తప్పు తెలుసుకున్న తరువాత అతనితో కలిసి జీవించడానికి సిద్ధపడుతుంది.

ఈ కథలో దళిత స్త్రీ సమాజంలోను, కుటుంబంలోనూ వివక్షకు గురైంది. అయినప్పటికి భర్తతో కలిసి ఉండాలనే నిర్ణయించుకుంటుంది. కుటుంబానికే ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చింది. భర్తతోపాటు సమానంగా భిక్షాటనచేసి సంపాదిస్తుంది. భర్త దురలవాట్లకు బానిసైనపుడు ఆమె తన సంపాదనలోనే భర్తను పోషిస్తుంది. అతనితో అనుమానింపబడి, అపనింద మోస్తుంది. చివరకు తన సంసారాన్ని నిలబెట్టుకుంటుంది. ఆమె కోరుకుంటే ఒంటరిగా జీవించగలదు. అయినా కూడా ఆమె ఆ విధంగా చేయలేదు. ఇక్కడ స్త్రీ ఔన్నత్యం, ఆత్మస్థైర్యం వెల్లడి అవుతున్నాయి. ఎప్పటికైనా భర్త మారతాడనే నమ్మకంతో జీవించింది. ఆ నమ్మకమే ఆమె సంసారాన్ని నిలబెట్టింది. ఈ కథలో స్త్రీ ఔన్నత్యం, సహనం, సౌశీల్యం ముందు పురుషుడు తలవంచక తప్పలేదు. పురుషాధిక్య సమాజంలో స్త్రీ తన ఔన్నత్యాన్ని సౌశీల్యాన్ని చాటుకుంది. ఒక దళిత స్త్రీ తనని తను నిరూపించుకుంది.

గిర్నిబాయి

గిర్నిబాయి కథను పుసుపులేటి మల్లిఖార్జునరావు రాశారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని దళిత స్త్రీ జీవితం ఈ కథలో ప్రస్ఫుటమవుతుంది. ఆరో నిజాం నవాబు మీర్ మహబూబ్ ఆలీఖన్ బాద్‌షా వల్ల మహబూబ్‌నగర్‌కి ఆ పేరు వచ్చింది. నారాయణపేట, గద్వాల జలతారు చీరలు, మఖ్తల్, నాగర్ కర్నూలు కంబళ్ళు మొదలైన వాటికి ఈ జిల్లా ఎంత ప్రసిద్ధి చెందిందో, దరిద్రానికి కూడా ఈ జిల్లా అంతే పేరు సంపాదించింది. అందుకు నిలువెత్తు నిదర్శనం అచ్చవ్వ జీవితం. యెంగొండ అనే ఊరిలో అచ్చవ్వ, ఆమె భర్త రంగు రంగుల చాపలను తయారు చేసేవారు. శివరాత్రికి ముందు వచ్చే మన్నెంకొండ, సిరంగాపురం జాతర్లలో ఈ చాపలు ప్రజలను ఎక్కువగా ఆకర్షిస్తాయి. శ్రీశైలం, బొంబాయి, బరోడా మొదలైన ప్రాంతాల నుండి వచ్చే యాత్రికులు ఈ చాపలను తీసికెళతారని అచ్చవ్వ భర్త చెబుతుండేవాడు. ప్రభుత్వం డిపోలను ఏర్పాటు చేసి ప్రజలు తయారుచేసిన వస్తువులను అమ్మించే ప్రయత్నం చేసింది. కాని ఈ విధానం ద్వారా వచ్చే ఆదాయం అంతంత మాత్రమే అయ్యింది. కొంతకాలానికి అచ్చవ్వ భర్త చనిపోతాడు. ఆమెకు సంతానం లేకపోవడం వల్ల ఆమె నివసించే ఇంటిని కూడా అప్పుల వాళ్ళు ఆక్రమిస్తారు. ఆమె పొట్ట చేతబట్టుకొని పట్టణానికి వెళుతుంది. కొత్త మనిషి కావడం వల్ల పని కూడా దొరకదు. నలభై ఏళ్ళకే అరవై ఏళ్ళు పైబడిన ముదుసలిలా కనబడుతుంది. అడుక్కు తినడానికి ప్రాణం ఒప్పలేదు. కాని తప్పని పరిస్థితి ఎండిపోయిన రొట్టె ముక్కలు, పెళ్ళి ఇంటి ముందు బలవంతంగా లాక్కోగా మిగిలిన

ఎంగిలి మెతుకులు, పళ్ళ కొట్టు ముందు పారేసిన కుళ్ళిపోయిన అరటి పళ్ళు ఆమె ఆహారం. కడుపునిండా అన్నం తిని వారం రోజులవుతుంది. అటువంటి పరిస్థితిలో రోడ్డు పక్కన మురుక్కాలువ ఒడ్డున రెండు వేపచెట్లు కనబడతాయి. అప్పుడామె ఆ చెట్ల నీడకి చేరుతుంది. ఆ చెట్లకు ఎదురుగా కాలువ అవతల పక్కన ఒక పిండి గిర్ని కనబడుతుంది. ఆమె గిర్ని దగ్గరకు వెళ్ళి అక్కడ పని చేసే కుర్రవాణ్ణి తాగడానికి నీళ్ళివ్వమని అడుగుతుంది. ఆ కుర్రవాడు నిరాకరిస్తాడు. ఆమె ఆ సాయంత్రం వరకు అక్కడే ఉంటుంది. ఆ కుర్రవాడికి ఆమె మీద జాలి వేస్తుంది. గిర్నితుడవగా వచ్చిన పిండి నీటితో పాటు ఒక పావలా కూడా ఆమెకు ఇస్తాడు. ఆ పావలాకు ఆమెకు ఒక అరకప్పు టీ కూడా ఇవ్వరు. చివరకు ఆమె ఆకలికి తట్టుకోలేక పిండిలో నీళ్ళు కలుపుకుని తాగుతుంది. దాని వల్ల ఆమెకు వాంతులు అవుతాయి. ఆ బాధకు తట్టుకోలేక మరణిస్తుంది. ఆమె శవాన్ని మున్సిపాలిటి బండిలో తరలిస్తారు.

(తెలంగాణ కథలు పుట-422)

ఈ కథ ద్వారా మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రజల జీవనశైలి వ్యక్తమవుతుంది. దళిత స్త్రీలు ఆకలిబాధ తట్టుకోలేక ఎటువంటి దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారో తెలుస్తుంది. ఈ ప్రాంతంలో ప్రజలకు చేసే పని తిండి పెట్టక, సమాజంలో ఆదరించే వాళ్ళులేక పట్టణాలకు ఒంటరిగా వెళ్ళిన స్త్రీలు దిక్కుతోచని స్థితిలో అనాథశవాలుగా మారుతున్నారనడానికి ఈ కథ ఒకఉదాహరణ. సమాజంలో అనాథలైన స్త్రీలకు పట్టెడన్నం దొరకకపోవడం గమనార్హం. సమాజంలో తోటి మనిషిని ఆదరించక పోవడం ఈ కథ ద్వారా కనబడుతుంది.

ఊరుమ్మడి బతుకు

ఈ కథను 1996లో కాలువ మల్లయ్య రాశారు. ఈ కథలో కల్లు అమ్మే స్త్రీ జీవితం చిత్రించబడింది. నర్సయ్య కుటుంబం తరతరాల నుండి కల్లు అమ్ముకుని బతుకుతుంది. నర్సయ్య కొడుకు బాలగౌడ్, కోడలు సరోజ. నర్సయ్య కల్లు అమ్ముతాడు గాని కల్లు తాగడు. ఏదో బలహీనత ఉన్నవాడే కల్లు తాగుతాడని నర్సయ్య నమ్ముతాడు. నర్సయ్య కోడలు సరోజ కల్లు అమ్ముతుంది. ఆమె కల్లు వంచే సమయంలో చీరకొంగు జారిపోతుంటుంది. కల్లు తాగడానికి వచ్చిన పురుషులు ఆమె వంక దొంగ చూపులు చూస్తారు. వారిలో ముకుందం అనే వ్యక్తి "సిలుకు చీర కట్టకుంటే నూలు చీర కట్టుకోకపోయినావే పిల్ల" అంటాడు. అప్పుడు

సరోజ అతని వైపు కోపంగా చూస్తుంది. 'నా చీర గురించి మీకెందుకు మీరేంపనికి వచ్చారో ఆ పని చేసుకుపొమ్మని' అంటుంది. 'పని చేసే వాళ్ళు మంచి చీరలు కట్టకూడదా' అని అతణ్ణి నిలదీస్తుంది. "పరాసికాని కన్నందుకు బాగకోపానికి రావడ్డవేంది పిల్ల?! "కల్లు బోసే పిల్లతోగాకుంటే ఎవ్వలతోని పరాశికమాడ్తరిగ" అంటాడు ముకుందం. "గాపరాశికాలు నా దగ్గర నడవయ్, కుమ్మరోల్లు కుండలమ్మ కుంట బతుకుతుండ్రు, కాపోల్లు పంటమ్ముకుంట బతుకుతుండ్రు, సాలోల్లు బట్టలమ్మ కుంట బతుకుతుండ్రు మేం కల్లమ్ముకుంట బతుకుతున్నం కాని ఒళ్ళమ్ముకుంట బతుకతలే" అంది సరోజ. ఆమె వంక గర్వంగా చూస్తాడు ముకుందం. అతడు కుమ్మరి కులానికి చెందినవాడు. అతని భార్యను దొరల కుటుంబాల వాళ్ళు ఇదే విధంగా అవమాన పరచడం నర్సయ్యకు తెలుసు.

ఆడవాళ్ళను కల్లువంచే దగ్గరుంచడం చాలాకాలం నుంచి ఉందని, ఆడవాళ్ళు కల్లువంచుతుంటే తామెంత తాగుతున్నదీ పురుషులు మరచిపోతారని రచయిత రాశారు. అంతేగాక ధనిక కుటుంబాలకు చెందిన పురుషులు కల్లువంచే స్త్రీతో పరాచికాలాడతారు. కొన్నిసార్లు కల్లువంచే స్త్రీలను దొరలు, పటేళ్ళు లొంగ దీసుకొని అనుభవిస్తారని ఆ వాసన నేటికి సమాజంలో ఉందని రచయిత రాశారు.

"పేదోడికి మంచి పెళ్ళాముండద్దంటారా! మీ భార్యలతో పరాశికాలాడితే ఊరుకొంటారా" అని దొరలను నర్సయ్య ప్రశ్నిస్తాడు. తెలంగాణ ప్రాంతంలో జరిగిన ఉద్యమాలు, పోరాటాల వల్ల సమాజంలో ఈ మార్పు వచ్చిందని రచయిత రాశారు.

ఈ కథలో బాలగౌడ్ చిన్నతనం నుంచి తన తాతమ్మతో దొరలు పరాశికా లాడడం అతని తల్లి కల్లు వంచుతుంటే దొరలు ప్రవర్తించిన తీరు చూశాడు. 'ఆడోల్లను కల్లువంచడానికి పెట్టుకుంటేంది' అని తండ్రితో అంటాడు. అప్పుడు నర్సయ్య బట్టలుతికే చాకలి వాళ్ళని, వెట్టి చేసే హరిజన స్త్రీలతోను, కల్లు అమ్మే స్త్రీలతోను దొరలు పరాచికాలాడతారు. కొంతమంది స్త్రీలు వారి చేతిలో మానాలను పోగొట్టుకుంటున్నారని చెబుతాడు. దొరల భార్యలు ఇంటి నుండి బయటకు రారు. అదే విధంగా మన ఆడోల్లు ఇంట్లోనే ఉంటే వారికి ఇల్లు గడవడం కష్టమంటాడు. అంతేగాక పురుషులు కల్లుగీకటానికి, వ్యవసాయం పనులకు వెళతారు. ఆ సమయంలో స్త్రీలు కల్లుమండువా దగ్గర కొచ్చిన వారికి కల్లు వంచక తప్పదు. ఈవిధంగా చేయడం వల్ల కల్లు తాగడానికి వచ్చిన వారు ఎక్కువ తాగుతారు. వారి వ్యాపారం కూడా పెరుగుతుంది.

ఈ కథలో కల్లు అమ్మే కుటుంబాల స్వార్థం కూడా ఉంది. తెలంగాణ ప్రాంతంలో ప్రజలు ఎంత ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారో ఈ కథవల్ల తెలుస్తుంది. ఇక్కడ దళిత స్త్రీలు కుటుంబపోషణ కోసం తమ శీలాన్ని కూడా పణంగా పెడుతున్నారని తెలుస్తుంది. ధనవంతులైన పురుషులు ఆధిపత్యానికి దళిత స్త్రీలు బలవుతున్నారు. ఈ కథలో స్త్రీ 'కల్లు అమ్మే స్త్రీ సిలుకు చీర కట్టుకోకూడదా?' అని పురుషుణ్ణి ప్రశ్నిస్తుంది. తనతో పరాచికాలాడిన సమాజంలోని ధనికవర్గంలో పురుషాధిక్యాన్ని ప్రశ్నించి, దళిత స్త్రీలను కించపరిచి, వారి శీలాన్ని తృణప్రాయంగా భావించే పురుషులకు గొడ్డలి పెట్టుగా ఈ స్త్రీ నిలుస్తుంది. అన్యాయాన్ని ఎదిరించి, సమాజం నుండి తనని తాను కాపాడుకోగల సామర్థ్యం ఉన్న స్త్రీ ఈ కథలో మనకు కనబడుతుంది.

ముగింపు

తెలంగాణ ప్రాంతంలో ధనికవర్గాలకు చెందిన పురుషులచేతిలో తమ శీలాన్ని కోల్పోయిన శాంతమ్మ లాంటి దళిత స్త్రీలున్నారు. సమాజంలో దళిత స్త్రీలు ఏ విధమైన వివక్ష గురవుతున్నారో 'మా ఊరి ముచ్చట్లు' కథ ద్వారా వెల్లడి అవుతుంది. 'లచ్చి' కథలో భిక్షాటన చేసే కుటుంబాల జీవనశైలి వ్యక్తమవుతుంది. సమాజంలో బిచ్చమెత్తుకునే దళిత స్త్రీ తన సౌశీల్యంతో తన భర్తను మార్చుకుని, సంసారాన్ని ఏవిధంగా నిలబెట్టుకుందో తెలుస్తుంది. దళిత స్త్రీ కుటుంబాన్ని పోషించడానికి పురుషుడికి ఏమాత్రం తీసిపోదని, చివరకు అతణ్ణి సన్మార్గంలో నడిపించడానికి చేసే ప్రయత్నంలో కష్టాలను, అపనిందలను కూడా సహించి నిలవగలదని ఈ కథ ద్వారా ప్రస్ఫుటమవుతుంది. 'గిర్నిబాయి' కథలో మహబూబ్‌నగర్ జిల్లాలో పేదరికం ఏ విధంగా తాండవమాడుతుందో వ్యక్తమవుతుంది. ఆ జిల్లాలో స్త్రీకి ఆమె చేసే పనివల్ల జీవనోపాధి కలుగకపోవడం ఈ కథలో సారాంశం. చివరకు ఆమె అనాథశవంగా మారుతుంది. మరొక కథ 'ఊరుమ్మడి బతుకు' కథలో కల్లు అమ్మే స్త్రీ జీవితం చిత్రీకరించబడింది. ఆమెతో పరాచికాలాడడానికి ప్రయత్నించిన పురుషులను ఎదిరిస్తుంది. ఆమెకు తన వృత్తి పట్ల గల గౌరవాన్ని వ్యక్తపరుస్తుంది. ఈ కథలో స్త్రీ తన పని తాను చేసుకుంటు, కుటుంబానికి అండగా నిలుస్తూ, ఆత్మ స్థైర్యంతో జీవిస్తుంది.

ఈ విధంగా తెలంగాణ ప్రాంతంలో దళిత స్త్రీలు సమాజంలో (పురుషాధిక్య భావజాలం గల) పురుషుల నుండి ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకుంటు

జీవనం సాగించడం కథల ద్వారా తెలుస్తోంది. ఆధునిక సమాజంలో స్త్రీలు ఎంత అభివృద్ధిని సాధించినప్పటికి వివక్షకు గురవుతూనే ఉన్నారు. ముఖ్యంగా దళిత స్త్రీలు తాము పనిచేసే కార్యాలయాలలో కూడా పురుషాధిక్య భావజాలానికి గురవుతూనే ఉన్నారు.

ఉపయుక్త గ్రంథాలు

1. తెలంగాణ కథలు, సంకలనం, సంపాదకులు కాలువ మల్లయ్య సదానంద్ శారద, చంద్ర వి.పి.హెచ్. 2012

2. తెలుగు కథ విభిన్న ధోరణులు. మల్లయ్య కాలువ, హైదరాబాదు. తెలుగు అకాడమి, 2012.

3. దళిత సాహిత్య సౌందర్య తత్త్వం. కొలకలూరి మధుజ్యోతి, హైదరాబాదు. తెలుగు అకాడమి, 2010.

(భావవీణ మాసపత్రిక [illegible])

□ □ □

తెలంగాణ కథలు - సామాజిక జీవన చిత్రణ

"తెలంగాణ కథలు" అనే కథా సంకలనాన్ని కాలువ మల్లయ్య, సదానంద్ శారద, చంద్ర 2005లో తొలి, 2012లో మలి ముద్రణలు గావించారు. తొమ్మిది దశాబ్ధాలుగా రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన అంశాలను రచయితలు తమ కథలలో పొందుపరిచారు. ఈ గ్రంథంలో 90 కథలున్నాయి. వానిలో కవుటూరు వెంకటనారాయణరావు రచించిన "చెప్పులు" కాళోజీ నారాయణరావు రచించిన "మనమేనయం" గోపీ భాగ్యలక్ష్మి రాసిన "జంగుభాయి" నవీన్ రాసిన "చెర" కథ, జాతశ్రీ రాసిన 'అంతర్ముఖం' అనే కథలలోని సామాజింకాశాలు ఈ వ్యాసంలో పరిశీలించాను.

ఉపోద్ఘాతం

సమాజం, సాహిత్యం రెండూ విడదీయరానివి. సాహిత్యం సమాజానికి ప్రతి బింబంవంటిది. సాహిత్యంలో వెలువడిన వివిధ ప్రక్రియలను పరిశీలించినట్లైతే, సమాజంలో మానవ జీవనపరిణామం, సంస్కృతి, సంప్రదాయాలు, భాష మొదలైన విషయాలు వెల్లడి అవుతాయి.

ఎఫ్. హెచ్. గిడ్డింగ్స్ (ఈ.లూ.లుజజుటిఖ) సమాజం గురించి ఈ కిందివిధంగా నిర్వచించారు. "సాముదాయికమైన ప్రయోజనాల కోసం, అభిప్రాయ సామరస్య మున్న వ్యక్తులు ఒకరినొకరు గుర్తించి కలసిమెలసి పనిచేయడానికి ఏర్పడిన గుంపును సమాజమంటారు. *(కృష్ణకుమారి, నాయని, 2000)* ఈ విధంగా ఏర్పడిన సమాజంలోని ప్రజలు ఇచ్చిపుచ్చుకునే లక్షణం కలిగి ఉంటారు. వీరు ఒకరకమైన వ్యవస్థను స్థాపించడానికి కట్టుబాటు కలిగి ఉంటారు. వ్యక్తిగత ధర్మాన్ని కలిగి ఉంటారు. అనగా విభిన్నమైన విధులను నిర్వహించే వ్యక్తులుంటారు. వారందరు వ్యక్తిగత ధర్మాలను పాటిస్తు, పరస్పరం సహకరించుకుంటూ వ్యవస్థలో జీవిస్తారు.

ఒక్కొక్క సమాజానికి ఒక్కొక్క సంస్కృతి ఉంటుంది. ప్రజల ఆచారవ్యవహారాలు, భాష, విద్య, కళలు, మొదలైనవి సంస్కృతిలో భాగం. వీరి మధ్య భౌగోళిక, ఆర్థిక, రాజకీయ, మత విషయాలలో వైవిధ్యముంటుంది. ఈ వైవిధ్యం ఒక్కొక్కప్పుడు సమాజంలోని ప్రజల మధ్య పరస్పర అవగాహనకు ప్రతిబంధకంగా నిలుస్తుంది. పై విషయాలన్ని సాహిత్యంలో ప్రస్ఫుటమవుతాయి. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ కథలను పరిశీలించడం జరిగింది.

చెప్పులు కథ

"ఒక పంతులుగారు వీధిబడిలో చదువు చెబుతుంటాడు. ఆయన రమణకు భోజనం పెట్టి చదువు చెబుతుంటాడు. అందుకు రంగయ్య పంతులు గారి పట్ల కృతజ్ఞత కలిగి ఉంటాడు. ఒకరోజు రమణ పంతులుగారి పాత చెప్పులు తెచ్చి, తన తండ్రికిచ్చి వాటిని బాగు చేసి ఇవ్వమని చెబుతాడు. ఆ చెప్పులు బాగు చేయడం కంటే కొత్త చెప్పులు కుట్టడం సులభమని రంగయ్య భావిస్తాడు. అతను ఆ పాత చెప్పులను బాగుచేసి పంతులుగారికి ఇవ్వడమే కాకుండా, కొత్త చెప్పులను కుట్టి, ఆయనకు ఇవ్వాలని నిర్ణయించుకుంటాడు. రంగయ్య చెప్పులు కుట్టగా వచ్చిన రెండు వందల రూపాయలను పంతులుగారికి ఇచ్చి, ఆ ధనాన్ని తన కుమారుడయిన రమణ చదువుకి ఉపయోగించమని చెప్పి, బడిలో చదువుకుంటున్న రమణను చూసి, ఎంతో సంతోషించి ఇంటికి వస్తాడు. రంగయ్య అనుకున్న విధంగా పంతులు గారికి కొత్త చెప్పులు తయారు చేసి ఇంటిలో ఉంచి, రోడ్డు ప్రక్కన గంగ అనే స్త్రీ వచ్చిన వారికి భోజనం పెడుతూ వచ్చిన ధనంతో జీవనం సాగిస్తుంటుంది. రంగయ్య ఆమె వద్దకు వెళ్ళి భోజనం చేసి అక్కడే ఉన్న గంగరావి చెట్టుకింద నిద్రపోతాడు ఒక వ్యక్తి వచ్చి రంగయ్యను తట్టిలేపి గుడిసెలకు నిప్పంటుకుందని అవి కాలిపోతున్నాయని చెబుతాడు. రంగయ్య పరుగులాంటి నడకతో రొప్పుతూ ఇంటికి వస్తాడు. అప్పటికే ఇంటిపై కప్పే కాలిపోతుంది. రంగయ్య మనసు అటక మీద ఉన్న చెప్పుల మీదే ఉంటుంది. అవి కాలిపోవడం కంటే తను కాలిపోవడమే మంచిదని భావిస్తాడు.

రంగయ్యలో ఏదో ఆవేశం వస్తుంది. అతడు తన శరీరంలోని శక్తినంతా కూడగట్టుకొని, తలుపు తన్ని ఇంటిలోకి ప్రవేశిస్తాడు. ఆ తరువాత ఎంతకీ రంగయ్య బయటకు రాలేదు. ఫైరింజను వచ్చి, నీళ్ళు కొట్టడం ప్రారంభిస్తుంది. నలుగురు వ్యక్తులు లోపలికి వెళ్ళి, అక్కడ కనిపించిన దృశ్యంచూసి భయకంపితులవుతారు.

రంగయ్య బోర్లాపడి ఉంటాడు. అతని శరీర పైభాగం పూర్తిగా కాలిపోయి, చర్మం కుతకుతలాడుతుంటుంది. అందరూ అక్కడకు వస్తారు. నలుగురు వ్యక్తులు మెల్లగా రంగయ్యను లేవదీస్తారు. పంతులుగారి చెప్పులు మాత్రం రంగయ్య పొట్టలో దాగి ఉంటాయి. రంగయ్య ప్రాణాలు పోవడం, ఆ చెప్పులు తప్ప ఎవరు చూడలేదు. *(తెలంగాణ కథలు. 2005.పుట: 161)*

చెప్పులు కథ – సామాజిక జీవన చిత్రణ

ఈ కథలో 1967 నాటి సామాజిక జీవన చిత్రణ కనబడుతుంది. కాబట్టి ఆనాటి సామాజిక జీవన విధానం, మానవసంబంధాలు, వస్తువిజ్ఞానం, ఆహారపు అలవాట్లు, విద్యావిధానం, ముఖ్యంగా పేదవారి జీవన విధానం మొదలైన విషయాలు వెల్లడి అవుతున్నాయి.

ఈ కథలో కథానాయకుడు రంగయ్య. అతని ఒక్కాగానొక్కకొడుకు రమణను పంతులుగారు చేరదీసి, భోజనంపెట్టి, చదువు చెబుతుంటాడు. అందుకు రంగయ్య ఎంతో సంతోషిస్తాడు. ఆ ఊరిలోని అందరి పిల్లలవలె కాకుండ, రమణ చదుకుంటు న్నందుకు, రంగయ్య ఆనందానికి అవధులుండవు. రమణకు ఆ అదృష్టాన్ని పట్టించిన పంతులుగారంటే రంగయ్యకు తన ప్రాణమిచ్చేంత అభిమానం. పంతులుగారు కూడా రమణను తన సొంత కొడుకులా చూసుకుంటాడు. ఆ విషయాన్ని రంగయ్య రమణను చూడడానికి బడికి వెళ్ళినపుడు 'రమణ నీకొడుకు కాదు నాకొడుకు' అంటాడు. ఆ రోజులలో ఉపాధ్యాయులు, విద్యార్థులపట్ల అంత ఆదరణ, అభిమానం చూపేవారని వ్యక్తమవుతుంది. అంతేగాక ఆనాటి సమాజంలో దళితులను ఆదరించే పంతులుగారివంటి వ్యక్తులున్నారని తెలుస్తుంది. వారి కోసం తమ ప్రాణాలను సైతం అర్పించే రంగయ్యలాంటి వారు కూడా ఉంటారని వెల్లడి అవుతుంది.

ఈ కథలో రంగయ్యకు తన ఇల్లు కాలిపోతున్న సమయంలో కొడుకు గుర్తుకు రాలేదు. పంతులుగారి చెప్పులే గుర్తుకొస్తాయి. బహుశా పంతులుగారు తన కొడుకుని ఏ లోటు లేకుండా చూసుకుంటారన్న నమ్మకం కావచ్చు. సమాజంలో వ్యక్తులు తాము నమ్మినవారి కోసం ప్రాణాలను కూడా అర్పిస్తారని తెలుస్తుంది. రంగయ్య రెండు వందల నాలుగు రూపాయలు పంతులుగారి దగ్గర దాచిపెడతాడు. ఆ పంతులుగారు ఆ ధనాన్ని తన కొడుకుకి ఉపయోగిస్తాడన్న నమ్మకంతోనే రంగయ్య ఆ విధంగా చేస్తాడు. రంగయ్యకు ఒకామె వంట చేసి పెడుతుంటుంది. ఆనాటి సమాజంలో ఒకరికొకరు సహాయం చేసుకుంటూ జీవించేవారని తెలుస్తుంది.

ఈ కథలో బాలిక కుళ్ళిపోయిన మామిడిపండు తింటుంది. బాలురు మురికి కాలువలో స్నానం చేస్తుంటారు. స్త్రీలు దుర్గంధమైన కాలువలో బట్టలుతుకుతుంటారు. ఈ విషయాల వల్ల పేదవారు ఎటువంటి దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారో వెల్లడి అవుతుంది.

అంతేగాక పేదవారు మురికి కాలువ పక్కన గుడిసెలు వేసుకుని నివాసముంటారు. అక్కడ ఎటుచూసినా తోళ్ళు, టైర్లు, చెప్పులు ఉంటాయి. ఇక్కడ శ్రమజీవుల జీవనశైలిని కళ్ళకు కట్టినట్టుగా కనబడుతుంది. ఆనాటి సమాజంలో వయోజనవిద్య కూడా ఉన్నట్టు ఈ కథ ద్వారా వెల్లడి అవుతుంది. టీ అమ్మే వ్యక్తి పులిచారల బనీను వేసుకున్నట్టు ప్రస్తావించబడింది. దీనివల్ల ఆనాటి వస్త్రధారణ తెలుస్తుంది. రంగయ్య మట్టికుండలో నీళ్ళను ముంతలోకి వంపుకుని తాగుతాడు. ఇవి నేడు ధనవంతుల వంట పాత్రలుగా మారాయి. ఈ కథలో రమణ తండ్రి దగ్గర ఐదు పైసలు తీసుకుంటాడు. ఆ రోజులలో ఐదు పైసలకు తినుబండారాలు లభించేవి. ఇప్పుడు ఒకరూపాయి తీసికెళితే గాని ఏమిరావు. రంగయ్య రోడ్డు పక్కన ఒక స్త్రీ దగ్గర భోజనం చేస్తాడు. ఆధునిక సమాజంలో కూడ మొబైల్ వాన్‌ల రూపంలో ఈ విధంగా భోజనం లభిస్తుంది. ఈ కథ ద్వారా ఆనాటి ప్రజల సామాజిక జీవన చిత్రణ వెల్లడి అవుతుంది.

మనమే నయం కథ

మనమే నయం కథను కాళోజీ నారాయణరావుగారు 1943వ సంవత్సరంలో రాశారు. రచయిత జంతువుల, మానవుల జీవన విధానం గురించి, నల్ల ఎద్దు, తెల్ల ఎద్దుల సంభాషణ ద్వారా తెలియజేశారు.

ఒకరోజు ఈ ఎద్దుల యజమాని ఎల్లయ్య ఎద్దులను అందంగా అలంకరిస్తాడు. అపుడు ఆ ఎద్దులు ఈ విధంగా మాట్లాడుకుంటాయి. ఈరోజు ఎల్లయ్య మన మెడలపై కాణికి బదులు, బుక్కాగులాలు, బ్యారేడు జోడులకు బదులు నుదుట కుంకుమ బొట్టుపెట్టి, వీపు మీద కొరడాతో కొట్టకుండ దయతో వీపు మీద తడుతున్నాడేమిటని నల్ల ఎద్దుని, తెల్ల ఎద్దుని అడుగుతుంది. ఓపిక పట్టి చూడమని తెల్ల ఎద్దు అంటుంది.

ఆనాటి సమాజంలో ఎస్.పి.సి.ఎ. (జంతువుల పట్ల జరిగే అన్యాయ నిరోధక సంఘం) వారు ఆ రోజు వార్షికోత్సవ సందర్భంగా ఆరోగ్యంగా ఉన్న కొన్ని జంతువులను, కొంతమంది మనుషులతో కలసి ఊరేగింపు జరపాలనుకుంటారు.

అందువల్ల ఎల్లయ్య ఎద్దులను అలంకరిస్తాడు. ఆ రోజు మధ్యాహ్నం మూడు గంటలకు బాజాభజంత్రీలతో, వాలంటీర్లు, గార్డ్ ఆఫ్ ఆనర్లతో చె(ప్రాసి మొదలు సుబేదారు వరకు గల ప్రభుత్వోద్యోగులు, లక్షాధికారులు, బిచ్చగాళ్ళు, విద్యావంతులు, సామాన్యులు, డాక్టర్లు, వకీళ్ళు, అన్ని మతాల, కులాల, సంఘాలకు చెందిన సభ్యులందరు ఆ ఊరేగింపులో పాల్గొంటారు. కానీ వారిలో కొంతమందికి ఆ ఊరేగింపు ఎందుకు జరుగుతుందో, జంతువులకు ఎంత తెలుసో వారికి అంతే తెలుసు. నల్ల, తెల్ల ఎద్దులు ఎల్లయ్య బలవంతం మీద ఏవిధంగా ఆ ఊరేగింపులో పాల్గొంటున్నాయో, ఆ ప్రభుత్వ ఉద్యోగులు కూడా అదే విధంగా పాల్గొంటున్నారు. ఆ సభకు ఒక గొప్ప ప్రభుత్వ ఉద్యోగి అధ్యక్షత వహిస్తాడు. ఆ సంఘకార్యదర్శి వార్షిక చదివి వినిపిస్తాడు. అందులో ఎన్ని వందల ముల్లుకర్రలు విరిగాయి, ఎంతమంది బండివాళ్ళను, జట్కావాళ్ళను, గాయపడిన వాటిని, ఎడ్లను, గుర్రాలను, కట్టినందుకు కోర్టు కెక్కించి జరిమానాలు విధించింది చెబుతాడు. ఆ తర్వాత నలుగురైదుగురు పెద్దలు జంతువుల కష్టాలు, ఇబ్బందులు, వానిని మాన్పించడానికి ఉపాయాలను గూర్చి ఉపన్యసిస్తారు. వీరికి ఏ జంతువుకి ఏ కష్టమో తెలియదు. వారు బండి వాళ్ళను కోర్టు కెక్కించడం వల్ల, ఆ బండి వ్యక్తి, తన బక్క చిక్కిన జంతువుకి గడ్డి కొనడానికి ధనం లేక జంతువులను కోల్పోయిన విషయం కూడా వారికి తెలియదని రచయిత ఈ కథ ద్వారా తెలియజేశాడు.

ఆ సభానంతరం ఎవరి ఇళ్ళకు వాళ్ళు వెళ్ళిపోతారు. జంతువులు కూడా దొడ్లకు చేరుకుంటాయి. అప్పుడు తెల్ల ఎద్దు, నల్ల ఎద్దుతో ఈవిధంగా అంటుంది. ఈ మనుషులలో కొందరు, అందులో ముఖ్యంగా పనిపాటలు లేకుండా ధనాన్ని గడించేవారు, మన క్షేమం కోసం, ఒక సంస్థను స్థాపించారు. ప్రత్యక్షంగా నిత్య జీవితంలో వారికి, మనకు ఏమి సంబంధం లేదు. మనతో నేరుగా సంబంధం ఉన్నవారు, మన వలన జీవనోపాధి పొందడమే గాక, వేలపుట్ల ధాన్యాన్ని పండించుకునేవారు మనపై, మనము ఈడ్చే బండ్లపై స్వారీ చేసేవారు మనకు సరిగా తిండి పెట్టకుండా కష్టపెడుతున్నారని, మనకు రోగాలు వచ్చిన, గాయాలు తగిలిన, చికిత్స చేయించకుండ పనిచేయిస్తున్నారని అందువలన మనందరం ఇబ్బందులు పడుతున్నారని వీరి అభిప్రాయం. అందుకనే ఈ సంఘం వారు ఎంతో ప్రయాసపడి, మన కాపరులైన నరుల నుండి వేలకువేలు ముల్లుకట్లను లాక్కుంటున్నారట. బక్కచిక్కిన, అనారోగ్యంతో ఉన్న, గాయపడిన జంతువులతో పని చేయించేవారిని కోర్టు కెక్కించి శిక్షలిప్పిస్తున్నారట. కాని వీరి ఆహారం కోసం

కరకర నరకబడే జంతువుల మీద ఏమాత్రం దయలేదు. 'ఒకేసారి చంపడం వల్ల జీవితం నుండి విముక్తి పొందడం అనివీరి భావన కాబోలు!'. ప్రతిరోజు తెల్లవారేసరికి లక్షలకోళ్ళు, గొఱ్ఱెలు, ఆవులు, ఎడ్లు క్రమక్రమంగా నరకబడుతున్నా వీరికేమాత్రం పట్టదు.

ఈ విధంగా చంపే జంతువులన్ని ఆరోగ్యంగా ఉన్నవి, బాగా బలిసినవి, ముసలివి కానివి, అయి ఉండాలి. ఇదేమి భూతదయో! ఇదేమి దౌర్జన్య నిరోధమో వారికే తెలియాలి. ఈ సంఘం వారు మనకు చేసిన ఉపకారమేమి అని ఎద్దు అంటుంది. అంతేగాక తల్లిపాలు మాని నాలుగు గడ్డిపరకలు తినడం మొదలైన నాటి నుండి నిర్బంధ జీవితం ప్రారంభమైనట్లు ఎద్దు భావిస్తుంది. స్వేచ్ఛ అంటే తెలియకుండా మానవుడు వాటి జీవితాన్ని దుఃఖమయం చేస్తున్నాడని భావిస్తారు. అతడు చేయించిన పనినెల్ల చేయాలని, అలా చేయకపోతే ఎముకలు విరిగేలా బాదుతాడు. వాటికున్న అన్ని కష్టాలకు మూలకారణం నిర్బంధ జీవితమే అని తెల్ల ఎద్దు అంటుంది.

ఆ తరువాత నల్ల ఎద్దు ఈ విధంగా అంటుంది. ఆ జంతువులను అంత కష్టపెట్టే ఆ నరుల జీవితం కూడ ఏమంత బాగోలేదని అంటుంది. కొంతమంది ధనవంతులు తప్ప, మిగినవారి జీవితం ఎన్నోరెట్లు అసహ్యకరంగా ఉందని, కొన్ని జంతువులు స్వేచ్ఛగానే ఉన్నాయని, ఎద్దుల వంటి జంతువులకు దేహకష్టం చేసిన తరువాత, తినడానికి గడ్డి, చొప్ప, తెలకపిండి, తాగుటకు నీరు, ఉండడానికి దొడ్లు ఉన్నాయి. కాని మనుషులలో కోట్ల మందికి ఎముకలు విరిగేంత కష్టపడినప్పటికీ, ఉండడానికి గుడిసె, వారి ఆచారాను సారంగా దేహాన్ని దాచుకోడానికి సరైన వస్త్రాలు, చివరికి తాగాడానికి నీరు కూడా లేక మలమల మాడుతూ అసహ్యకరమైన రోతపుట్టే జీవితాన్ని గడుపుతున్నారు. వారికి మనకున్నట్లు దౌర్జన్య నిరోధక సంఘమొకటి కూడ లేదు. కనీసం తలనరికి ఒకేసారి ముక్తి కలిగించే కసాయి ఖానాలు కూడ లేవు. మనమే నయం అని నల్ల ఎద్దు చెప్పింది విన్న తెల్ల ఎద్దు తెలతెల బోయింది. *(తెలంగాణ కథలు. 2005. పుట: 33, 34)*

మనమేనయం కథ – సామాజిక విశ్లేషణ

సుప్రసిద్ధ తెలంగాణ రచయిత "కాళోజీ" గారు పరకాయ ప్రవేశం చేసి సమాజంలో బలహీన వర్గాల జీవనం ఏ విధంగా ఉందో 'మనమేనయం' అనే కథలోని ఎద్దుల సంభాషణ ద్వారా తెలియజేశారు. జంతువుల జీవితం కంటే

బలహీన వర్గానికి చెందిన ప్రజల జీవితమే దుర్భరంగా ఉందన్న విషయం ఎద్దుల తోనే పలికించారు. ఈ కథలోని ఎద్దులు రోజంతా యజమాని ఏ పని చేయిస్తే ఆ పని చేసిన తరువాత వాటికి తినడానికి గడ్డి, తెలకపిండి, తాగడానికి నీరు, నివాసముండడానికి దొడ్లు ఉన్నాయి. కాని పగలంతా శ్రమ చేసే మానవులకు ఉండడానికి గుడిసెలు, కట్టుకోడానికి బట్టలు, చివరకు తాగడానికి నీరు కూడా లేక హీనమైన జీవితాన్ని గడుపుతున్నారని, రచయిత సమాజానికి తెలియజేసేశారు. ఈ దౌర్జన్య నిరోధక సంఘం వల్ల, వారు గుఱ్ఱపు బండి మొదలైనవి నడుపుకుని జీవనం సాగించే వ్యక్తుల పైన వేసే పిటిషన్‌ల వల్ల, వారు కోర్టుకి జరిమానాలు కట్టి, వాటికి గడ్డి కొనలేని పరిస్థితి ఏర్పడి, ఆ జంతువులు మరణిస్తుంటాయి. అందుకు కారణం ధనవంతులేనన్న విషయం రచయిత ఆ ఎద్దులతోనే పలికించారు. ధనవంతులు చేసే పనుల వల్ల జంతువులు చని పోతున్నాయి, గాని బండి నడిపే తమ యజమాని వల్ల కాదు అన్న విషయాన్ని రచయిత ఎద్దుల మనోగతం ద్వారా వారికి కనువిప్పు కలిగించే ప్రయత్నం చేశారని చెప్పవచ్చు.

సమాజంలో కొంతమంది వ్యక్తులు తమ గుర్తింపు కోసమే, ఇటువంటి సభలు ఏర్పాటుచేస్తున్నారు. వారిలో ఉన్న కొంతమంది ఎద్దుకి, గుఱ్ఱానికి తేడా తెలియకుండానే ఆ సభలకు హాజరవుతుంటారు. కాని బండినడిపే వ్యక్తుల పైన మాత్రం కేసులు పెడుతుంటారు. వాటి వల్ల నష్టమే తప్ప, ఎవరికి మేలు జరగకపోగా నష్టమే జరుగుతుంది. రచయిత ఆయా సంఘాలను నడిపే వ్యక్తులకు కనువిప్పు కలిగించే ప్రయత్నం చేశారని చెప్పవచ్చు. ఈకథలో రచయిత మానవుల, జంతువుల జీవన విధానాన్ని సమన్వయం చేసి, సమాజంలోగల లోపాలను ఎత్తిచూపి కృతకృత్యులయ్యారు. అంతేగాక ఈ కథలో ఎద్దులు 'మనలను ఇంత కష్టపెట్టే ఆ నరుల జీవితం మాత్రం ఏమంత బాగా ఏడ్చింది'. అని అనుకుంటాయి. కాళోజీ నారాయణరావుగారు జంతువుల పట్ల దయ కలిగి ఉండాలన్న నీతిని వాటి మనోగతం ద్వారానే సమాజానికి సూచించారు.

జంగుభాయి కథ

గోపి భాగ్యలక్ష్మిగారు 1992లో 'జంగుభాయి' అనే కథను రాశారు. ఈ కథలో ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనుల జీవన విధానాన్ని రచయిత్రి చిత్రించారు. లక్ష్మి భర్త ఉపాధ్యాయుడు. వారు ఉద్యోగ రీత్యా ఆ ప్రాంతానికి వెళతారు. అక్కడ వారికిచ్చిన ఒక పర్ణశాలను తలపింపజేస్తుంది. వారు తాగడానికి నీరు వాగుకి

వెళ్ళి గుంటలు చేసి,అవి తేరుకున్న తరువాత గ్లాసులతో తోడి బిందె నింపుకొని తెచ్చుకుంటారు. అక్కడున్న స్త్రీలు కేవలం చీరను మాత్రమే కట్టుకుంటారు, జాకెట్ వేసుకోరు. వీరు చలికాలం నట్టింట్లో సంద్ర కర్రలు పేర్చుకుని, వాటిని వెలిగించి కుటుంబ సభ్యులంతా చుట్టూ కూర్చుని చలికాచుకుంటూ ఉంటారు. వర్షా కాలంలో వీరి ఇంటికి, వీధికి పెద్ద తేడా ఉండదు. వేసవి కాలంలో కూడా వీరి పరిస్థితి అతి భయంకరంగా ఉంటుంది. వీరు కాళ్ళకు చెప్పులు వేసుకోరు. అందువల్ల వీరి పరిస్థితి నిప్పులపై నడుస్తున్నట్టే ఉంటుంది.

ఒకరోజు బంగాళాఖాతంలో వాయు గుండం పడుతుంది. ఆ రోజు గాలివాన చాలా ఎక్కువగా ఉంటుంది. ఉపాధ్యాయుని ఇంటి ఎదురుగా ఒక గోండు కుటుంబం ఉంటుంది. ఆ కుటుంబంలో జంగుభాయి అనే యుక్త వయసు వచ్చిన అమ్మాయి బహిష్టు అయ్యిందని, ఆమె తల్లి వానలో గుడిసె బయట కూర్చోబెట్టి, ఒక సత్తు గిన్నెలో మొక్కజొన్న గడుక (సంకటి)ని పై నుంచి ఎత్తి వేస్తుంది. ఆ తరువాత జంగుభాయి, ఆ గిన్నెను తీసుకుని తింటుంది. ఆ తరువాత ఆమె తల్లి ఒక సత్తు చెంబుతో నీరు తెచ్చి దూరంగా పెడుతుంది. జంగుభాయి ఆ నీరు తాగి, ఆ గిన్నె చెంబులను చూరు నీళ్ళతో కడిగి ఓరగా బోర్లిస్తుంది. ఆ దృశ్యాన్ని లక్ష్మి చూసి, ఏమైందని అడుగుతుంది. అపుడు జంగుభాయి 'బయటున్నాను ఇంట్లకు పోవద్దు' అంటుంది. ఆ మాటలు విన్న జంగుభాయి తల్లి బయటకు వస్తుంది. అపుడామె లక్ష్మిని చూసి 'అమ్మా తడుస్తండ్లు ఇంట్లకు రాండ్లి' అంటుంది. మరి జంగు కూడా తడుస్తుంది కదా! అంటుంది. 'అది ముట్టుకోదు అయిదు దినాల దాకా ఇంట్లకు రాదు'. అపుడు లక్ష్మి జంగుభాయి తల్లికి నచ్చజెప్పే ప్రయత్నం చేస్తుంది.

నాగరిక సమాజంలో ఆచారం పేరుతో స్త్రీని దూరంగా ఉంచుతుంటే, ఇక్కడ అంతకంటే ఘోరంగా ఉంది అనుకుంటుంది లక్ష్మి. ఆమె జంగుభాయిని తన ఇంటికి తీసికెళుతుంది. తుడుచుకోడానికి ఒక పాతచీర ఇచ్చి, తాగడానికి డికాషన్ కూడ ఇస్తుంది. జంగుభాయి మేనత్త అటువంటి పరిస్థితిలోనే జ్వరం వచ్చి చనిపోయిందని లక్ష్మితో చెబుతుంది. ఆ రాత్రి జంగుభాయి అక్కడే పడుకుంటుంది. తెల్లవారేసరికి బయట హడావిడిగా ఉంటుంది. ఆ రాత్రి చిరుతపులి వచ్చి మేకను చంపుతుంది. దానికి కారణం జంగుభాయిని లక్ష్మి ఇంటిలోకి తీసికెళ్ళడం వల్ల దేవర పులిని తోలిందని ఒక ముసలామె అరుస్తుంది. ఆ తరువాత కొన్నిరోజులకు జంగుభాయి అక్కకు మగశిశువు జన్మిస్తాడు. వారు ఆ శిశువుకి మూడవరోజే పుట్టుజుట్టులు తీస్తారు. ఆ మరుసటి రోజే అనారోగ్యంతో ఆ పిల్లవాడు మరణిస్తాడు.

ఆ పిల్లవాడు అనారోగ్యంతో ఉన్నా హాస్పిటల్‌కి తీసికెళ్ళరు. ఇది వారి అనాగరికతకు తార్కాణం. ఆ ప్రాంతపు పటేల్ ఉపాధ్యాయుణ్ణి దగ్గరకు వెళ్ళి మాలమాదిగల పిల్లలు, గోండు పిల్లలతో కలసి కూర్చోవడం వల్ల వారు మైలపడు తున్నారని, వేరుగా కూర్చో బెట్టమని చెబుతాడు. అపుడు మాష్టారు ఒకసారి పాఠశాలకు వచ్చిన తరువాత విద్యార్ధులందరూ సమానమే అని సర్దిచెప్పే ప్రయత్నం చేస్తాడు. అపుడు పటేల్ సరేలెండి గోండు పిల్లలు బడి నుండి వాగుకి వెళ్ళి స్నానం చేసి వస్తారు అంటాడు. జంగుభాయికి బాల్య వివాహం జరుగుతుంది. ఆమెకు యుక్త వయసు వచ్చిన తరువాత వేరే వ్యక్తితో సంబంధం పెట్టుకుంటుంది. అందుకు ఆ కుటుంబానికి మూడు వందల రూపాయలు జరిమానా విధిస్తారు. ఆమె తల్లిదండ్రులు దాన్ని అవమానంగా భావించి ఎంతగానో దుఃఖిస్తారు. ఈ కథలో కమల అనే లంబాడి యువతి ఆ ఊరికి బట్టలు అమ్మడానికి వచ్చే యువకుని చేతిలో మోసపోతుంది.

సామాజిక జీవన చిత్రణ

ఈ కథలో గిరిజనులు తమ ప్రాణాల కంటే మూఢనమ్మకాలకే ఎక్కువ ప్రాధాన్యత నిస్తారని రచయిత తెలియజేశారు. స్త్రీలు బహిష్టు సమయంలో ఇంటి లోపలికి వస్తే దేవరకు కోపం వస్తుందని వారు నమ్ముతారు. ఈ కథలో జంగుభాయిని లక్ష్మి వాళ్ళ ఇంటికి తీసుకెళుతుంది. జంగుభాయి ఇంటిలోకి వెళ్ళడంవల్ల, దేవరకు కోపం వచ్చిందని, అందుకే పులి వచ్చి మేకనుతిందని, ఆ ఊరి వారు జంగుభాయి తల్లితో గొడవపడతారు. పుట్టిన మూడు రోజులకే శిశు వుకి పుట్టు వెంట్రుకలు తీస్తారు. ఆ విధంగా చేయడం వారి ఆచారమని, దానిని తప్పనిసరిగా పాటించాలని వారు భావిస్తారు. వీరు కాళ్ళకు చెప్పులు వేసుకోరు. మండుటెండల్లో కూడా కొండల్లో అలాగే తిరుగుతారు. ఆడ పిల్లలకు బాల్యవివాహాలు చేస్తారు. యుక్త వయస్సు వచ్చిన తరువాత వారిరువురిలో ఎవరికైనా, వేరొక వ్యక్తి నచ్చితే వారు జరిమానా కట్టాలి.

ఈ కథలో జంగుభాయికి వేరే వ్యక్తి నచ్చి, అతనితో ఉండడం వల్ల ఆ ఊరి వాళ్ళు జంగుభాయి తల్లిదండ్రులకు 300 రూపాయలు జరిమానా వేస్తారు. అది వారు చాలా అవమానంగా భావిస్తారు. జంగుభాయి తల్లిదండ్రులు వాళ్ళ పెద్ద కూతురుకి వివాహం చేయడానికి వారికున్న కొంత భూమిని తాకట్టుపెట్టి ఆ ఊరి పటేల్ దగ్గర ధనం తీసుకుంటారు. వారు ఆ ధనాన్ని చెల్లించలేకపోతారు. అందువల్ల

ఆ ఊరి పటేల్ వారి అప్పు కింద భూమిని జమ కట్టుకుంటాడు. ఈ కథలో మరొక స్త్రీ కాంతాభాయి. ఆమె లక్ష్మితో 'ఈడ గోండులు మంత్రాలు చేస్తరు జేగర్త గుండాల' అంటుంది. ఆమె గోండులకు మంత్రతంత్రాల పట్ల ఉన్న మూఢ నమ్మకాలను సొమ్ము చేసుకుంటూ జీవిస్తుంది. ఇటువంటి దౌర్జన్యం గిరిజన సమాజంలో ఉన్నట్టు ఈ కథ వల్ల వ్యక్తమవుతుంది. అంతేగాక ఈ గోండుజాతి వారు తమ పిల్లలను, మాలమాదిగల పిల్లలను ఒకేచోట కూర్చోబెట్టొద్దని ఉపాధ్యాయుడితో చెబుతారు. అందుకు ఉపాధ్యాయుడు ఒప్పుకోకపోవడం వల్ల, గోండుల పిల్లలు వాగుకి వెళ్ళి స్నానం చేసి వస్తారు. గోండుజాతిలో గూడుకట్టుకున్న మూఢ నమ్మకాలు, బాల్యవివాహాలు, కులవివక్ష మొదలైనవన్ని ఈ కథ ద్వారా వ్యక్తమవుతున్నాయి.

చెర కథ

'చెర' అనే కథను 'నవీన్' అనే రచయిత 1987వ సంవత్సరంలో రాశారు. ధర్మారం అనే గ్రామంలో రాజమ్మ, సమ్మయ్య అనే భార్యాభర్తలుంటారు. వారికి సాంబయ్య అనే కుమారుడుంటాడు. రాజమ్మ, సమ్మయ్య రోజంతా వరి పొలంలో కోతకోసి ప్రతిఫలంగా యజమాని ఇచ్చిన కూలిగింజల్ని తీసుకుని జీవనం సాగిస్తుంటారు. వారి కుమారుడయిన సాంబయ్య తల్లిదండ్రుల మీద ఆధారపడి జీవిస్తుంటాడు. అందుకు అతనికి చాలా బాధగా ఉంటుంది. సాంబయ్య ఏదైనా ఉద్యోగం సంపాదించి ఉన్నతంగా బతకాలని కోరిక.

ఆ ఊరిలో ప్రకాశరావు అనే అతను యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేస్తుంటాడు. అతడు ఆఊరిలో ఇద్దరు ముగ్గురికి ఉద్యోగాలిప్పిస్తాడు. అతడు గ్రామానికి వచ్చినప్పుడల్లా సాంబయ్య అతణ్ణి కలసి తనకు ఉద్యోగమిప్పించమని అడుగుతుంటాడు. కొంతకాలం తరువాత ప్రకాశరావు తండ్రి కుటుంబరావుకి పక్షవాతం వస్తుంది. అపుడతడు తన తండ్రిని పట్నం తీసికెళ్ళడానికి వస్తాడు. సాంబయ్యను పిలిచి, ఉద్యోగమిప్పిస్తాను రమ్మని తీసికెళ్తాడు. కుటుంబరావుని హాస్పిటల్లో చేర్పించి, సాంబయ్యను అతని దగ్గర ఉంచి, తండ్రి మలమూత్రాలను ఎత్తిస్తాడు. మూడునెలల తరువాత కుటుంబరావు చనిపోతాడు. ప్రకాశరావు తండ్రి కర్మ కాండలు ధర్మారంలోనే చేస్తాడు. ఆ పదకొండు రోజులు సాంబయ్య క్షణం తీరిక లేకుండా పనిచేస్తాడు. ఆ పనులన్ని పూర్తి అయిన తరువాత పట్నానికి బయలుదేరుతాడు. సాంబయ్య కూడా పట్నానికి వెళ్ళడానికి సిద్ధపడతాడు. అపుడు

ప్రకాశరావు వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్‌లతో మాట్లాడానని, రెండు అటెండర్ పోస్టులు వచ్చాయని, అవి షెడ్యూల్డ్ కులాలకు చెందినవని, సాంబయ్యను కూడా షెడ్యూల్డ్ కాస్ట్ సర్టిఫికెట్ సంపాదించమంటాడు. అపుడు సాంబయ్య 'దొంగ సర్టిఫికెట్ నాకెందుకు సార్' అంటాడు కన్నీటితో! అపుడు ప్రకాశరావు ఎందుకలా బాధపడతావు, 'ఒక్క నాలుగు రోజులు ఓపిక పట్టు, ఊర్లో పని చేసుకో, నీలాంటి ఏబుల్ బడీడ్ యంగ్ మ్యాన్‌కి పని దొరకక పోవడమేమిటి' అని వ్యానెక్కి వెళ్ళిపోతాడు. సాంబయ్యకు ఆ మాటలు చెవుల్లో మారుమోగుతుంటాయి. ఆ సమయంలో కూలీలు పొలాలకు వెళుతుంటారు. అపుడు వాళ్ళతో కలసి పనికి వెళ్ళాలో, లేక పట్నం వెళ్ళి ఏ లారీ కిందనైనా పడి శాశ్వతంగా ఈ లోకాన్ని విడిచిపోవడమో సాంబయ్యకు బోధపడలేదు.

సామాజిక జీవన చిత్రణ

"చెర" కథను రచయిత వాస్తవిక సంఘటనను ఆధారంగా చేసుకుని రాసి ఉండవచ్చు. సమకాలీన సమాజంలో గల స్థానికత ఈ కథలో వ్యక్తమవుతుంది. గ్రామాలలో పై పదవులలో ఉన్న వ్యక్తులు, చిన్న చదువులు చదువుకున్న వ్యక్తులను, వారి సొంత ప్రయోజనాల కోసం ఏ విధంగా ఉపయోగించుకుంటున్నారో ఈ కథ ద్వారా వ్యక్తమవుతుంది. పై కథలో ప్రకాశరావు ఉన్నత పదవిలో ఉండి కూడా సాంబయ్యను దొంగ సర్టిఫికెట్ సంపాదించమనడం, ఇక్కడ గమనించదగ్గ విషయం. సమాజంలో కొంతమంది ఈ విధంగా ఉద్యోగాలను సంపాదిస్తున్నారన్న విషయం ఈ కథ ద్వారా వ్యక్తమవుతుంది.

షెడ్యూల్డ్ కులాల వారికి ఉద్యోగ అవకాశాలున్నాయన్న విషయాన్ని, రచయిత ఈ కథ ద్వారా వ్యక్తం చేసే ప్రయత్నం చేస్తున్నారని చెప్పవచ్చు.

సమాజంలో కూలి పనిచేసి, యజమాని ఇచ్చిన ధాన్యంతో జీవితాన్ని వెళ్ళబుచ్చే సమ్మయ్య, రాజమ్మ వంటి వ్యక్తుల జీవితం, ఎంత దుర్భరంగా ఉంటుందో ఈ కథ వల్ల వ్యక్తమవుతుంది. అంతేగాక సాంబయ్య వంటి వ్యక్తులు సరిగ్గా చదువుకోక పోవడం వల్ల, జీవితం మీద సరైన అవగాహన లేక, ఉన్నతంగా జీవించాలన్న ఆశతో, ఆశకు తగిన ఆచరణ లోపించి, సకాలంలో దారి చూపే నాథుడు లేక, అనాదరణకులోనై అభాగ్యులు తమ జీవితాలను దుర్భరప్రాయంగా చేసుకుంటున్నారు. సమాజంలో సాంబయ్య వంటి వ్యక్తులు కొంతమంది స్వార్థానికి బలవు తున్నారన్న విషయం కూడ పై కథ వల్ల వ్యక్తమవుతుంది.

సమాజంలో ప్రకాశరావువంటి వ్యక్తులు ఉన్నారన్న విషయాన్ని రచయిత పాఠకులకు తెలియజెప్పే ప్రయత్నం చేశారని చెప్పవచ్చు. రచయిత సామాజిక ప్రయోజనాన్ని ఆశించి ఈ కథను రాశారని చెప్పవచ్చు.

అంతర్ముఖం కథ

'అంతర్ముఖం' కథ 2003వ సంవత్సరం, మార్చి నెల, ఆదివారం ఆంధ్రజ్యోతిలో వెలువడింది. దీని రచయిత జాతశ్రీ. ఈ కథలో రచయిత గీత కార్మికుల జీవన విధానాన్ని చిత్రించాడు. ఈ కథలో మల్లేశం అనే గీత కార్మికుడికి చదువుకున్న తన కొడుకుని విదేశాలకు పంపించడానికి 50 వేల రూపాయలు అవసరమవుతాయి. అతని కుమారుడు భూమిని అమ్మి తనను విదేశాలకు పంపించమంటాడు, కాని మల్లేశానికి భూమిని అమ్మడం ఇష్టం లేదు. ఆ ధనాన్ని ఏ విధంగా సమకూర్చాలన్న ఆలోచనలతో కల్లు గీయడానికి వెళతాడు. అప్పుడతనికి ఆ సమయంలో తాటిచెట్టు మీద నుండి కిందపడి చనిపోయిన బండి వెంకన్న గుర్తుకొస్తాడు. వెంకన్న తాటిచెట్టు పైన మంద్రగబ్బ కరవడం వల్ల చనిపోతాడు. ఆ తరువాత ప్రభుత్వం అతని కుటుంబానికి ఎక్స్ గ్రేషియా ఇచ్చింది. ఖర్చులు పోను వాళ్ళకు 80వేలు మిగులుతాయి. ప్రస్తుతం మల్లేశం మనసులో అదే మెదులుతుంటుంది. 'బతికి సాధించేదేముంది. ఇయ్యాల గాకుంటే రేపన్న బూడిదగాక తప్పుద్దా' అని మనసులోనే అనుకుంటాడు. అదే ఆలోచనలతో తాడిచెట్టెక్కుతాడు. అతని గుండెను పిండుతున్నట్టు ఏదో బాధగా ఉంటుంది. తాడు జారి కిందపడిపోతుంది. మల్లేశం కూడ చెట్టు పైనుండి కింద పడి చనిపోతాడు. మల్లేశం తన కొడుకుని కువైట్‌కి పంపించడానికి మరణాన్నే మార్గంగా ఎంచుకుంటాడు.

(తెలంగాణ కథలు: 2005 : 724)

సామాజిక జీవన చిత్రణ

సమకాలీన సామాజిక నేపథ్యాన్ని రచయిత ఈ కథలో ప్రస్ఫుటింపజేసే ప్రయత్నం చేశాడు. కేవలం కులవృత్తి మీద ఆధారపడి జీవించేవారి జీవితం దుర్భరమని, కులవృత్తితో పాటు, సొంత భూమి ఉండి, వ్యవసాయం కూడ చేసుకునే వారి జీవితం కొంత మెరుగ్గా ఉంటుందని ఈ కథవల్ల వెల్లడి అవుతుంది. మల్లేశం ప్రతి ఉగాదికి ఎరువుల కొట్లో, బట్టల కొట్లో అప్పులు తీర్చేసి, కొత్త ఖాతా రాయించు కునేవాడు. కాని రెండేళ్ళ నుంచి పాత అప్పుకే వడ్డీ కలిపి, కొత్త ఖాతా తెరుస్తుంటాడు.

అటువంటి పరిస్థితి ఏర్పడినందుకు అతడు మనస్తాపానికి గురవుతాడు. ఇక్కడ గీత కార్మికుల జీవన స్థితిగతులు వెల్లడి అవుతున్నాయి. ఈ కథలో తులసెమ్మ అనే స్త్రీ కల్లు అమ్ముడుపోక పడేస్తుంది. గ్రామంలో అందరు 'కోకాకోలా'కి అలవాటు పడ్డారని, అంతేగాక తాండాల్లో గుడుంబా కూడ దొరుకుతుందని మల్లేశంతో అంటుంది. ప్రజలందరు వాటికి అలవాటుపడుతున్నారని ఈ కథ వల్ల తెలుస్తుంది.

ఈ కథ ద్వారా ప్రపంచీకరణ ప్రభావం కులవృత్తుల మీద పడిందని వ్యక్తమవుతుంది. ప్రభుత్వం కార్మికులకు ఇచ్చే బ్యాంక్ (టఔటి) కూడ పాతఅప్పులు కడితేనే ఇస్తుందన్న విషయం కూడా ఈ కథలో ప్రస్థావించబడింది. ఆ ఊరిలో డాక్టర్ కూడ ఇంజక్షన్ చేసినందుకు మల్లేశం దగ్గర 20 రూపాయలు, వేరే వ్యక్తి దగ్గర పది రూపాయలు తీసుకుంటాడు. గ్రామాలలో ఇచ్చిన వారి దగ్గర ఇచ్చినంత దోచుకుంటున్నారన్న విషయం వ్యక్తమవుతుంది. ఈ విధంగా గ్రామాలలో ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్న విషయం రచయిత ఈ కథ ద్వారా తెలియజేశారు.

ముగింపు

ఈ వ్యాసంలో ఐదు విభిన్నమైన కథలు చర్చించబడ్డాయి. ఐదు కథలలోను ఆయా కాలాలలో గల సమకాలీన సామాజికాంశాలను, రచయితలు కథా ఇతి వృత్తాలుగా స్వీకరించారు. వాటిలో 1967లో వెలువడిన 'చెప్పులు' కథ ఒకటి. ఈ కథలో దళితుడైన రంగయ్యకు, పంతులు గారికి ఉన్న అనుబంధం వ్యక్తమవుతుంది. పంతులుగారు రంగయ్య కొడుకుకి భోజనం పెట్టి, చదువు చెబుతూ తన సొంత కొడుకు వలె చూసుకుంటాడు. అందుకు కృతజ్ఞతగా రంగయ్య పంతులుగారి చెప్పులు బాగుచేసి ఇవ్వాలనుకుంటాడు. కాని చివరికి ఆ చెప్పుల కోసం తన ప్రాణాలనే కోల్పోతాడు. దళితులు కాలువ పక్కన గుడిసెలలో నివాస ముండడం, ఒకరికొకరు సహాయం చేసుకోడంవంటి ఆనాటి సామాజిక జీవన విధానం ఈ కథలో చిత్రించబడింది. అంతేగాక వయోజన విద్య గురించి కూడా ఈ కథలో ప్రస్తావించబడింది. వేరొక కథ 'మనమే నయం'. దీనిలో రచయిత మానవుడి జీవితాన్ని జంతువుల జీవితంతో పోల్చి, మనిషి కంటే జంతువులే ఉన్నతమైన జీవితాన్ని గడుపుతున్నాయని, రెండు ఎద్దుల సంభాషణ ద్వారా తెలియ జేస్తాడు. సమాజంలో ఉన్న జంతువుల అన్యాయ నిరోధక సంఘాల వల్ల కలిగే

నష్టాలు ఈ కథలో వివరించబడ్డాయి. ధనవంతుల వల్ల సమాజానికి కలిగే నష్టాలు మొదలైన అన్ని విషయాలు చర్చించబడ్డాయి.

మూడవ కథ 'జంగుభాయి' దీనిలో గోండుల మూఢనమ్మకాలు, వారికి గల కులవివక్ష మొదలైన అంశాలతో కూడిన సామాజిక జీవన చిత్రణ జరిగింది. మరొక కథ 'చెర' ఈ కథలో సమాజంలో కూలి చేసుకుని జీవించే ప్రజల జీవన విధానం చిత్రించ బడింది. అంతేగాక పై పదవులలో ఉన్న వ్యక్తులు, యువకులకు ఉద్యోగ మిప్పిస్తామని ఆశచూపి, వారిచేత మలమూత్రాలు కూడా ఎత్తించడం గమనించదగ్గ అంశం. స్థానికపరమైన సంఘటనల ఆధారంగా ఈ కథ వెలువడిందని చెప్పవచ్చు. చివరిది 'అంతర్ముఖం' ఈ కథలో గీతకార్మికుల జీవన చిత్రణ చేయబడింది.

ఉపయుక్త గ్రంథాలు

1. కృష్ణకుమారి, నాయని. 2000. తెలుగు జానపద విజ్ఞానం సమాజం-సంస్కృతి-సాహిత్యం. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.
2. కృష్ణమూర్తి, భద్రిరాజు. 2014. భాష సమాజం సంస్కృతి. నీల్ కమల్ పబ్లికేషన్స్, హైదరాబాదు.
3. మల్లయ్య, కాలువ. శారద సదానంద్, చంద్ర. 2006. తెలంగాణ కథలు. విశాలాంధ్ర పబ్లిషంగ్ హౌస్. హైదరాబాదు.
4. మల్లయ్య, కాలువ. 2012. తెలుగు కథ విభిన్న ధోరణులు. తెలుగు అకాడమి, హైదరాబాదు.

(పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కాలేజి, పెదనందిపాడు, గుంటూరు. జాతీయ సదస్సు జులై 3, 4 2020, భావవీణ ప్రత్యేక సంచిక జులై 2020)

□ □ □

'విముక్త 'కథలు - సమకాలీన దృక్కోణం

ఉపోద్ఘాతం

సమకాలీన సాహిత్యంలో వెలువడే రచనలు కొన్ని సమాజంలోని సమస్యలను పరిష్కరించే దిశగా వెలువడుతుంటాయి. రచయితలు సామాజిక, ఆర్థిక, రాజకీయ, పర్యావరణ, జాతి, లింగ మొదలైన అంశాలను ఎంచుకుని వాటిని పరిష్కరించడానికి కవిత్వం, నవలలు, కథలు, కథానికలు మొదలైన రచనలు చేస్తుంటారు.

అదే విధంగా ప్రముఖ స్త్రీ వాద రచయిత్రి ఓల్గా సమకాలీన సమస్యలను తీసుకుని, నవలలు, కథలు, కవిత్వం, నాటికలు, స్త్రీ వాద వ్యాసాలను కూడా రాశారు. రామాయణంలోని ప్రధాన స్త్రీ పాత్రలను ఆధారంగా చేసుకుని ఆమె 'విముక్త' కథలు రాశారు. రామాయణంలోని శూర్పణఖ, అహల్య, ఊర్మిళ, సీత పాత్రలు తమలో తమని చూసుకుంటు, తమతో తాము యుద్ధంచేస్తూ ధృడ సంకల్పంతో, ఏ విధంగా తమ వ్యక్తిత్వాన్ని కాపాడుకున్నాయో తెలియజేశారు. ఈ కథలలో రచయిత్రి స్త్రీ పాత్రలతో రచయిత్రి సమకాలీన స్త్రీ సమస్యలను సమన్వయం చేస్తూ, వాటికి పరిష్కారం చూపే ప్రయత్నం చేశారు.

సమాగమం

సీత వాల్మీకి ఆశ్రమంలో ఉంటున్న సమయంలో లవకుశులు ప్రతి రోజు పూజకి పూలుకోసుకొచ్చి తల్లికి ఇస్తుంటారు. ఒకరోజు అంతకు ముందెప్పుడు వెళ్ళని వేరే మార్గానికి వెళ్ళి, రంగురంగుల పూలు, మంచి పరిమళం ఉన్న పూలను తీసుకొస్తారు. సీత ఈ పూలు ఎక్కడివని కుమారులను అడుగుతుంది. అపుడు కుశు డు "అమ్మా ఇవాళ అడవిలో ఒక కొత్త ఉద్యానవనం కనుగొన్నాము. అలాంటి ఉద్యానవనం ఎక్కడా చూడలేదు. వాల్మీకి తాతయ్య వర్ణించే నందనవనం కూడా దీని ముందు దిగదుడుపే" అంటాడు. అమ్మా ఆ వనమెంత అందంగా ఉందో దాని

యజమాని రూపం అంత వికారంగా ఉంది. ఆమెను చూసి మేము భయపడ్డాం. మేం ముని బాలకులం పూజకు పూలు కోసుకున్నాం అని అన్నయ్య ధైర్యంగా చెప్పాడు. అబ్బా ఆమె రూపం పరమ వికారం, ఒట్టి కురూపి" అంటాడు లవుడు. "ఆమె మనిషంతా బాగానే ఉందమ్మా! కానీ ముక్కు చెవులు లేవు. ఎవరో కోసినట్టు పెద్ద లొట్ట" అంటాడు. అపుడు ఆమెకు పద్దెనిమిది సంవత్సరాల క్రితం విషయం గుర్తుకొస్తుంది. రామ లక్ష్మణుల క్రూరమైన పరిహాసానికి ఆమె కురూపిగా మారింది. ఆమె రావణుని చెల్లెలని తెలిసే రామలక్ష్మణులు ఆమెను రెచ్చగొట్టడానికి ఆ విధంగా చేశారు, అని సీత గతాన్నంతా గుర్తు చేసుకుని, మరుసటిరోజు తనను ఆ ఉద్యాన వనానికి తీసికెళ్ళమని లవకుశులను అడుగుతుంది.

మరుసటి రోజు సీత లవకుశులతో కలసి ఆ ఉద్యానవనానికి వెళుతుంది. అమె ఆ ఉద్యాన వనం చూసి, అశోకవనం దీని ముందు తీసికట్టు అనుకుంటుంది. సీత పిల్లలను అరణ్య విహారంచేసి రమ్మని చెబుతుంది. ఆ తరువాత తనకు దూరంగా ఉన్న స్త్రీ దగ్గరకు వెళ్ళి 'శూర్పణఖా' అంటుంది. కాని శూర్పణఖ సీతను గుర్తించలేదు. అప్పుడు సీత నేను సీతను అంటుంది. శూర్పణఖ ఈమె సీతా! 'శ్రీరాముడి భార్య సీతేనా' అంటుంది. అపుడు సీత "నేను జనకుని కుమార్తెను జానకిని, భూపుత్రిని" అంటుంది. శూర్పణఖకు అంతా అయోమయంగా ఉంది. సీత ఆమెతో శ్రీరాముడు తనను పరిత్యజించాడు. ప్రస్తుతం వాల్మీకి ఆశ్రమంలో ఉంటున్నాను అంటుంది. సీతారాముల ప్రేమ గురించి శూర్పణఖకు తెలిసినంతగా ఎవరికీ తెలియదు. శ్రీరాముని ప్రేమించిన స్త్రీలకు వేదన తప్పదా అని శూర్పణఖ అనుకుంటుంది. శూర్పణఖకు సీత ముఖం శాంతంగా, గంభీరంగా కనబడుతుంది. సీత చాలా ఎదిగింది అనుకుంటుంది. నిన్న మా పిల్లలు మీ ఉద్యానవనం చూశారు. నిన్నుచూశారు. ఇవ్వాళ వాళ్ళే నన్నిక్కడికి తీసుకొచ్చారు. నీ తోట ఎంతో అందంగా, హాయిగా ఉంది. అని సీత శూర్పణఖతో అంటుంది. అప్పుడు శూర్పణఖ ఆ చిన్నారులు నీ కుమారులా ఎంత ముచ్చటగా ఉన్నారో అంటుంది. ఆ సమయంలో సీత ముఖంలో చిన్న గర్వం కదలాడి మాయమైంది. ఇక్కడ స్త్రీ సహజమైన ఆనందం, గర్వం సీతలో కలుగుతుంది.

ఈ తోటలో మొక్కలూ, లతలూ, తరువులూ అన్నీ నా బిడ్డలే అని శూర్పణఖ సీతతో అంటుంది. అవును అందుకే అంత మనోహరంగా ఉన్నాయి అని సీత అంటుంది. అంతేగాక నీ జీవితం ఎలా ఉంది అని శూర్పణఖను సీత అడుగుతుంది. అపుడామె ఈ వనమంత అందంగా, ఆనందంగా ఉంది అంటుంది. "నాకు

సంతోషంగా ఉంది శూర్పణఖా నీకు జరిగిన అవమానానికి నీవు ఏమైపోతావో అనుకున్నాను. నీ సౌందర్య కాంక్ష నాకు తెలుసు. కురూపితనాన్ని నీవు భరించగలవా! భరించలేక ఏ అఘాయిత్యం చేసుకున్నావోనని నీవు జ్ఞాపకం వచ్చినపుడల్లా బాధపడేదాన్ని నువ్వు ధైర్య సాహసాలు గల దానివి" అంటుంది సీత. "నన్నిపుడు ఇలా చూసి ఇదంతా తేలికగా జరిగిందనుకోకు సీతా జీవితాన్ని ఎదుర్కోడంలోనే ఆనందాన్ని పొందగలిగాను." అని శూర్పణఖ అంటుంది.

ఈ కథలో సీతా శూర్పణఖల సంభాషణ విన్నపుడు శూర్పణఖ మనోధైర్యం వెల్లడి అవుతుంది. రామలక్ష్మణులు ఆమె ముక్కు చెవులు కోసిన తరువాత, ఆ పరిస్థితులను అధిగమించి ఆ వేదన నుండి బయటపడడానికి ఎంత పరిశ్రమ చేసిందో వ్యక్తమవుతుంది. ఇక్కడ శూర్పణఖకు గల బాహ్య సౌందర్యం కంటే అంతఃసౌందర్యం గురించే విశేషంగా చెప్పబడుతుంది. శూర్పణఖ తన తోటలో మొక్కలూ, లతలూ, తరువులను తన బిడ్డలుగా భావిస్తుంది. అందువల్లే ఆమె ప్రకృతిని ఆరాధిస్తుంది. శూర్పణఖ తన అందం గురించి సీతతో ఈ విధంగా చెబుతుంది. "ఆ ఈశ్వరుడు సృష్టి ప్రారంభంలో ముక్కు ఎలా ఉండాలని తలిచాడో అటువంటి ముక్కు నాదని నాకెంతో గర్వం, పచ్చని, తెల్లని గడ్డి పూలను నా ముక్కుకి ఆభరణాలుగా ధరించేదాన్ని". ఆ కసి నుండి బయట పడడానికీ, మళ్ళీ సౌందర్యాన్ని ప్రేమించడానికీ, రూప, అరూపాల అసలు సారాంశాన్ని కనుగొనడానికి నాతో నేను పెద్ద యుద్ధమే చేయాల్సి వచ్చింది" అని కూడా అంటుంది. ఆమె తనతో తను చేసే యుద్ధంలో ప్రకృతి ఆమెకు సహకరించింది అంటుంది. అనేక ప్రాణులను గమనించి, స్తబ్ధత, చలనం గల ఏకరూపతను గమనించింది. రంగుల రహస్యాలను తెలుసుకుందట. ఆమె తనకు తానే గురువుగా సాధన చేసిందట. ఆమె ప్రకృతిలో ప్రతి అణువునీ శోధించిందట. ఆ శోధనలో ఆమె కళ్ళే మారిపోయాయట. ఆ తరువాత ఆమెకు ప్రతిదీ అందంగానే కనిపించిందట.

ఆమెతో సహా ప్రతి దాన్నీ అసహ్యించుకునే ఆమె, ఆమెతో సహా సృష్టిలో ఉన్న అన్నింటినీ ప్రేమించే స్థాయికి చేరుకుందట.

సమాజంలో అన్యాయానికి గురైన స్త్రీ ఎటువంటి సాధన చెయ్యాలో ఆమెకు ఎంత మనోనిబ్బరం కావాలో, తనని తాను నిలదొక్కుకోడానికి, నిరూపించుకోడానికి, తనకితానే గురువై ఏవిధంగా అభ్యాసం చెయ్యాలో శూర్పణఖ పాత్ర ద్వారా రచయిత్రి తెలియజేశారు. మరికొన్ని విషయాలను కూడ శూర్పణఖ పాత్రద్వారా ఈ విధంగా పలికించారు.

"తోటి పక్షులు ఏదో కారణాన పొడిచి పొడిచి ఈకలు పీకిన చిన్ని పక్షి నాలో కలిగించిన స్పందన ఎంత ప్రేమభరితమో అంత సౌందర్య పూరితమని గ్రహించడానికీ, ఆ స్పందనను పట్టుకుని అర్థం చేసుకోడానికీ నేను చేసిన సాధన అసామాన్యమైనది అంటుంది. అనగా నేటి సమాజంలో అనేక కారణాలవల్ల పురుషాధిక్య భావజాలానికి గురై, వారుచేసే అఘాయిత్యాలకి, అకృత్యాలకి, అంగవైకల్యం పొందుతున్న స్త్రీల జీవితాలకి, అద్దం పట్టే విధంగా రచయిత్రి ఈ పాత్రను చిత్రించారని చెప్పవచ్చు. ఈ కథలో శూర్పణఖ తన చేతులను ప్రేమించడం నేర్చుకుందట. ఆవిధంగా పది సంవత్సరాలు కఠోర దీక్ష చేసి, శ్రమ ఫలించాక ఆ తోటను పెంచిందట.

ఇక్కడ శూర్పణఖ తన ముఖ సౌందర్యాన్ని ఆరాధించడం మానుకుని, శ్రమచేసి, సృష్టించడం, సేవించడం చేయాలి అనగా ప్రతి స్త్రీ తనదైన మార్గాన్ని ఎంచుకుని, తనని తాను నిరూపించుకోవాలని శూర్పణఖ పాత్రద్వారా రచయిత్రి నేటి సమాజానికి తెలియజేశారు.

ఆ తరువాత సీత "నువ్వెంత అందంగా ఉన్నావు శూర్పణఖా నీ అందాన్ని ఏ పురుషుడూ గ్రహించలేకపోవచ్చు అంటుంది. అపుడు శూర్పణఖ పురుషులకు మాత్రం కళ్ళుండవా! మనసుండదా! కురూపులను చేయడం, వారిని అసహ్యించుకునే పురుషులు గాక వారిని ఆదరించేవారు కూడా ఉంటారని, అలాంటి పురుషుడి తోడు శూర్పణఖకు దొరికిందని అతని పేరు సుధీర అని చెబుతుంది.

సమాజంలో పురుషు లందరు ఒకే విధంగా ఉండరని, వారిలో మంచి వారు కూడ ఉంటారనే విషయాన్ని రచయిత్రి శూర్పణఖ పాత్రద్వారా పలికించారు. సమకాలీన సమాజంలో మంచి, చెడు రెండూ ఉంటాయనే విషయాన్ని కూడా రచయిత్రి ఈ పాత్ర ద్వారా తెలియజేశారు. ఈ కథలో రచయిత్రి సీత పాత్రను పరిస్థితులకు లోబడి జీవించే ఒక సామాన్య స్త్రీగా చిత్రించారు. సీతా శూర్పణఖల సంభాషణలో లవకుశుల ప్రస్తావన వస్తుంది. వారికి శ్రీరాముని కుమారులని తెలియదని సీత అంటుంది. 'తెలిశాక వారు అరణ్యంలో ఉంటారా' అని శూర్పణఖ అంటుంది. వారికి "అరణ్య వాసం ఇష్టమే" అని సీత అంటుంది. వారికి ఇష్టం కావచ్చు, కానీ రాజ్యానికి అరణమంటే ఏ ప్రేమ నగరాల అభివృద్ధి కోసం, నాగరికుల రక్షణ కోసం అరణ్య పుత్రులు తరలిపోక తప్పదేమో అని సీత అంటుంది.

పై వాక్యాలను రచయిత్రి రెండు అర్థాలు స్ఫురించేలా రాశారని చెప్పవచ్చు. ఒకటి రాజ్యాన్ని రక్షించే రాకుమారులు అరణ్యంలో ఎందుకుంటారు. రాజ్యాన్ని అభివృద్ధి పరచడానికి ప్రజల రక్షణకోసం, లవకుశులు అయోధ్యకు తరలి వెళతారు. రెండవది నగరాలను అభివృద్ధి చేయడానికి అరణ్యాలను మట్టు పెడుతున్నారని నాగరికుల రక్షణ కోసం అరణ్యంలో నివసించే గిరిజనులు, అరణ్యాన్ని వదిలి పోవలసిందే అనే భావన కూడ రచయిత్రి వ్యక్తపరిచారని చెప్పవచ్చు. ఏవిధంగా పరిస్థితులను ఎదుర్కొని జీవితాన్ని సార్థకం చేసుకోవాలో రచయిత్రి ఒక కొత్త కోణాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. శూర్పణఖ పాత్రద్వారా నేటి మహిళలకు అనగా నేటి సమాజంలో యాసిడ్ దాడులవంటి అఘాయిత్యాలకు గురైన స్త్రీలు ఆత్మ న్యూనతకులోనై, ఆత్మహత్యలు చేసుకోకుండ, ఆత్మస్థైర్యంతో తమదైన గమ్యాన్ని ఎంచుకుని, అభివృద్ధిని సాధించాలని రచయిత్రి ఈ కథ ద్వారా తెలియజేశారు. సమాజంలో భర్త అడుగుజాడల్లో నడిచే సీత వంటి స్త్రీలు కూడా ఉంటారని, సమయం వచ్చినపుడు అన్ని విషయాలపై అవగాహన ఏర్పరచుకుని తమ జీవితాన్ని సరైన మార్గంలో నడిపించుకుంటారనే ఆశాభావాన్ని రచయిత్రి వ్యక్తం చేశారు.

మృణ్మయనాదం

సీతారాముల కల్యాణమవుతుంది. అయోధ్య అంతా కోలాహలంగా ఉంది. రాముడు అహల్యను చూసినట్లు సీతతో చెబుతాడు. ఆమె సౌందర్యం మాటున సౌశీల్యం లేదని చాలా బాధకలిగిందని, కానీ ఆమెను మర్చిపోలేను అంటాడు. అప్పటి నుండి సీతలో ఉత్కంఠ నెలకొంది. కౌసల్య సామంతుల రాణులకు మా సీత భూపుత్రి అని పరిచయం చేస్తుంది. వారిలో ఒకామె “ఔనంట జనక మహారాజు అదృష్టం.” అందుకే అందంలో అహల్యను మించిపోయింది అంటుంది. అపుడు సీత “అహల్య ఎవరత్తయ్యా” అని అడుగుతుంది. అపుడు కౌసల్య “ గౌతమ మహర్షి భార్య తల్లీ, అపురూపమైన అందం అందానికి తగిన సౌశీల్యం, అయినా పాపం శాపగ్రస్త అయింది అంటుంది. సీత కౌసల్య ద్వారా జరిగినదంతా తెలుసుకుని కన్నీటి పర్యంతమవుతుంది. కౌసల్య సీత మనస్సు మరల్చడానికి మాట్లాడే చిలుక దగ్గరకు తీసికెళుతుంది. అది సీతను చూడగానే “సీత–వ్రాత, సీత–గీత, సీత– గీత అని విచిత్రంగా నవ్వుతుంది. సీతకు అహల్య గుర్తొచ్చి బాధపడుతుంది. సీతారాములు అరణ్యవాసానికి వెళ్ళిన తరువాత అహల్యను కలుస్తుంది. సీత అహల్య మధ్య జరిగిన సంభాషణను రచయిత్రి ఒక కొత్త కోణంలో ఆవిష్కరింప జేసింది. సీత సత్యమేంటని అహల్యను అడుగుతుంది. అప్పుడు అహల్య ఈ విధంగా చెబుతుంది. ఇంద్రుడు

నన్ను వాంఛించాడు. స్త్రీ, పురుషుల భోగ్య వస్తువు, అందరూ అనుకున్నట్లే అతనూ అనుకున్నాడు. నేను అతనికి లోబడనని చీకటిలో నా భర్త వేషంలో వచ్చాడు. అతను నా భర్త కాదని నేను గుర్తించానా లేదా! లోకంలో అనేక మందిని వేధించే ప్రశ్న. ఆమె భర్తకు మాత్రం అవేవి అవసరంలేదు. ఆయన వస్తువు తాత్కాలికంగా పరుల హస్తగతమైంది. మైలపడింది. అనుకుంటాడు.

ఇక్కడ అహల్య ప్రమేయం లేకుండ జరిగిన తప్పుకు ఆమె శిక్షింపబడినట్లు రచయిత్రి చిత్రించారు. సమాజంలో భిన్న మనస్తత్వాలు గల వ్యక్తులుంటారు. వారందరిని ఈ కథలో చిత్రించే ప్రయత్నం రచయిత్రి చేశారు. బ్రహ్మవర్గంలో ఉండే మైల, శౌచం, పవిత్రం, అపవిత్రం, శీలం, పతనం, మొదలైన పదాలను, ఆ వర్గంలో పురుష సమాజం సత్యా సత్య విచక్షణ లేకుండా ఆచరిస్తారని రచయిత్రి అహల్య పాత్ర ద్వారా పలికించారు. అంతేగాక సీత అడవులకు ఎందుకొచ్చిందో అహల్య అడిగి మగవాళ్లందరూ ఒకటే సీతా ముఖ్యంగా భార్యల విషయంలో అంటుంది. అపుడు "సీత నా భర్త అలాంటివాడు కాదు. సత్యా సత్యాలు విచారిస్తాడు." అంటుంది. "విచారిస్తాడు కదా" అని అహల్య వ్యంగ్యంగా అంటుంది. ఆ సమయంలో సీతకు ఆ మాటలు నచ్చలేదు. తన భర్త విచారణ జరిపిస్తాడని అహల్యతో సీత అంటుంది. అపనమ్మకమున్న వాళ్ళే విచారణ జరిపిస్తారు అని అహల్య అంటుంది. ఆ విషయంలో సీతముఖం వివర్ణమవుతుంది. సీతతో రాముడు అహల్య శీలవతి కాదు అంటాడు. సీతకు ఆ మాటలు గుర్తుకు వస్తాయి. అపుడు అహల్య సీతతో ఈ విధంగా అంటుంది.

"నాలా మాట్లాడే స్త్రీలను భరించడం కష్టం సీతా నేను తప్పుచేశానని, ఒప్పుకుంటే భరిస్తారు. పాపానికో ప్రాయశ్చిత్తం ఉంటుంది. తప్పు చేయలేదని వాదిస్తే నా మీద జాలిపడతారు. అన్యాయంగా దోషం ఆరోపించారని నా పక్షం వహిస్తారు. కానీ నా తప్పొప్పులతో నీకేమిటి సంబంధం. అది విచారించే హక్కు అధికారం మీ కెవరిచ్చారంటే మాత్రం ఎవరు సహించరు."

ఇక్కడ రచయిత్రి సమకాలీన సమాజంలోని వ్యక్తుల మనస్తత్వాలను అహల్య పాత్రద్వారా పలికించారు. మనుషులు ఏయే సందర్భాలలో ఏవిధంగా ప్రవర్తిస్తారో ప్రస్ఫుటంగా వివరించారు. అహల్య తన మీద హక్కుని గౌతమ మహర్షికి లోకమిచ్చింది గానీ నేనివ్వలేదు. నేనివ్వనంత వరకు నామీద అధికారాన్ని ఎవరు పొందలేరు అంటుంది. సీత కూడ తన ఉనికిని కోల్పోయేంత అధికారాన్ని భర్తకు ఇవ్వ వద్దు

అని అహల్య సూచిస్తుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రచయిత్రి సమాజంలోని స్త్రీలందరూ తమ ఉనికిని కోల్పోయేటంత అధికారాన్ని భర్తకు ఇవ్వరాదనే సూచన అహల్య పాత్ర ద్వారా చేశారు. అంతేగాక సీత అహల్య శిలలా నిర్జీవంగా బ్రతకడాన్ని ప్రశ్నిస్తుంది. అప్పుడు అహల్య ఇన్నేళ్ళూ విశ్వంలో తన అస్తిత్వాన్ని గురించి ఆలోచిస్తున్నానని, ప్రపంచం ఏ నీతులమీద, ధర్మాలమీద నడుస్తుందో వాటికి మూల మేమిటో తెలుసుకుని, తాను జ్ఞానాన్ని సంపాదించా నంటుంది. సీత లోకంలో సత్యా సత్యాలు లేవనడం అజ్ఞానమని వ్యంగ్యంగా అంటుంది. అపుడు సత్యం ఎప్పుడూ ఒక్కలాగే ఉండదని నిరంతరం మారుతూ ఉంటుందనీ తెలుసుకోడమే నేను సంపాదించిన జ్ఞానం. అని అహల్య అంటుంది.

పై వాక్యాలలో రచయిత్రి సమకాలీన పరిణామ క్రమాన్ని తెలియజేశారు. సత్యమనేది ఎపుడూ ఒకలా ఉండదని కాల గమనాన్నిబట్టి జరిగిన సంఘటన, వ్యక్తుల స్వభావం సామాజిక పరిస్థితులు మొదలైన విషయాలను బట్టి అది మారుతుంటుందని ఈకథలో అహల్య పాత్ర ద్వారా రచయిత్రి తెలియజేశారు.

రాముడు రావణుని సంహరించి లంకా పట్టణాన్ని జయించిన తరువాత లక్ష్మణుడు సీత వద్దకు వచ్చి "శ్రీరాముడు నీ శీలపరీక్ష కోరుతున్నాడమ్మా" అని అంటాడు. ఆమె ఆ మాటలు వింటూనే నేల మీద కూలబడుతుంది. అంతే గాక "శ్రీరామచంద్రుని కేమీ సందేహం లేదు వదినా కేవలం ప్రజలకోసమే ఈ ఆలోచన. విచారణలో న్యాయమే గెలుస్తుంది. సత్యమే జయిస్తుంది. పరీక్షలో నిలిచి గెలిచిన మీ సౌశీల్యాన్ని అందరూ కొనియాడుతారు. రామచంద్రుడు మీతో ఈ మాటలు చెప్పమన్నాడమ్మా" అంటాడు లక్ష్మణుడు. ఆ సమయంలో సీతకు అహల్య మాటలు గుర్తుకు వస్తాయి. అహల్య మగవాళ్ళందరూ ఒకటే అన్నపుడు సీత అంగీకరించలేదు. రాముడుకి తన మీద అపనమ్మకమా! అలా అయితే తనను పరత్యజించవచ్చు కదా! అని సీత అనుకుంటుంది. సీత మనసు అగ్నిపర్వతంలా రగులుతుంది. "అన్నగారిని అపార్థం చేసుకోకమ్మా. రేపు మీ గురించి ఎవరూ ఏమీ అనకుండా జాగ్రత్త తల్లీ. అయోధ్యా నగరానికి మీరు నిప్పులా నడిచి వెళ్లాలమ్మా. అన్నగారెంత బాధపడుతున్నారో, విలపిస్తున్నారో, మీరూహించ లేరమ్మా ఆయన నిస్సహాయుడమ్మా" అని విధంగా లక్ష్మణుడు రాముడి బాధ గురించి చెబుతున్న కొద్దీ సీత మనసులో బాధ తగ్గుతుంది. "శౌచం, మైల, పవిత్రం, అపవిత్రం, శీలం, పతనం మొదలైన పదాల ముందు రామాయణం, బ్రహ్మాస్త్రం కూడా బలహీనపడ్డాయని సీత

అనుకుంటుంది. "ఎవరి సత్యం వారిది సత్యా సత్యాలను నిర్ణయించగల శక్తి ఈ లోకంలో ఎవరికైనా ఉందా! ఎన్నడూ విచారణకు అంగీకరించకు సీతా" అన్న అహల్య మాటలు అయోధ్యకు వచ్చిన తరువాత కూడా సీతకు గుర్తుకొస్తున్నాయి. కౌసల్య సీతను హృదయానికి హత్తుకుని "నా కోడలు శీలవతి" అంటుంది. అంటే అత్తగారు తన శీల పరీక్షను కోరుకుందా! అన్న సందేహం సీతకు కలుగుతుంది.

సమాజంలో ఏదో ఒక అపవాదు మోస్తున్న స్త్రీలందరికి ఒక సూచనచేసి వారిలో ఆత్మస్థైర్యం నింపే ప్రయత్నం చేశారు ఓల్గా. సమకాలీన సమాజంలో జీవనం గడిపే వారికి అహల్య పాత్రతో రచయిత్రి పలికించిన వాక్యాలు జీవన గమ్యాలు. సమాజంలో ఎవరు ఏమనుకున్నాసరే యదార్థమేమిటనేది గాయపడిన వారికి మాత్రమే తెలుసు. కాబట్టి ఎన్నడూ విచారణకు అంగీకరించ వద్దని రచయిత్రి సూచించారు. పురుషాధిక్య భావజాలం గల సమాజంలో పురుషుడుకి లేని శీల పరీక్ష స్త్రీ ఎదుర్కొంటుంది. అటువంటి పరిస్థితులను ఎదిరించే ధైర్యం స్త్రీలో కలిగేలా రచయిత్రి ఈ కథను తీర్చిదిద్దారు.

సీత గర్భవతి అయిన తరువాత అహల్యను కలవాలని అనుకుంటుంది. ఆమె తనకు అరణ్య విహారం చేయాలని ఉందని రామునితో చెబుతుంది. ఆ తరువాత సీత వాల్మీకి ఆశ్రమంలో విడువబడుతుంది. వాల్మీకి ఆశ్రమంలో సీతను అందరూ కంటికి రెప్పలా కాపాడుతారు. ఒకరోజు వాల్మీకి నీకేమైనా కావాలంటే చెప్పమని సీతను అడుగుతాడు. ఆమె అహల్యను చూడాలని ఉందని చెబుతుంది. అహల్య వాల్మీకి ఆశ్రమానికి వస్తుంది. అప్పుడు సీత అహల్య ఒడిలో తలపెట్టుకుని వెక్కి, వెక్కి ఏడుస్తుంది. అహల్య సీతను ఓదారుస్తుంది. రావణ సంహారం తరువాత సీత మనస్సు గడ్డ కట్టిందని, అది అహల్య స్నేహ స్పర్శతో కరిగి పోయిందని, ఆమె మనస్సు పూర్వం వలె మెత్తగా మారిందని అంటుంది. ఆమెకు సత్యా సత్యాలకు అర్థం తెలిసిందని, అంతే గాక అమె రాముడి కోసమే విచారణకు సిద్ధపడినట్లు చెబుతుంది.

ఆ సమయంలో అహల్య ఈ విధంగా చెబుతుంది. పురుషుల అహం ఆస్తులలో, ప్రతాపాలలో, విద్యలో, కులగోత్రాలలో ఉంటే, స్త్రీల అహం పాతివ్రత్యంలో, మాతృత్వంలో ఉంటుంది. ఆ అహంకారాన్ని దాటాలని వారికెవరు చెప్పరు. విశాల ప్రపంచంలో తాము భాగమని వారు గుర్తించరు. ఒక వ్యక్తికి, ఒక ఇంటికి, ఒక వంశానికి పరిమిత మవుతారు. అహాన్ని జయించడం, పురుషులకు ఆధ్యాత్మిక

గమ్యమవుతుంది. అహాన్ని పెంచుకోడం, ఆ అహంలోనే కాలి బూడిదై పోవడం, స్త్రీల గమ్యమవుతుంది. (సీతా నువ్వెవరో, నీ జీవిత గమ్యమేమిటో, తెలుసుకోవడానికి ప్రయత్నించు. అది అంత తేలికకాదు. ప్రయత్నం ఆపకు చివరకు తెలుసుకుంటావు. నీకా శక్తి ఉంది. శ్రీరామచంద్రుడిని కాపాడ గలిగిన దానివి నిన్ను నువ్వు కాపాడు కోలేవా! ఇదంతా ఎందుకు జరిగిందని విచారించకు ఇది నీ మంచి కోసమే నిన్ను తెలుసుకునే క్రమంలో భాగంగానే జరిగింది. ఆనందంగా ఉండు. ఈ ప్రకృతిని, సకల జీవరాశి పరిణామక్రమాన్ని పరిశీలించు. అందులో నిరంతరం జరిగే మార్పుని గమనించు. అరణ్యంలో ఆశ్రమాలే కాదు. అనేక జాతుల ప్రజలున్నారు. వాళ్ళ జీవితాలు గమనించు. ఈ మొత్తం ప్రపంచంలో నువ్వున్నావు. ఒక్క రామునికే కాదు.)

సమాజంలో స్త్రీ పురుషులు ఏ విధమైన జీవనం సాగిస్తున్నారో రచయిత్రి తెలియజేశారు. పురుషులు పై వర్గం, ఆస్తి, ప్రతాపం, విద్య మొదలైన విషయాలలో అహంభావంతో ఉంటారు. వారు ఆధ్యాత్మిక మార్గాన్ని అవలంబించి, దాని నుండి బయట పడతారు. స్త్రీలు పతివ్రతల మని, సంతానవతుల మని అహం కలిగి దానినుండి బయటపడే ప్రయత్నం చేయరు. ఇక్కడ ఓల్గా స్త్రీలలో ఉండే లోపాలను ఎత్తిచూపే ప్రయత్నం చేశారు. అంతేగాక ప్రకృతిలో ఉండే జీవరాశుల పరిణామ క్రమం, అరణ్యంలో నివసించే, అనేక మంది జీవన పరిణామ క్రమం, గమనించి స్త్రీలు తమ చుట్టూ ఉన్న ప్రపంచంలో తమ ఉనికిని చాటుకుంటూ, ప్రకృతిలో మమేకమై, స్వతంత్రంగా జీవించమని సూచిస్తుంది.

ఈ కథలో అహల్య మాటలు సీతకు మృణ్మయ నాదంలా వినబడతాయి. ఆ తరువాత సీత తన విషయంలో జరిగిన సత్యాన్ని అహల్య చెబుతానన్నా వద్దంటుంది. ఇక్కడ సీత ఏ తప్పు చేయక పోయినా అగ్నిపరీక్షకు గురైంది. అదే ఆమెకు కనువిప్పు కలిగించింది. సీత మొదట్లో అహల్యను కలిసినపుడు, ఆమె తప్పు చేసిందేమో అని సందేహపడేది. రాముడు ఆమెను అగ్ని పరీక్షకు గురిచేసి, మరల వాల్మీకి ఆశ్రమంలో వదిలిన తరువాత సందేహ పడడంలేదు.

సమకాలీన సమాజంలోని వ్యక్తుల స్వభావం ఈ కథలో వ్యక్తమవుతుంది. తమపై నింద పడినపుడు వ్యక్తులు ఏవిధంగా ఆలోచిస్తారు. అంతకు ముందు వారి ఆలోచనా విధానం, ఏ విధంగా ఉంటుంది అనే విషయం, ఈ కథలోని సీత పాత్ర ద్వారా రచయిత్రి తెలియజేశారు. ముగింపులో సీత తన పుత్రులను రామునికి

అప్పగించి, రాముని ఆహ్వానాన్ని తిరస్కరించి ఈ విశ్వమంతా తనదే అంటుంది. ఈ కథలో రచయిత్రి సీత వంటి స్త్రీలందరిలో ఆత్మస్థైర్యాన్ని నింపే ప్రయత్నం చేశారు. ఎటువంటి పరిస్థితులలోను తమ వ్యక్తిత్వాన్ని కోల్పోకూడదని, ఒక గమ్యం ఏర్పరచుకుని దాన్ని చేరే ప్రయత్నం చేయాలని, చేరుకోవాలని సూచించారు.

సైకత కుంభం

సైకత కుంభం అనగా ఇసుకతో చేసిన కుండ. ఈ కథలో సీత రేణుకను కలుస్తుంది. సీత రామునితో కలిసి ఉన్నపుడు, ఆమెకు రేణుక మాటలు నచ్చవు. "ఆర్య ధర్మాలను అరణ్యాలలో కూడా విస్తరించడానికి బయలుదేరిన రాముడి భార్యవా" అంటుంది రేణుక. "పితృవాక్య పరిపాలన కోసం ఆయన అరణ్యాలకు వచ్చారు." అంటుంది సీత. అదికూడా ఆర్య సంస్కృతిలో భాగమేలే, తండ్రి చెప్పింది న్యాయమా అన్యాయమా అని ఆలోచించకుండా గుడ్డిగా పాలించడమే ఆర్య ధర్మం. నా కుమారుడు అదే చేశాడు. ఆ పనే తాను చేస్తానని, దేశంలోని ఇతర జాతులలో కూడా అదే ఆర్య ధర్మం స్థాపిస్తాననీ నీ భర్త నా కుమారుడికి వాగ్ధానం చేశాడు అని రేణుక అంటుంది. తర్వాత రేణుక సీతాదేవిని తన ఆశ్రమానికి రమ్మని ఆహ్వానిస్తుంది. సీత ఆమె ఆహ్వానాన్ని తిరస్కరిస్తుంది. మరొకసారి రాముని అనుమతి తీసుకుని వస్తానని చెబుతుంది. ఆశ్రమానికి రావడానికి నీ భర్త అంగీకరించడని రేణుక సీతతో అంటుంది. 'మీ భర్త, మీ కుమారుడు మీకు అన్యాయం చేసి ఉండవచ్చు. అంత మాత్రాన అందరూ అలాంటి వారేనని అనుకోవడం న్యాయం కాదు. నేనింకోసారి మీ ఆశ్రమానికి వస్తాను'. అని సీత రేణుకకు నమస్కరించి వెళ్ళిపోతుంది. ఆ తరువాత సీత రాముని అనుమతి తీసుకుని రేణుకాదేవి శిల్పాలయానికి వెళు తుంది. అపుడు రేణుకాదేవి సీతకు సైకత కుంభాన్ని ఇస్తుంది. అది ఇసుకతో చేసిందని ఆ విద్య తనకొక్కదానికే తెలుసునని, ఆ కుండ ప్రతి స్త్రీ దగ్గర ఉండాలని, తమ పాతివ్రత్యాలు సైకత కుంభాల వంటివేనని తెలుసుకుంటే వాళ్ళు నిశ్చింతగా బతక గలుగుతారు, అని రేణుక అంటుంది. ఆ మాటలు సీతకు అర్థం కాలేదు.

"ఈ కుండ చేయడానికి ఎంతో ఏకాగ్రత కావాలి. నా ఏకాగ్రత గురించి తెలియని వాళ్ళంతా నా పాతివ్రత్యంతో ఇసుక కుండ తయారు చేస్తున్నాను అనుకున్నారు. నా పాతివ్రత్యానికేమి లోపం లేదు. కనుక అనుకోనివ్వమని నేను ఊరుకున్నాను. ఏకాగ్రత ఎప్పుడైనా భగ్నం కావచ్చు. నా విషయంలో ఒక పురుషుడు కారణమయ్యాడు. ఆ పురుషుని చూసినంత మాత్రానే నా పాతివ్రత్యం భంగపడిందని

భర్త ఆగ్రహించాడు. కుండ చక్కగా చేయడానికి సాధన, ఏకాగ్రత, ఇసుక దానిలో కలిసిన నీటిపాళ్ళు, ఇంకా ఎన్నో కారణాలుంటాయి. అది గ్రహించలేని, మహాజ్ఞాని జమదగ్ని మహర్షి. తపస్సు ద్వారా ఎంత జ్ఞానం సంపాదించినా భార్య పాతివ్రత్యం పట్టువదలని ముముక్షువులు" ఈ విధంగా రేణుక సీతకు తన కథను చెబుతుంది. ఆమె దృష్టిలో "పాతివ్రత్యం, మాతృత్వం, ఏకాగ్రతతో నేర్చిన ఆమె విద్య మూడు ఒక్కటే అంటుంది. సృష్టిలోని అనేక జీవరాశులు కొన్నితెగల ప్రజల ఆచారాల గురించి రేణుక సీతతో చెబుతుంది. అపుడు సీతనే మాటలు నాకు అర్థం కావడం లేదు. అవి స్త్రీలకు హాని చేస్తాయని అనిపిస్తుంది, అంటుంది.

అప్పుడు రేణుకాదేవి "హాని మాత్రం చేయవు సీతా, బిడ్డ తల్లికి చెందడంలో వాళ్ళకి హానేమీ ఉండదు. బిడ్డలు తమ తండ్రి ఎవరని ప్రశ్నించే సందర్భం, భర్త నీ పిల్లకు తండ్రెవరని ప్రశ్నించే సందర్భం కొందరి స్త్రీల జీవితాలలో వస్తుంది సీతా. అప్పటి వాళ్ళ స్థితి తలుచుకో" నామాటలు నీకు అర్థమవుతాయి, అంటుంది. వారిద్దరి మధ్య చర్చ జరుగుతుండగా సీత కాలు తగిలి ఇసుక కుండ పగిలిపోతుంది. ఆ సంఘటనతో సీత భయపడుతుంది. "నీకెంతో బలముంది సీతా నా మాట మర్చిపోకు, నీ బలమే నీకు రక్ష అలాగని నేను ఆశీర్వదిస్తున్నాను." సీతకు ఇదంతా ఆమె వాల్మీకి ఆశ్రమానికి వెళ్ళిన తరువాత గుర్తొస్తుంది. లవకుశులు తల్లిని తమ తండ్రి గురించి అడుగుతారు. సీత కుమారులకు విలువిద్య నేర్పుతుంది. నీవు నేర్పాల్సినది నేర్పి తరువాత తండ్రి వచ్చి మిగిలినది నేర్పుతాడా అని తల్లిని కుమారులు అడుగుతారు. అపుడు సీత "నేను నేర్పాల్సిందంతా నేర్పితే మీ తండ్రి నేర్పడానికి ఏమీ ఉండదు" అంటుంది. అంతేగాక శివధనుస్సు సీతారాములిద్దరూ సంధించ గలరన్న విషయం కూడా చెబుతుంది. సీత తన కుమారులను ప్రకృతి ప్రసాదించిన లేడి పిల్లలుగానే పెంచింది. పెరిగి పెద్దయిన లేడిపిల్లలు కొన్నాళ్ళకు అడవిలోకి వెళ్ళి మళ్ళీరావు అనుకుంటుంది. ఆమె వాల్మీకి మహర్షితో లవకుశులను అయోధ్యకు పంపిస్తుంది. అపుడు ఆమెకు రేణుక గుర్తొస్తుంది. అహల్య, రేణుక, ఆమె అందరూ అనుమానితులే, అనుకుంటుంది. వాల్మీకి ఆశ్రమానికి వస్తాడు. రాముడు తన కుమారులను స్వీకరించిన సంగతి చెబుతాడు. ఆ తరువాత "అమ్మా రాముడు నిన్ను సభకు వచ్చి సభికులందరి ముందూ సత్యం పలకమన్నాడు. ఆ పై నీవిక పట్టమహిషివి, తర్వాత వీరమాతవు" అంటాడు. సీతకు నవ్వొస్తుంది. కాని వాల్మీకి మీద గౌరవంతో నవ్వదు. "నాకంత అవసర ముందంటారా" అంటుంది. ఆశ్రమం నుండి నిష్క్రమిస్తుంది. లవకుశలు వచ్చి తల్లి లేకపోవడం చూసి ఆశ్చర్యపోతారు. వారు వాల్మీకి ద్వారా జరిగింది

తెలుసుకుంటారు. వారికి తల్లి మీద కోపం వస్తుంది. తండ్రి చెప్పినట్టు ఒక్కసారి నిండు సభలో మాట్లాడి తన నిర్దోషిత్వాన్ని నిరూపించు కోవచ్చు కదా! అనుకుంటారు. ఎందుకంటే ఇప్పుడు వారు ఆర్యపుత్రులు.

ఈ కథలో రేణుక, సీతల పాతివ్రత్యం గురించి, ఆర్యపుత్రుల ప్రవర్తన గురించి చర్చించబడింది. స్త్రీల పాతివ్రత్యం సైకత కుంభం వంటిదని రచయిత్రి తెలియజేశారు. స్త్రీకి భర్త తప్ప వేరే ప్రపంచం ఉండదని సీత భావిస్తుంది. ఈ కథలో సీత అబలగాను, రేణుక సబలగాను చిత్రించబడింది. రేణుక పాత్ర ద్వారా రచయిత్రి సమకాలీన సమాజంలో కొంత మంది స్త్రీలు భర్తే ప్రపంచం అనుకుంటారు. ఏదో ఒకరోజు భర్త ప్రపంచంలో ఆమెకు చోటులేదని తెలుస్తుంది. అపుడు సంతానానికి జన్మనివ్వడమే జీవిత గమ్యంగా భావిస్తారు. ఆ తరువాత వారు తండ్రి ఆధీనంలోకి వెళ్ళి, అతని ఆజ్ఞను అనుసరిస్తారు. ఈ కథలో లవకుశులకు సీత వారి తండ్రి మహావీరుడని, మహాకార్యంలో నిమగ్నమై ఉన్నాడని అసత్యం చెబుతుంది. ప్రతి స్త్రీ తనభర్త గురించి తన సంతానానికి గొప్పగా చెబుతుంది. భర్త భార్యను ఎంత వివక్షకు గురిచేసిన, ఆమె, అతణ్ణి తన సంతానం ముందు ఉన్నతంగా ఆవిష్కరిస్తుంది.

ఈ కథలో సీతని రాముడు సభలో తనని తాను నిరూపించు కోమంటాడు. లవకుశులు కూడా అదే కోరుకుంటారు. సమాజంలో ఉన్న పురుషాధిక్య భావజాలం ఈ కథలోని పురుష పాత్రలవల్ల వ్యక్తమవుతుంది. సమాజంలో స్త్రీ తనని తాను నిరూపించు కోవాలని అపుడే ఆమెకు, సమాజంలో గౌరవం దక్కుతుందని రచయిత్రి రాశారు. ఇక్కడ సమకాలీన సామాజిక పరిస్థితులు ప్రతిబింబించేలా రచయిత్రి ఈ కథను తీర్చిదిద్దారు. అంతేగాక ఈ కథలోని సీత పాత్ర వలె, సమాజంలో ఉన్న ప్రతి స్త్రీ స్వతంత్రంగా ఆలోచించి, తనదైన మార్గాన్ని ఎంచుకోవాలని పురుషాధిక్య భావజాలానికి లొంగి పోకుండ, ధైర్యంగా జీవించాలని రచయిత్రి ఈ కథ ద్వారా తెలియజేశారు.

విముక్త

సీతారాములు పద్నాలుగేళ్లు వనవాసం పూర్తి చేసుకుని అయోధ్యకు వస్తారు. సీత తన చెల్లెలు ఊర్మిళ కోసం వెతుకుతుంది. ఆమె ఊర్మిళ గురించి శ్రుతకీర్తిని అడుగుతుంది. అపుడామె "మీరు వెళ్ళాక ఊర్మిళ ఎవరికీ కన్పించలేదు. తన మందిరం లోంచి బైటికి రాలేదు. ఎవరినీ లోపలకు రానివ్వలేదు" అంటుంది. ఊర్మిళ పద్నాలుగేళ్లు ఎవరినీ చూడకుండా ఎలా ఉండ కలిగింది. ఆమె రామలక్ష్మణులను,

తననూ క్షమిస్తుందా! అని సీత అనుకుంటుంది. చారుమతితో కలసి సీత ఊర్మిళ మందిరానికి వెళుతుంది.

అరణ్య వాసంలో లక్ష్మణుడితో పాటు ఊర్మిళ కూడా ఉంటే బాగుండునని సీత అనుకుంటుంది. వారి కోసం లక్ష్మణుడు ఊర్మిళను ఒంటరిగా వదిలి రావడం సమంజసమా అని సీత తనను తాను ప్రశ్నించుకుంటుంది. అదే విషయాన్ని రాముడి దగ్గర ప్రస్తావిస్తుంది. అంతఃపుర వ్యవహారాలను చక్కదిద్దే సామర్థ్యం సీత కంటే ఊర్మిళకే ఉందని, అందువల్ల ఊర్మిళ అరణ్యానికి రాలేదని రాముడు సీతతో చెబుతాడు.

భర్త వియోగం అన్నింటి కంటే కష్టమని రావణుని చెర తరువాత సీతకు అర్థమైంది. ఆ సమయంలో సీత ప్రతి క్షణం ఊర్మిళను గుర్తుచేసుకుంటుంది. అయోధ్యకు చేరిన తరువాత సీత ఊర్మిళ ఆనందాన్ని ఊహించుకుంటూ ఉంటుంది. ఆ ఆనందంలో రాముడు కూడా పాలు పంచుకుంటాడు. రాముడి కోసం భార్య వియోగం సహించిన తమ్ముణ్ణి చూసి, రాముని హృదయం ఉప్పొంగి పోతుంది. వెంటనే రాముడు లక్ష్మణుని హృదయానికి హత్తుకుంటాడు.

ఊర్మిళ ఎదురు వస్తుందని, హృదయానికి హత్తుకోవాలని సీత భావిస్తుంది. కాని ఊర్మిళ ఎదురుపడలేదు. సీత నిరాశకు గురవుతుంది. సీత ఊర్మిళ వద్దకు వెళ్ళినపుడు, ఆమె ముఖంలో తేజస్సును గమనిస్తుంది. "మా మీద కోపం వచ్చిందా! అని అంటుంది. అసలేం జరిగింది. ఈ విధంగా గదిలో బందీవయ్యావు అంటుంది. ఊర్మిళ తన ఒంటరి తనం సీతకు తప్ప ఎవరికీ అర్థంకాదని భావిస్తుంది. నా భర్త నాతో ఒక్క మాట చెప్పకుండా, నా నిర్ణయంతో ప్రమేయం లేకుండా, నేననేదాన్ని ఒకదానిని ఉన్నాననే ఆలోచన లేకుండా, అన్నగారే సర్వస్వమని వెళ్ళిపోయాడు. ఆనాడు కోపంతో దహించుకుపోయాను. ఈ అంతఃపురాన్ని నా తిరుగుబాటుతో తల్లక్రిందులు చేయాలని అనుకున్నాను. అని ఊర్మిళ సీతతో అంటుంది.

ఆ సమయంలో సీత మనస్సు ఊర్మిళను పట్టుకునే ప్రయత్నం చేస్తుంది. అప్పుడు ఊర్మిళ సీతతో అంటుంది. ఊర్మిళ మొదట్లో ఆగ్రహంతో ఉన్నానని, క్రమంగా ఆ కోపం సత్యం కోసం నాతో నేను చేసే అన్వేషణగా మారిందని, కోపం, దుఃఖం, ఆనందం ఎందుకు? ఆమె శరీరానికి, ఆమెలో కలిగే ఈ ఆవేశాలకు, ఉద్వేగాలకు, మధ్య ఉన్న సంబంధం ఏమిటి? ప్రశ్నలు తనలో లీనమయ్యాయి. అమె తన శరీరాన్ని గమనించడం, తనలో ఆలోచనలు, అవి తనలో రేకెత్తించే ఉద్రేకాన్ని గమనింటడం తో మొదలు పెడుతుంది. ఈ గమనికకు ఎలాంటి

అంతరాయం కలిగినా ఆమెకు అశాంతిగా ఉండేదని, అందుకే ఆమె తనతో తాను సంభాషించుకునేది.

ఇది ప్రతి మనిషి జీవితానికి సంబంధించిన అన్వేషణ. ఊర్మిళ తన అక్క అయిన సీతను ప్రేమిస్తుంది. ఆమె తనను వదిలి అరణ్యానికి వెళ్ళిపోతుంది. అలాగే ప్రతి మనిషితో తనకున్న సంబంధాన్ని చర్చించుకుంటుంది. ఆమెకు ఆమే వేసుకున్న ప్రశ్నలతో, ఆమె చేసిన యుద్ధంవల్ల ఒక గొప్ప శాంతిని, ఆనందాన్ని పొంద కలిగింది. రామ లక్ష్మణులు రాక్షసులతో యుద్ధం చేయడం వల్ల శాంతి లభించిందో లేదో తెలియదుగాని, ఊర్మిళ తనతో తాను చేసిన యుద్ధంలో మాత్రం శాంతిని పొంద గలిగానని సీతతో చెబుతుంది.

లక్ష్మణునికి ఊర్మిళ మీద ప్రేమ ఉందని చెప్పినపుడు, ఊర్మిళ తాను చాలా మారానని చెబుతుంది. తనలో వచ్చిన మార్పుకు లక్ష్మణుడు ఇచ్చే విలువను బట్టే వారిద్దరి జీవిత గమనం సాగుతుందని అంటుంది. ఆమె ద్వేషంతో కాకుండా న్యాయం గురించి ప్రశ్నించగల విజ్ఞతను సంపాదించుకున్నట్లు, లక్ష్మణుడు ఆ విజ్ఞతను, ఎలా అర్థం చేసుకుంటాడు, ఏ విధంగా గౌరవిస్తాడు, అనే దానిపై ఆధారపడి ఉంటుందని, ఊర్మిళ సీతతో అంటుంది. ఆమె పద్నాలుగేళ్లు సత్య శోధనలోనే చేసిన గొప్ప తపస్సును నిద్ర అనుకున్న వాళ్ళకు ఆమె మాటలు అర్థం కావంటుంది. ఊర్మిళ నిద్రపోయిందని భావించే వారికి నిద్రకు మెలకువకూ అర్థం తెలియదంటుంది. ఆవిధంగా భావించేవారు, శాంతిగా నిద్రపోరు, చైతన్యంగా మేలుకోరు అంటుంది. ఆమె మాటలను అర్థం చేసుకోగల సామర్థ్యం సీతకు మాత్రమే ఉంది అంటుంది. సీత జీవితంలో ఊర్మిళకు ఎదురైన పరీక్ష సమయం ఎదురైతే, ద్వేషంతో, ఆగ్రహంతో దహించుకు పోకుండా, ఆమెను ఆమె కాపాడు కోమంటుంది. సీతమీద అధికారాన్ని సీతను తీసుకోమంటుంది. ఇతరులపై అధికారాన్ని ఒదులు కోమంటుంది. అప్పుడే నీకు నువ్వు చెందుతావు. నీకు నువ్వు దక్కుతావు అని చెబుతుంది. ఎవరికి వారు మిగలడమంటే మాటలు కాదంటుంది. తన మాటను నమ్మమని కూడా ఊర్మిళ సీతతో అంటుంది.

రాముడు అశ్వమేధ యాగం చేస్తున్న సమయంలో కూడా సీతకు ఊర్మిళ మాటలు గుర్తుకు వస్తాయి."అధికారాన్ని తీసుకో, అధికారాన్ని ఒదులుకో అపుడు నీకు నువ్వు చెందుతావు. నీకు నువ్వు దక్కుతావు. మనకు మనం మిగలాలి."

పై వాక్యాలు సమాజంలో ప్రతి స్త్రీ గుర్తుబెట్టు కోవలసినవి. సహజంగా కుటుంబంలో స్త్రీలు ఇతరుల మీద అధికారాన్ని చలాయిస్తూ ఉంటారు. వారి గురించి వారు తెలుసుకునే ప్రయత్నం చేయరు, అటువంటి వారు ఎవరి మీద వారు అధికారాన్ని సంపాదించుకుని, నిగ్రహాన్ని కలిగి ఉండాలి. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కో గల సామర్థ్యం కలిగి ఉండాలి. అనే విషయాన్ని సమకాలీన సమాజంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్న స్త్రీలకు ఓల్గా తెలియజేసింది.

రాముడు యాగం చేస్తున్న సమయంలో ఊర్మిళ, సీత వద్దకు వస్తుంది. నేను లేకుండా రాముడు యాగం ఎలా చేస్తున్నాడని ఊర్మిళ తో సీత అంటుంది. అపుడు ఊర్మిళ "ఆ ప్రశ్న నీకెందుకు రావాలి, వస్తే రాముడికి రావాలి. యాగం చేయించే వారికి రావాలి. అనవసరమైన ప్రశ్నలతో అశాంతి పడడం అవివేకం కాదా!" అంటుంది.

"నేను నీకు సమాధానం చెప్పి నీ అగ్నిని తాత్కాలికంగా చల్లార్చడానికో మరింత ప్రజ్వలింప చేయడానికో రాలేదు. అనవసరమైన ప్రశ్నలతో నిన్ను, నువ్వు హింసించుకో వద్దని చెప్పడానికి వచ్చాను." అని ఊర్మిళ సీతకు చెబుతుంది.

కానీ నేను మింగలేక పోతున్నానని సీత అంటుంది. మింగవద్దు, అసలది నీ మనస్సులో ప్రవేశించనే వద్దు, నువ్వు రాముడి నుండి విముక్త కావాలి అని ఊర్మిళ సీతకు హితబోధ చేస్తుంది.

"ప్రతి పరీక్ష నిన్ను రాముడి నుండి విముక్త చెయ్యడానికే, నిన్ను నీకు దక్కించడానికే, యుద్ధం చెయ్యి, తపస్సు చెయ్యి, లోపలికి చూడు, నీవనే యదార్థం కనబడేదాకా చూడు." అని ఊర్మిళ సీతతో చెబుతుంది. ఆవిధంగా చేయడం కష్టంగా ఉందని సీత అంటుంది. చాలా హాయిగా ఉంటుంది ప్రయత్నించమని ఊర్మిళ అంటుంది. ఊర్మిళ మాటలు విన్న సీత తపస్సు చేస్తుంది. క్రమంగా సీత మనస్సు శాంత పడింది. వాల్మీకి అశ్వమేధ యాగం చూసి వచ్చే నాటికి సీత మనస్సు పూర్తిగా తేట పడుతుంది. సీతకు వాల్మీకిని యాగం గురించి అడగాలని కూడా అనిపించలేదు. రాముడు లవకుశులను స్వీకరిస్తాడు. సీతను కూడా స్వీకరిస్తాడు. కానీ ఆమె నిండు సభలో తన పవిత్రతను నిరూపించుకోవాలని రాముడు అన్నట్లు వాల్మీకి చెబుతాడు. సీత శాంత చిత్తంతో తాను ఎక్కడ నుంచి వచ్చిందో అక్కడికి ప్రయాణమవుతుంది.

ఈ కథలో ఊర్మిళ తనలో కలిగే ఆగ్రహావేశాలను, ఉద్వేగాలను, దుఃఖాన్ని అదుపు చేసుకుని, ఏ భావాలకు లొంగి పోకుండ, అన్నింటికి అతీతమైన శాంతిని పొందుతుంది. అదే శాంతిని సీత కూడా పొందే విధంగా ఊర్మిళ చేస్తుంది. ఇక్కడ సమకాలీన సమాజానికి రచయిత్రి ఒక సందేశాన్ని అందజేసింది. పురుషాధిక్య భావజాలంగల సమాజంలో స్త్రీలు ఏవిధంగా నలిగిపోతూ తమ ఉనికిని కోల్పోతున్నారో వివరించింది. రామాయణ కాలం నుంచి నేటి వరకు సమాజంలో మార్పు లేదని చెప్పవచ్చు. అందువల్లే సాహిత్యంలో కూడా మార్పు సంభవించలేదు. ఊర్మిళ, సీత వంటి స్త్రీలు, రాముడు, లక్ష్మణుడు వంటి పురుషులు నేటి సమాజంలో ఇంకా ఉన్నారు. సమకాలీన సమాజంలో స్త్రీలు దుఃఖానికి, ఆగ్రహావేశాలకు గురి కాకుండ, ఊర్మిళ, సీతవలే శాంతి మార్గాన్ని అవలంభించి, స్వార్థపూరిత పురుష భావజాలం నుండి విముక్తులు కావాలని సూచించింది. తమ జీవిత గమ్యాన్ని ఏర్పరచుకుని, ఆ గమ్యాన్ని చేరుకోవాలని, తమ జీవితాలను బలి చేసుకోవద్దని ఒక ఉద్బోధ చేసి కృత కృత్యురాలయింది రచయిత్రి.

రామాయణంలోని పాత్రలను నాగరిక, ఆధునిక జీవనం గడుపుతున్నామని చెప్పుకుంటున్న నేటి సమాజానికి అన్వయించి సాహిత్యాన్ని రూపొందించు కుంటున్నామంటే ఆనాటికి, ఈనాటికి సమాజంలోను, మనుషుల ఆలోచనా విధానంలోను, వారి మనస్తత్వాలలోను, కౌటుంబిక జీవనంలోను ఎటువంటి మార్పును ఆధునికతను సాధించలేదని చెప్పవచ్చు.

ముగింపు

విముక్తలో ఉన్న స్త్రీ పాత్రలు సీత, అహల్య, శూర్పణఖ, రేణుక, ఊర్మిళ రామాయణంలో చిత్రించినంత పరాధీన పాత్రలు కావు. సీత శివధనుస్సును ఎత్త గలిగినంత శక్తి గల స్త్రీ. ఆ శక్తిని ఉపయోగించ లేని సామాజిక పరిస్థితులలో ఆమె చిక్కుకొంటుంది. రామాయణంలో అవసరమై నపుడు తమ శక్తిని ఉపయాగించిన స్త్రీలు కూడా ఉన్నారు. కైక దశరధుణ్ణి యుద్ధరంగంలో రక్షించింది.

రచయితలు కొన్ని విలువల కోసం పురాణాలను రాశారని చెప్పవచ్చు. ఆ స్త్రీలు విలువలను ప్రశ్నించుకుంటూ, వాటిని దాటే ప్రయత్నం చేసి, ఆ పాత్రల అంతరంగ శోధన చేస్తే వారి బలం, శక్తి సమాజానికి అర్థమవుతుంది. నేటి ఆధునిక స్త్రీలు కూడా కొన్ని పరిస్థితులలో తమ శక్తిని మరచిపోయి, ఒక్కొక్క సారి పరాధీనలుగా ఉండి పోతున్నారు. ఒక్కొక్కసారి శక్తిని ప్రదర్శిస్తున్నారు. సూక్ష్మ పరిశీలన చేసినట్లైతే,

ఆపురాణ పాత్రలు ఎదుర్కొన్న సందర్భాలకు, సంఘర్షణలకూ, ఆధునిక స్త్రీ ఎదుర్కొంటున్న సమస్యలకు, సంఘర్షణకూ చాలా పోలికలున్నాయి. సమకాలీన సమాజంలో స్త్రీల అణచివేత, వారిపై పురుషుల ఆధిపత్యం మారలేదు. అందువల్లే రచయిత్రి ఈ కథలలో పురాణ పాత్రల ద్వారా వర్తమాన స్త్రీల జీవనాన్ని సమన్వయ పరుస్తూ, ఆధునిక స్త్రీలలో ఉన్న శక్తి, సామర్థ్యాలను, వెలికి తీసే ప్రయత్నం చేశారు. వారిలో ఉన్న పరాధీనతను రూపుమాపి, నేడు స్త్రీలపై జరుగుతున్న, శారీరక, మానసిక దాడులనుండి బయటపడి, వారు ఆత్మస్థైర్యంతో, ఆత్మసౌందర్యం కలిగి తనదైన గమ్యాన్ని ఎంచుకుని, ఆ గమ్యం దిశగా పయనించి, స్వతంత్రంగా జీవించాలనే ఈ కథలను ఓల్గా రాశారని చెప్పవచ్చు. ఎంతో పరిశ్రమ చేసి రచయిత్రి ఈ విముక్త కథా సంపుటిని సమకాలీన సమాజానికి అందజేశారు. ప్రతి స్త్రీ తనను తాను దక్కించుకోవడానికి యుద్ధం చెయ్యాలి. తపస్సు చేసి, మనోనిబ్బరత కలిగి తన యదార్థ శక్తి తెలుసుకోవాలి. అప్పుడే కార్యాలయాలలో ఎదురయ్యే సమస్యలను కూడా పరిష్కరించుకోగలదు. నిజాయితీ నిబద్ధత లేని పురుషుల మధ్య ఒంటరిగా పోరాడి గెలవగలదు. ఈ కథలలో పురుషుల సంకుచిత మనస్తత్వాలు, రచయిత్రి కూలంకషంగా చర్చించారు.

ఉపయుక్త గ్రంథాలు

1. ఓల్గా. 2016. విముక్త కథలు. కర్షక్ ఆర్ట్ ఫింటర్స్, హైదరాబాదు.
2. కృష్ణకుమారి, నాయని. 2000. తెలుగు జానపద విజ్ఞానం, సమాజం-సంస్కృతి, సాహిత్యం. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. హైదరాబాదు.
3. భుజంగరెడ్డి, బాణాల. 2020. తెలుగుసాహిత్యంలో స్త్రీవాదం. తెలుగు అకాడమి. హైదరాబాదు.
4. లక్ష్మి,పి. 1993. కవయిత్రుల కవిత్వంలో స్త్రీ మనోభావాలు. పద్మావతి ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాదు.
5. వసంత, కన్నాభిరన్. 1990. పర్ స్పెక్టివ్స్, హైదరాబాదు.

(శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్& సైన్స్ కళాశాల కరీంనగర్, తెలుగుశాఖ, మరియు మద్రాస్ విశ్వవిద్యాలయం, చెన్నై తెలుగు శాఖ అంతర్జాతీయ సదస్సు జులై 02, 03 2021) (భావవీణ మాసపత్రిక [illegible])

తెలుగు వ్యావహారిక భాషా ఉద్యమం - గిడుగుస్ఫూర్తి

గిడుగు వేంకటరామమూర్తి పేరువినగానే గుర్తుకువచ్చేవి తెలుగు వ్యావహారిక భాషోద్యమం, సవరభాషా సాంస్కృతులపై ఆయన చేసిన విశేషమైన కృషి. తొలి తెలుగు భాషా శాస్త్రవేత్త గిడుగు రామమూర్తి పంతులుగారు.

19వ శతాబ్దంలో ఉత్తరార్థంలో ముగ్గురు సాహిత్య వైతాళికులు జన్మించారు. వారే కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ వెంకట అప్పారావు, గిడుగు వెంకటరామమూర్తి గారలు. ఈ ముగ్గురు మూడు రకాల అభ్యుదయ భావాలను కలిగి వాటిని అమలు పరచడానికి నిర్విరామంగా కృషి చేశారు. వీరేశలింగం పంతులుగారు సంఘసంస్కర్త, నవ యుగ సాహితీ నిర్మాత, ప్రజాహిత సంస్థ నిర్మాత, వీరేశలింగం ఆశయ సాధనకై సాంఘిక దృక్పథంతో సాహిత్య కృషి చేసినవారు అప్పారావు. సాంఘిక దృక్పథంతో భాషా కృషి చేసినవారు గిడుగు రామమూర్తిగారు. వీరు. 1863తో సం॥ ఆగష్టు 29వ తేదీన జన్మించారు. 1879 నాటికి మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. వీరు ఉన్నత విద్యలో చేరినపుడు గురజాడ అప్పారావు, ఆదిభట్ల నారాయణదాసు, మొదలైనవారు సహపాఠకులు.

1910లో గురజాడ 'దిద్దుబాటు' కథాసాహిత్యం ప్రారంభమైంది. అదే విధంగా 1910లో తెలుగు వ్యవహారిక భాషోద్యమానికి పునాది వేయబడింది. అప్పటి గ్రాంథిక భాషాభిమానులు వ్యవహారిక భాషోద్యమాన్ని వ్యతిరేకించేవారు. సనాతన సంప్రదాయ వాదులు సంఘసంస్కరణోద్యమాన్ని ఏవిధంగా వ్యతిరేకించేవారో గ్రాంథిక భాషాభిమానులు కూడా అంతే ఆధునిక భాషోద్యమం పట్ల వ్యతిరేకతను కనబర్చారు.

ఆనాటి సమాజంలో వెలువడిన సంఘ సంస్కరణోద్యమాల మాదిరిగానే సాంఘిక పరమైన ప్రయోజనం కోసం తెలుగు వ్యవహారిక భాషోద్యమం పుట్టింది.

ఈ ఉద్యమం నూటికి తొంభై శాతానికి మించి ప్రజలు విద్యావంతులైనపుడు సమాజంలో సుస్థితి ఏర్పడుతుందని, సామాజిక, రాజకీయ, ప్రయోజనాలను ప్రజలు అనుభవించ గలుగుతారని, ప్రజలను విద్యావంతులను చేయడానికి వారిలో సామాజిక బాధ్యతలను ఉద్భోదం చేయడానికి వాడుకభాష అత్యంత సహకారి అవుతుందని గిడుగు వారు వాదించారు. ముఖ్యంగా పాఠశాలల్లో విద్యార్థులు చదువుకునే పాఠ్యాంశాలలో వాడుక భాష ఉండాలని ఆనాటి విద్యాశాఖ కూడ అభిప్రాయపడింది.

1909-10 సం॥లో ప్రారంభమైన వ్యవహారిక భాషోద్యమం 1919 నాటికి సాఫల్యమైంది. 1919 సం॥లో గిడుగువారి ఉద్యమాన్ని ఆనాటి కృష్ణా పత్రిక, ఆంధ్రపత్రిక సమర్థించాయి. 1922 సం॥నాటికి మాలపల్లి నవల వాడుక భాషలో వెలువడింది. ఆ తరువాత వెలువడిన అనేక పత్రికలలో “తెలుగు పత్రిక” ఒకటి. ఈ పత్రిక వ్యావహారిక భాషోద్యమానికి విశేషమైన స్ఫూర్తిని తెచ్చింది. భాషాతత్త్వ వివేచనను శాస్త్రీయంగా నిర్వహించిన తొలి పత్రిక ‘తెలుగు పత్రిక’. ఈ పత్రిక వెలువడే నాటికి గిడుగువారు పర్లాకిమిడిలో ఉన్నారు. ఆ మారుమూల ప్రాంతం నుండి ఈ పత్రికను నిర్వహించడం వారికి చాలా కష్టమయ్యేది. ఈ పత్రికలో రాజశేఖరుడి కావ్యమీమాంసలోని ఒక వ్యాక్యాన్ని గిడుగు వారు పతాక స్థాయిలో సూక్తి వాక్యంగా ప్రచురించేవారు. సంస్కృతం గొప్ప భాషే అందులో ఎటువంటి సందేహం లేదు. అయితే ప్రాకృతానికున్న సౌందర్యం సంస్కృత భాష కెక్కడిది? ప్రాకృతమే మాకు ఇష్టం అని ఆసూక్తి వాక్యానికి భావం.

కేవలం భాషాశాస్త్రీయమైన విషయాలే కాకుండా గిడుగువారు తంజావూరు నుండి ఛత్రపురం వరకు తిరిగి సేకరించిన వ్యావహారిక భాషోద్యమానికి సంబంధించి సమస్త సమాచారాన్ని ప్రచురించాలనే ధ్యేయంతో ఈ పత్రికను స్థాపించినట్లు తెలుస్తుంది.

ఆంధ్ర సాహిత్య పరిషత్తు వ్యవహారిక భాషోద్యమానికి వ్యతిరేకంగా నిలబడినప్పుడు, గిడుగు రామమూర్తిగారు నగరాలలో కళాశాలలకు వెళ్ళి, అధ్యాపక బృందాలను కలుసుకొని, సభలు చేసి, తన వాదాన్ని వినిపించి, సాక్ష్యాధారాలను చూపించి, పూర్వులు వ్యావహారికాన్ని నిరసించలేదని వాళ్ళతో చర్చలు చేసేవారు. ఒప్పుకోకపోతే, ఎందుకు ఒప్పుకోలేదో లిఖిత పూర్వకంగా ఇవ్వవలసిందిగా కోరేవారు. ఆయన బళ్ళారి నుంచి బరంపురం వరకు పర్యటించి సేకరించిన

సాక్ష్యాలను తెలుగు పత్రికలో ప్రచురించేవారు. తాళపత్ర గ్రంథాల నుంచి, ముద్రిత గ్రంథాల నుంచి, సేకరించిన అంశాలను, తన ఉద్యమానికి ప్రామాణిక ఆధారాలుగా ఉపయోగించేవారు. మన పూర్వీకులు టీకలూ, టిప్పణులు, వ్యాఖ్యానాలు అన్నీ వ్యావహారికం లోనే రచించేవారని తెలియజేసేవారు.

గిడుగుకి మిత్రులయిన గోపాలయ్య పర్లాకిమిడిలో ఇంజనీరుగా పనిచేసేవారు. నన్నయ భారతపద ప్రత్యయ వర్గీకరణలో రామమూర్తిగారికి సహాయం చేసేవారు. పండితుల నుండి సేకరించిన ఈ అంశాల నన్నింటిని "[illegible]" తెలుగు రచన సంప్రదాయమునకు సాక్షం అనే శీర్షిక కింద తెలుగు పత్రికలో ప్రచురించేవారు. మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిలులో గ్రాంథికవాదుల పక్షాన పిఠాపురం రాజావారు అడిగిన ప్రశ్నలు, అందుకు కౌన్సిలులో జరిగిన చర్చలు, ప్రభుత్వం వారిచ్చిన సమాధానాలను కూడ తెలుగు పత్రికలో ప్రచురించేవారు.

స్త్రీలు, చిన్న పిల్లలు చదువుకోడానికి తగిన రచనలు వెలువడకపోవడానికి కారణం తెలుగు వచన రచనకు గల అనావశ్యకమైన నియమ నిబంధనలే అని గిడుగువారు అనేవారు. జనసామాన్యంలో విద్యను, విజ్ఞానాన్ని వ్యాపింపజేయాలంటే వాఙ్మయాన్ని మించిన సాధనం మరొక్కటి లేదని, గిడుగువారు పదేపదే బోధించేవారు.

గిడుగు రామమూర్తి పంతులుగారి ఉద్యమస్ఫూర్తితో ఆచార్య ఎన్.ఎస్.రాజు గారు 1995లో "మాతృభాషాసమితి"ని స్థాపించారు. 2003లో 'తెలుగు భాషా చైతన్య సమితి'గా మార్చారు. విద్యారంగం, ప్రభుత్వ వ్యవహారాలు, ప్రసార మాధ్యమాలు, సామాజిక జీవనం అనే నాలుగు విభాగాలను భాషా వినియోగ రంగాలుగా గుర్తించారు. ఆ రంగాలలో తెలుగు వాడుక గురించి సమాజం దృష్టికి తీసుకొని వెళ్ళారు.

గిడుగువారి వ్యావహారిక భాషోద్యమం భాషాశైలికి సంబంధించింది. ఆధునిక భాషేవాడాలని రచయితలను ఒప్పించడమే లక్ష్యంగా గలది అది విద్వదుద్యమం. ఆచార్య ఎస్ రాజుగారు తెలుగు భాషాచైతన్య సమితి పేరుతో నిర్వర్తించినది భాషా చైతన్యోద్యమం. సమాజంలోని విద్య ప్రభుత్వ కార్యాలయాలు మొదలగు వ్యవస్థీకృత రంగాలలో తెలుగు వాడుక పెరగడమే లక్ష్యంగా గలది. ఇది సామాజికోద్యమం. వ్యవహారిక భాషోద్యమం అప్పటి అవసరం, భాషా చైతన్యోద్యమం ఇప్పటి అవసరం. వ్యవహారిక భాషోద్యమానికి కాలాను కూల్యత కలసివచ్చింది.

విద్యాంసుల ఆమోదం లభించింది. ఫలితంగా రచనలలో ఆధునిక భాష వ్యాప్తి చెందడం చేత ఉద్యమం విజయవంతం అయ్యింది. ఈనాటి భాషా చైతన్యోద్యమానికి ప్రజామోదమే ఉంది కాని కాలానుకూల్యత లేకపోవడం చేత విద్య మొదలైన రంగాలలో తెలుగు వినియోగం పెరగలేదు. అయినా సమాజంలో తెలుగుభాషా చైతన్యం వ్యాప్తి చెందడం చేత ప్రస్తుత ఉద్యమం పాక్షిక విజయం సాధించినట్లే.

2015,16 సంవత్సరాలకు సామాజిక వ్యవస్థలలో తెలుగు వాడుక పెరగడం అనేది ఎండమావిలా కనిపిస్తుంది. అంటే ఇప్పటి లక్ష్యాల ద్వారా కలిగే ప్రయోజనాలను సమాజం ఆశించడం లేదని తెలుస్తోంది. కాబట్టి తెలుగు ద్వారా ఇప్పటి తెలుగు భాషా ఉద్యమానికి ఉన్న సమాజానికి కావాలసిన ప్రయోజనం పొందడానికి కొత్త లక్ష్యాలు నిర్దేశించుకొని ఉద్యమించాలి. సామాజిక ఉద్యమాలు రాజీకయ, ఆర్థిక వ్యవస్థల ప్రమేయంతోనే విజయవంతం అవుతాయని, దానిని చేపట్టడానికి తెలుగు భాషాభిమానులు, సామాజిక కర్తవ్యాన్ని గుర్తెరిగి యువకులు ముందుకు రావాలని ఆచార్య రాజు గారు సూచించారు. తెలుగు మీద అభిమానం అంటే తెలుగును సామాజిక ప్రయోజనానికి వినియోగించడానికి కృషి చెయ్యడం అని కూడా సూచించారు.

ఉపయుక్త గ్రంథాలు

1. వేంకట రామమూర్తి, గిడుగు. 1879. ఆంధ్ర పండిత బిషక్కుల భాషా బేషజం. విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ.
2. వేంకట రామమూర్తి, గిడుగు. 1991. నేటి తెలుగు నివేదిక విశాలాంధ్ర ప్రచురణాలయం, హైదరాబాదు.
3. వేంకట రామమూర్తి, గిడుగు. 1992. సాహిత్య వ్యాసాలు. విశాలాంధ్ర ప్రచురణాలయం, హైదరాబాదు.
4. రాజు, ఎన్.ఎస్. 2001. గిడుగు లేఖలు. విశాలాంధ్ర ప్రచురణాలయం, హైదరాబాదు.
5. రాజు, ఎన్.ఎస్. 2016. తెలుగు భాషా చైతనోద్యమం. తెలుగు భాషా చైతన్య సమితి, హైదరాబాదు.

(ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురం (జాతీయ సదస్సు ఆగష్టు 29, 2018) (భావవీణ మాసపత్రిక [illegible])

□ □ □

మాతృభాషా మాధ్యమం - సాంకేతిక పదాలు

ఉపోద్ఘాతం

శిశువు తల్లి గర్భం నుండి బయటికి వచ్చిన తరువాత నేర్చుకునే భాషను మాతృభాషగా వ్యవహరిస్తారు. ఆ శిశువు తల్లి గర్భంలో ఉన్నంత కాలం అడగకుండానే అన్ని అవసరాలు తీరుతాయి. ఒకసారి ఆ శిశువు బయటికి రాగానే ఏడుస్తుంది. ఆనాటి నుంచి తనకు కావలసిన వాటిని ఏడ్చి సాధించుకుంటుంది. ఆ తరువాత తల్లి మరియు కుటుంబ సభ్యులు వ్యవహరిస్తున్న భాషను తనకు తెలియకుండానే నేర్చుకుంటుంది. కుటుంబ సభ్యుల ప్రేమను, ఆదరణను, అభిమానాన్ని, ఆ భాషలోనే అనుభవిస్తుంది. ఆ శిశువు తాను పొందిన ప్రేరణతో మొదట నేర్చుకున్న భాషలోనే ప్రతిస్పందిండం, ప్రశ్నించడం సమాధానాలివ్వడం చేస్తుంది. ఈ విధంగా ఇంట్లో తల్లి, మొదలైనవారి ప్రతి స్పందనలతో నేర్చే మొదటి భాష ఆ శిశువు మాతృభాష అవుతుంది. ఆ శిశువు అసంకల్పితంగా, సునాయాసంగా తను నేర్చుకున్న భాషలో తన భావాలను ఎదుటి వారికి తెలిసేలా వ్యవహరిస్తుంది. అటువంటి శిశువు జీవితంపై మాతృభాష ఎంతో ప్రభావాన్ని చూపుతుంది. అది తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, హిందీ, ఉర్దూ, మరాఠీ, ఆంగ్లం మొదలైన భాషలలో, ఏ భాషైనా కావచ్చు.

ఈ విధంగా పెరిగే క్రమంలో కుటుంబంలోని వ్యక్తులు కార్, బైక్, బస్ లాంటి బొమ్మలను తెచ్చి, నీ కోసం కార్ తెచ్చాను. బైక్ తెచ్చాను అని చెబుతుంటారు. అదే విధంగా టి.వి, రిమోట్, కంప్యూటర్, గ్లాస్, కాఫీ, టీ, ట్రైన్ మొదలైన అనేక పదాలు తెలుగు భాషతో సమానంగా నేర్చుకుంటాడు. ఆ తరువాత ఈ పదాలన్ని తెలుగు భాషతో సమానంగా ఉచ్చరించడం జరుగుతుంది. మానవ జీవన పరిణామ క్రమంలో జరిగిన మార్పులుగా వీటిని చెప్పుకోవచ్చు. నిత్యం మనం మాట్లాడే

భాషను తీసుకున్నట్లైతే ధ్వని పరిణామం, అర్థ పరిణామం జరిగి అనేక మార్పులు సంతరించుకుంటుంది.

1. **ధ్వనిపరిణామం:** "ఒక భాషలో ఒక కాలంలో ఉన్న ధ్వని తరువాత కాలంలో మార్పు చెందటాన్ని ధ్వనిపరిణామం" అంటారు. పదంలో ఉన్న వర్ణాలు పోవడమూ లేదా కొత్త వర్ణాలు చేరడమూ జరుగుతుంది. ఏ భాషలోనైనా ఇదే విధంగా జరుగుతుంది. వర్ణ సమీకరణ, వర్ణభేదం, వర్ణసమ్మేళనం, వర్ణవ్యత్యయం, వర్ణాగమం మొదలైనవి ఏర్పడతాయి.
2. **అర్థ పరిణామం:** కొన్ని పదాలలో కాలక్రమేణ అర్థాలలో మార్పులు రావడం సహజం. ఈ విధంగా కలిగే మార్పును 'అర్థ పరిణామం' అంటారు. "భాష కాలక్రమంలో వర్ణాలు, వ్యాకరణ నిర్మాణమూ మారినట్లుగానే పదాల అర్థాలు కూడ మారతాయి. ఒక భాషలో పదాల్లో ఉన్న అర్థాల్లో వచ్చిన మార్పుని 'అర్థపరిణామం' అని ఆచార్య పి.యస్. సుబ్రహ్మణ్యంగారు నిర్వచించారు. ఈ విధంగానే అర్థవ్యాకోచం, అర్థ సంకోచం, అర్థ సౌమ్యత, అర్థ గ్రామ్యత మొదలైనవి ఏర్పడతాయి.

ఈ క్రమంలో తెలుగు భాషలో అనేక మార్పులు కనబడుతున్నాయి. అనేక భాషాపదాలు వచ్చి చేరుతున్నాయి. అదే విధంగా ఆంగ్లభాషలోని సాంకేతిక పదాలు (టెక్నికల్ వర్డ్స్)ని కూడ ఉపయోగించవచ్చు. వాటిని యథాతథంగా పాఠ్యాంశాలలో ప్రయోగించడం వల్ల విద్యార్థులకు అభ్యాసం సులభతరమవుతుంది. వారు పై తరగతులకు వెళ్ళినపుడు ఎక్కువ ఇబ్బందిపడకుండా అధ్యాపకులు చెప్పే పాఠ్యాంశాలను సులువుగా గ్రహించగలుగుతారు. దీనివల్ల తెలుగు భాషా పరిధి పెరుగుతుంది.

శ్రీ కోవెలవెన్ను రామకోటేశ్వరరావుగారు ఒక భాష వల్ల మరొక భాషకు ప్రమాదం లేదంటారు. ఆంగ్ల సాహిత్యం తెలుగు సాహిత్యానికి ప్రమాదం తెచ్చిపెట్టిందనే మాటలకు ఆశ్చర్యపడేవారు. ఆయన ఆంగ్లభాషా ఆవశ్యకతను గురించి ఈ కింది విధంగా వ్రాశారు.

"మనకు హిందీ, ఇంగ్లీష్ రెండూ అవసరమే, కనుక కాలపరిమితులు లేకుండా ఆంగ్లం అధికార భాషగా గాని, పరిపాలన భాషగా గాని ఉండాలి. రాజ్యాంగంలో తక్కిన భాషలతో పాటు ఇంగ్లీషును చేర్చాలి. మన వారసత్వంలో ఆంగ్ల సాహిత్యం కూడ చేరింది. ఆంగ్లమంటే ఆంగ్లం ద్వారా వచ్చిన ఇతర సాహిత్యాలు కూడా"

అని వ్యాఖ్యానించారు. (తిరుమల రామచంద్ర, 1975 : 36)

ఇటువంటి పెద్దల అభిప్రాయాలను నేడు పరిగణనలోకి తీసుకోవలసిన ఆవశ్యకత ఉంది. ఆంగ్లంలో ఉన్న సాంకేతిక పదాలను యథాతథంగా తెలుగు మాధ్యమంలోకి తీసుకోవడం వల్ల విద్యార్థుల విజ్ఞాన పరిధి పెరుగుతుంది. ఆ పదాలను తెలుగులోనే రాయవచ్చు. ఉదా: INTERNATIONAL - అంతర్జాతీయ, INTERNET - అంతర్జాలం, అని వాడుతున్నాం. అలాగే జేబు – టర్కీ పదం, వకీలు, దావాఖానా మొదలైన ఉర్దూ పదాలను మనం తెలుగు పదాలుగా వాడుతున్నాం. కాని సైన్స్‌లో ఉన్న 'TECHNICAL WORDS' ని మాత్రం అనువాదం చేసి చెబుతున్నారు. మాతృభాషలో బోధన జరిగేటప్పుడు ఈ కింది జాగ్రత్తలు తీసుకోవాలి.

1. తెలుగు మీడియంలో బోధన చేసేటప్పుడు అన్ని పదాలను అనువాదం చేయలేము.
2. 'SCIENCE' బోధించేటప్పుడు దానిలో ఉన్న 'TECHNICAL WORDS' ని అనువాదం చేయకుండా యథాతథంగా బోధించడం వల్ల, విద్యార్థి పై చదువులకు వెళ్ళినపుడు, అతని అవగాహనా పరిధి పెరిగి, 'COMMUNICATION' సులభమవుతుంది.
3. ప్రస్తుతం తెలుగు మీడియం విద్యార్థులకు 'TECHNICAL WORDS' అన్నీ తెలుగులోకి అనువాదం చేయబడి ఉంటున్నాయి. దీనివల్ల ఈ మీడియంలో చదివిన విద్యార్థులు పై తరగతులకు వెళ్ళిన తరువాత ఆ 'TECHNICAL WORDS' కి ఆంగ్ల పదాలు తెలియక ఇబ్బంది పడుతుంటారు. విద్యార్థులకు అటువంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే ఆ పదాలను ఆంగ్లంలోనే బోధించాలి మిగిలిన సంభాషణంతా మాతృభాషలో ఉండాలి. ఈ విధానాన్ని అవలంబించి భాషా పరిధిని పెంచుకోవలసిన ఆవశ్యకత ఉంది.

భౌతికశాస్త్రంలో గల కొన్ని అనువాద పదాలు

FORCE	బలం
ENERGY	శక్తి
VISCOSITY	స్నిగ్ధత
SURFACE TENSION	తలతన్యత
RESTORING FORCE	పునఃస్థాపక బలం

ELLIPSE	దీర్ఘవృత్తం
STRAIGHT LINE	సరళరేఖ
DIFFERENTIATION	వ్యవకలనం
POLAR COVALENT BOARD	ధృవసంయోజన బంధం
MAGNIFICATION	ఆవర్ధనం
EARTH CRUST	భూపటలం
ఇక్షిఖఖంఅఖఖజెఓ ఞజెఅఇఖఋ	నిష్కరణ ప్రక్రియ
RELATIVE VELOCITY	సాపేక్ష వేగం
COEFICIENT OF RESISTITUTION	ప్రత్యావస్థన గుణకం

పైన పేర్కొన్న పదాలన్ని సంస్కృత పదాలు. ఈ పదాలకు బదులుగా ఇంగ్లీషులో ఉన్న ఆ సాంకేతిక పదాలనే తెలుగు మీడియంలో బోధిస్తే, విద్యార్థులకు మేలు జరుగుతుంది. ఇంకా అనేక విజ్ఞానశాస్త్రాలను పరిశీలించినట్లైతే అనేక పదాలు వెల్లడి అవుతాయి.

ఉత్తర భారతదేశంలో 'ENGLISH MEDIUM' విద్యార్థులకు కూడా హిందీలోనే బోధన చేస్తారు. కాని 'TECHNICAL WORDS'ని మాత్రం ఇంగ్లీషులోనే చెబుతారు. కాబట్టి వారు IIT, NIT లలో సులువుగా సీటు సంపాదించ గలుగుతున్నారు. కాని తెలుగు రాష్ట్రాలలో English Medium లో చదువుతున్న తెలుగు విద్యార్థులకు బోధన English లోనే జరుగుతుంది. దీని వలన ఆయా Subject లలో అవగాహన పూర్తిస్థాయిలో ఉండడంలేదని, ఆ తరగతులలో చదివే విద్యార్థులు అభిప్రాయపడుతున్నారు. Science లో ఉన్న Technical పదాలను తెలుగులోనికి అనువదించకుండా బోధన తెలుగులో చేయడం వల్ల విద్యార్థులలో అవగాహన పెరుగుతుంది.

'TEXT BOOK'లో భాష మారాలి. TECHNICAL WORDS ని అనువాదం చేయకుండా యధాతథంగా తీసుకోవాలి. SCIENCE మరియు TECHNOLOGY బోధన తెలుగులో జరగాలి. ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత విద్యా స్థాయి వరకు తెలుగులో బోధన జరగాలి. ఆ విధంగా జరగకపోతే భవిష్యత్తులో తెలుగు కూడ సంస్కృతంలా కావ్యాలలో మిగిలిపోతుంది.

JRF, NET EXAM, HCU వంటి విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్షలు

తెలుగులో కూడ జరిగినట్లైతే తెలుగు మీడియం విద్యార్థులు ప్రయోజనం పొందుతారు. జర్మనీ, కొరియా, జపాన్, చైనా, ఫ్రాన్స్, ఇంగ్లండ్, అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాలలో మాతృభాషలోనే విద్యాబోధన జరుగుతుంది.

ముగింపు

హింది ఒక్కటే 'NATIONAL LANGUAGE' అనడం సరియైనది కాదు. హిందీతో పాటు తెలుగు, కన్నడం, తమిళం, మలయాళం మొదలైన అన్ని భాషలు జాతీయ భాషలే. కాబట్టి అన్ని భాషలలోను ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత విద్యా స్థాయి వరకు మాతృభాషా మాధ్యమంలోనే విద్యాబోధన జరుపుకోవచ్చు. ఆ విధంగా జరిగినపుడే విద్యార్థులలో సృజనాత్మకత పెరుగుతుంది. మనం ఉన్నత పదవులను అధిష్టించిన వ్యక్తులతో మాట్లాడిన లేదా పరిశీలించినచో, వారందరు వారి మాతృభాషల్లోనే విద్యను అభ్యసించిన విషయం వెల్లడి అవుతుంది. మాతృభాషలో చదివినవారు, తాము నేర్చుకున్న విషయం ఏ భాషలో ఉన్నప్పటికి, వాటికి తమ మాతృభాషలోనే మనసులో ప్రణాళికను సిద్ధం చేసుకుని వాటిని ప్రదర్శిస్తారు. ఈ విధంగా మాతృభాషా బోధన వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయి.

ఉపయుక్త గ్రంథాలు

1. కృష్ణమూర్తి, భద్రిరాజు. 1994. తెలుగు భాష చరిత్ర. తెలుగు విశ్వ విద్యాలయం, హైదరాబాదు.
2. కష్ణమూర్తి, భద్రిరాజు. 2014. భాష సమాజం సంస్కృతి. NEELKAMAL PUBLICATIONS, హైదరాబాదు.
3 రామచంద్ర, తిరుమల. 1975. మరపురాని మనీషి. యువభారతి, సికింద్రాబాదు.
4. ఎన్. ఎస్. రాజు. 2016. తెలుగు భాషాచైతన్యోద్యమం. తెలుగు భాషా చైతన్య సమితి, హైదరాబాదు.
5. భౌతికశాస్త్ర అధ్యాపకులు కె. శంకరరావు ఆలోచన.

(హైదరాబాదు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ & తెలుగు అకాడమి, హైదరాబాదు అంతర్జాతీయ సదస్సు జులై 29, 30 2020) (భావవీణ మాసపత్రిక [illegible])

□ □ □